www.manatelangana.news
Mana Telangana
మన తెలంగాణ
హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 202 | గురువారం | 11 జనవరి, 2018
...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

రిటైల్, నిర్మాణ రంగాల్లో 100% ఎఫ్‌డిఐలు

- ఎయిరిండియాలో 49%

న్యూఢిల్లీ : విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానంలో పలు కీలక సవరణలకు మోడీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. త్వరలో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌ను దృష్టిలో పెట్టుకొని పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. బుధవారం మోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు మరింత అవకాశం కల్పించింది. సింగిల్ బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్‌లోను, నిర్మాణ రంగంలోను, విద్యుత్ కొనుగోలు ఒప్పందాల విషయంలో నిబంధనలను తరువాయి 6లో





చెక్కు చెదరకుండా

చెక్కుల ద్వారానే రైతులకు పెట్టుబడి సాయం

పలు మార్గాల పరిశీలన తరువాత మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

పేద, ధనిక తేడా లేకుండా అందరికీ ఒకే విధంగా అందజేత

పెద్ద రైతులు స్వచ్ఛందంగా వదులుకునేందుకు అవకాశం కల్పించే గివ్ ఇట్ అప్

బ్యాంకుల్లో తగినంత నగదు ఉండేలా చర్యలు

భూమి సాగులో లేకపోయినా చెల్లింపు

మన తెలంగాణ/ హైదరాబాద్ : వ్యవసాయ పెట్టుబడి పథకం కింద ఇవ్వనున్న ఎకరాకు రూ.4 వేల ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపంలో పంపిణీ చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. భూయజమానులకు ఎంత భూమి ఉన్నా సీలింగ్ లేకుండా ప్రతి ఎకరాకూ ఇవ్వాలని అభిప్రాయపడుతోంది. వ్యవసాయ భూములు ప్రస్తుతం సాగులో ఉన్నా లేకున్నా ఈ ఆర్థిక సాయాన్ని ఇవ్వాలనే భావిస్తోంది. ఒకవేళ ధనిక రైతులు ఎవరైనా ఈ ఆర్థిక సాయం అవసరం లేదని భావించినట్లయితే ఎల్‌పిజి సిలిండర్లపై సబ్సిడీ వద్దనుకుంటున్నట్లుగానే 'గివ్ ఇట్ అప్' తరహాలో స్వచ్ఛందంగా నిర్ణయం తీసుకోవచ్చని అభిప్రాయపడింది. ఈ అంశాలన్నింటినీ సిఎం కెసిఆర్‌కు మంత్రివర్గ ఉపసంఘం వివరించింది. చెక్కుల పంపిణీ గురించి మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గ్రామాలలోని మెజార్టీ రైతులు చెక్కుల రూపంలోనే చెల్లించాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు అన్ని జిల్లాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతుల నుంచి తీసుకున్న అభిప్రాయాల్లో చెక్కుల ద్వారా చెల్లించాలన్న వారే ఎక్కువగా ఉన్నారని వ్యాఖ్యానించారు. ఇదే ప్రతిపాదనను ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావుకు వివరిస్తామని తెలిపారు. ప్రతి సీజన్‌లో రైతులకు ముందస్తు పెట్టుబడిగా రూ. 4 వేలు తరువాయి 6లో


పిఆర్‌సికి ముందే 30%

మధ్యంతర భృతి ?



జూన్ లేదా జులై నుంచి రాష్ట్ర ఉద్యోగులకు ఇవ్వాలని యోచన

మూడున్నర లక్షల మంది సిబ్బంది, ఉపాధ్యాయులు, రెండు లక్షల మంది పదవీ విరమణ చేసిన వారికి లబ్ధి



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు త్వరలో తీపి కబురు అందనుంది. కొత్త వేతన సవరణ సంఘం (పిఆర్‌సి) చేసే సిఫారసులతో సంబంధం లేకుండా రానున్న జూన్ లేదా జులై మాసం నుంచి వర్తించే విధంగా 30 శాతం మధ్యంతర భృతిని ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఏర్పాటైన పదవ పిఆర్‌సి పదవీకాలం ఈ ఏడాది జులై 1వ తేదీతో ముగుస్తున్నందున 11వ పిఆర్‌సిని ప్రభుత్వం త్వరలోనే ఏర్పాటు చేయనుంది. నిర్దిష్టమైన అధ్యయనం చేసి సిఫారసులతో కూడిన నివేదికను అందజేయడానికి కనీసం ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉన్నందున ఈ నెలాఖరుకల్లా పిఆర్‌సి ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడే అవకాశం ఉంది. గత పిఆర్‌సి 29 శాతం ఫిట్‌మెంట్‌ను సిఫారసు చేసినప్పటికీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిఎం కెసిఆర్ ఉద్యోగులను, ఉపాధ్యాయులను ఆశ్చర్యపర్చే రీతిలో 43 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించారు. ఆర్‌టిసి సిబ్బందికి కూడా ఇదే తరహాలో ఫిట్‌మెంట్‌ను ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ కూడా ఇదే తరహాలో నిర్ణయం తీసుకోక తప్పలేదు. పదవ పిఆర్‌సి చేసిన సిఫారసులతో సంబంధం లేకుండా కెసిఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇదే తరహాలో కొత్త పిఆర్‌సి సిఫారసులు ఎలా ఉన్నా ఉద్యోగులను, ఉపాధ్యాయులను సంతృప్తి పర్చే విధంగా ఫిట్‌మెంట్ ప్రకటన కూడా ఆశ్చర్యపర్చేలా ఉండనున్నట్లు సమాచారం. అందులో భాగంగా మధ్యంతర భృతిగా 30 శాతం ఫిట్‌మెంట్‌ను త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో ఏ మేరకు ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందో ఇప్పటికే ఆర్థిక శాఖ అధికారులను సిఎం సంప్రదించినట్లు తెలిసింది. ప్రస్తుతం పనిచేస్తున్న సుమారు మూడున్నర లక్షల ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో తరువాయి 6లో

50:60

కృష్ణ నీటిని తెలంగాణ 50, ఎపి 60 టిఎంసిలు వాడుకోవాలని బోర్డు త్రిసభ్య కమిటీ నిర్ణయం



మన తెలంగాణ/ హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో ఉన్న నీటిలో తెలంగాణ 50 టిఎంసిలు, ఆంధ్రప్రదేశ్ 60 టిఎంసిలు వినియోగించుకోవాలని కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం నిర్ణయించింది. జలసౌధలో బుధవారం సమావేశమైన త్రిసభ్య కమిటీ ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు అంగీకారానికి వచ్చారు. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో కలిపి 130 టిఎంసిల నీటి లభ్యత ఉంది. అందులో ఆంధ్రప్రదేశ్ వాటాగా 73.42 టిఎంసిలు, తెలంగాణ వాటాగా 60.33 టిఎంసిలు వస్తుంది. ఈ నీటినే వచ్చే ఆగస్టు వరకు జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరాన్ని దృష్టిలో పెట్టుకోవాలని బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం సూచించారు. ఇరు రాష్ట్రాలకు తరువాయి 6లో

ఇస్రో చైర్మన్‌గా శివన్



న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్‌గా ప్రముఖ శాస్త్రజ్ఞుడు కె. శివన్ బుధవారం నియుక్తులయ్యారు. ఆయన ఎ.ఎస్.కిరణ్ కుమార్ స్థానంలో బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఇస్రో తన చారిత్రక 100వ ఉపగ్రహాన్ని, ఇతరుల 30 ఉపగ్రహాలతో కలిపి ఒకేసారి నింగిలోకి పంపడానికి 2 రోజుల ముందు ఆయన నియామకం ప్రకటన వెలువడింది. రోదసి శాఖ కార్యదర్శిగా, రోదసి కమిషన్ చైర్మన్‌గా శివన్ నియామకాన్ని కేబినెట్‌కు చెందిన నియామకాల కమిటీ ఆమోదించింది. ఆయన తరువాయి 6లో


అనుమతిలేని లే ఔట్‌లకు
రిజిస్ట్రేషన్ నో

పంచాయతీల పరిధిలో గృహ నిర్మాణాలపట్ల కఠినంగా వ్యవహరించాలని యోచన

కో-ఆప్షన్ సభ్యులుగా ఎన్ఆర్‌ఐలు, గ్రామవాసులు కాని వారు



మన తెలంగాణ / హైదరాబాద్ : పంచాయతీల్లో అనుమతి లేని లే అవుట్ల ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయకుండా చర్యలు తీసుకుంటే ఎలా ఉంటుందన్న దానిపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘం ఆలోచన చేస్తోంది. నూతన పంచాయతీరాజ్ చట్టం రూపకల్పనపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో మంత్రుల కమిటీ మూడో రోజూ సమావేశమైంది. సబ్‌కమిటీ సభ్యులైన మంత్రులు ఈటల రాజేందర్, జగదీశ్ రెడ్డి, తరువాయి 6లో



7లో మేడారం జాతరకు 4200 బస్సులు

హైదరాబాద్, వరంగల్ నుంచి ఎసి సర్వీసులు : సోమారపు



విద్యుత్ మే సవాల్

- రేవంత్‌రెడ్డి పిలుపును అంగీకరించిన బాల్క సుమన్
- 12న మధ్యాహ్నం 2 గంటలకు సిద్ధమన్న కాంగ్రెస్ నేత
- వేదిక నిర్ణయించాలని సూచించిన టిఆర్ఎస్ ఎంపి

3



కుంచెపోటు



పద్మావతిని చూడాలన్న ఆత్రం నాకులేదు, నేనేం ఖిల్జీని కాదు!

దావోస్‌కు కెటిఆర్

కేంద్రమంత్రి సురేష్ ప్రభు ఆహ్వానానికి ఒకె



మన తెలంగాణ/ న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖమంత్రి సురేష్ ప్రభును రాష్ట్ర ఎన్ఆర్ఆర్ సంక్షేమ, ఐటి శాఖల మంత్రి కె.తారక రామారావు కోరారు. బుధవారం ఢిల్లీలోని ఉద్యోగ్ భవన్‌లో సురేష్ ప్రభును ఆయన కార్యాలయంలో కెటిఆర్ మర్యాద పూర్వకంగా కలిశారు. సమావేశం అనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ దేశంలోనే టిఎస్ ఐపాస్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. దేశానికే ఆదర్శవంతంగా అభివృద్ధిలో దూసుకుపోతున్న రాష్ట్ర ప్రభుత్వం తరఫున దావోస్ సదస్సుకు రావాలని కేంద్ర మంత్రి కోరారని, ఆయన ఆహ్వానాన్ని మన్నించి తప్పక దావోస్ వస్తానని ఆయనకు తెలిపినట్లు మంత్రి వివరించారు. హైదరాబాద్ ఫార్మాసిటీ ఏర్పాటుకు కావాల్సిన నిమ్జ్ స్టేటస్, ఫార్మాసిటీ అభివృద్ధికి రూ.1500 కోట్లు ఇవ్వాలని కేంద్ర తరువాయి 6లో



కాళేశ్వరం భేష్

పనుల తీరు, వేగం ఘనం

- ప్రశంసలు కురిపించిన కేంద్ర జలసంఘం సిఇ

మన తెలంగాణ/ హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధుల ఖర్చు, సకాలంలో నిర్మించడం తెలంగాణ ప్రభుత్వానికి పెద్ద సవాల్ వంటిదని కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజినీర్ సికెఎల్ దాస్ అభిప్రాయపడ్డారు. దేశ చరిత్రలోనే ఈ ప్రాజెక్టు విభిన్నమైందని కాళేశ్వరం ప్రాజెక్టు పనులపై సంతృప్తి వ్యక్తపరిచారు. పనుల వేగాన్ని మరింత పెంచాలని, అప్పుడే తరువాయి 6లో

కన్ఫర్డ్ ఐఎఎస్‌ల జాబితాకు
యుపిఎస్‌సి ఆమోదం

3



వాచ్‌మన్‌ను బంధించి, గడియలు బిగించి
బంగారం చోరీ

7

- హైదరాబాద్ శివారు బాలాపూర్ మండలంలో చెడ్డీ గ్యాంగ్ బీభత్సం

సిఎంకు మానవ హక్కుల వేదిక బహిరంగ లేఖ

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ప్రాథమిక హక్కులు అమలవుతున్న తీరు, నిర్బంధ పరిస్థితులు, ప్రత్యామ్నాయ ఆలోచనల పట్ల ప్రజల అభిప్రాయాలు వ్యక్త పరిచే విషయంలో ప్రభుత్వం అసహనంతో వ్యవహరిస్తున్న తీరుపై మానవ హక్కుల వేదిక రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావుకు బుధ వారం నాడు బహిరంగ లేఖ రాసింది. ఈ మేరకు మానవ హక్కుల వేదిక తెలంగాణ అధ్యక్షులు గొర్రెపాటి మాధవ రావు, ప్రధాన కార్యదర్శి జి. మోహన్‌లు సిఎం కెసిఆర్‌కు లేఖ రాశారు. 12 పేజీల లేఖలో పలు అంశాలను వారు ప్రస్తావించారు. రాష్ట్రంలో ముందస్తు అరెస్టుకు సంబంధించిన ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాన్ని, బహిరంగ సభలను ఊరేగింపులపై పోలీసులు విచక్షణా రహితంగా 144 సెక్షన్ అలాగే, సెక్షన్ 30ని అమలు చేస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో ఎక్కడా కూడా కనీసం హాలులో సమావేశాలకు కూడా అనుమతులు ఇవ్వాడం లేదన్నారు. వామపక్ష పార్టీలను, ప్రజా సంఘాలకు , ఏ ఇతర ప్రజా సంఘాల సమావేశాలకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. (ఆ లేఖలో వెల్లడించారు. తమ జిల్లాకు వచ్చిన మంత్రికి కూడా ప్రజలు అర్జిలు ఇచ్చే అవకాశం లేకుండా పోతోందన్నారు. జెఏసి ఛైర్మన్ కోదండరామ్‌పై తీవ్ర నిర్బంధం, మంద కృష్ణ మాదిగపై అసహనం ప్రదర్శించి చట్ట వ్యతిరేకంగా వ్యవహరించడం తగదన్నారు.



నెలరోజుల్లో రేయాన్ కంపెనీ భవితవ్యం తేల్చండి

మన తెలంగాణ / హైదరాబాద్ : భూపాలపల్లి జిల్లా కమలాపూర్‌లో మూతపడిన రేయాన్స్ ఫ్యాక్టరీ (బిల్ట్) భవితవ్యాన్ని నెల రోజుల్లోగా తేల్చాలని కంపెనీ యాజమాన్యానికి ప్రభుత్వం అల్టిమేటం విధించింది. 32 నెలలుగా వేతనాలు చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపింది. డిప్యూటి సిఎం కడియం శ్రీహరి, హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, గిరిజన శాఖ మంత్రి చందూలాల్, ఎంపి సీతారాం నాయక్‌లు ఈ మేరకు బిల్ట్ కర్మాగారం సిఈవో నిహార్ అగర్వాల్‌తో బుధవారం చర్చలు జరిపారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కార్మికులకు ఈ నెల 12 వ తేదీలోపున ఒక నెల వేతనాలను ఇవ్వాలని ఆదేశించారు. వచ్చే నెల 14వ తేదీ వరకు ఈ కర్మాగారంపై కంపెనీ తన వైఖరిని ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. అప్పటికీ నిర్ణయం తీసుకోకపోతే ప్రభుత్వమే జోక్యం చేసుకుని కంపెనీ రిజిస్ట్రేషన్ చట్టాల ప్రకారం తగిన విధంగా స్పందిస్తుందని హెచ్చరించింది. వీలైనంతవరకు కంపెనీని నడిపించేందుకు ముందుకు రావాలని, అవసరమైతే రేయాన్ ఫ్యాక్టరీని పేపర్ పల్ప్ ఫ్యాక్టరీగా మార్చి నడిపించే ప్రతిపాదనలను పరిశీలించాలని కూడా కంపెనీ ప్రతినిధులకు మంత్రులు సూచించారు.

అడవులు పోయినా ప్రజలకు మేలు

- **హరితహారంతో తిరిగి పచ్చదనం**
- **కాళేశ్వరంపై అటవీ అధికారులు**



మన తెలంగాణ/ధర్మారం: రాష్ట్రంలోని 80 శాతం భూభాగానికి నీరందించే నీటిపారుదల ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం కావడం గర్వకారణంగా ఉందని అటవీశాఖ పిసిసిఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝూ తెలిపారు. భూపాలపల్లి, పెద్ద పల్లి జిల్లాల్లో జరుగుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను హైదరాబాద్ నుంచి 50 మంది అటవీశాఖ ఉన్నతాధికారులు వెళ్లి ప్రాజెక్టు పనులను పరిశీలించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులో బయలుదేరిన అధికారులు ముందుగా వరంగల్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి భూపాలపల్లి చేరుకున్న అధికారులు, అటవీశాఖ కార్యాలయంలోని ఉడెన్ హౌజ్‌ను పరిశీలించారు. ఆ తర్వాత మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ప్రాజెక్టు కోసం అటవీ భూముల బదలాయింపు, ప్రత్యామ్నాయ భూముల్లో అడవుల పెంపకం, తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో వివరాలు తెలుసుకున్నారు. మేడిగడ్డ బ్యారేజి, కన్నెపల్లి పంప్‌హౌజ్, అన్నారం బ్యారేజి పనులను పరిశీలించారు. ప్రతిసైట్ వద్ద ఇరిగేషన్ అధికారులు ఆయా ప్యాకేజీల విశేషాలు వివరించారు. ప్రాజెక్టు పనుల కోసం బదలాయిస్తున్న అటవీ భూములు, వాటి స్థానంలో ప్రత్యామ్నాయ అడవుల పెంపకం ప్రణాళికల వివరాలపై ఆరా తీశారు. ప్రపంచంలోనే పెద్ద పాజెక్టు కాళేశ్వరం అని ఝూ వర్ణించారు. తెలంగాణకే తలమానికంలా నిలిచే ప్రాజెక్టని, ఇందుకోసం ఇప్పటికే అటవీశాఖ అనుమతులు ఇచ్చామని స్పష్టం చేశారు. కాళేశ్వరం, పాలమూరు, సీతారామ తదితర ప్రాజెక్టులు పూర్తైతే రాష్ట్రంలో 80 నుంచి 90 శాతం సాగులోకి వస్తుందని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల కోసం విలువైన అటవీ భూమి పోతున్నప్పటికీ, ప్రత్యామ్నాయంగా పెద్ద ఎత్తున అడవుల పెంపకం చేపడుతున్నామన్నారు. హరితహారంలో వీలైనంత పచ్చదనం పెంచుతామని చెప్పారు. ధర్మారంలో టన్నెల్ పనులను కూడా అటవీ అధికారులు పరిశీలించారు. పెద్దపల్లి కలెక్టర్ దేవసేన, ఇరిగేషన్ అధికారులతో సమావేశమై టన్నెల్ పనుల వివరాలు తెలుసుకున్నారు.

వ్యవసాయ నీటి అవసరాలపై సుధీర్ఘంగా చర్చించిన అధికారులు

మన తెలంగాణ/హైదరాబాద్: వ్యవసాయం కోసం నీటి అవసరాలపై కృష్ణా బేసిన్‌తో పాటు రాష్ట్రంలోని మొత్తం నీటికి సంబంధించిన అంశాలపై వ్యవసాయ నిపుణులతో ఇరిగేషన్ అధికారులు చర్చించారు. ట్రిబ్యునల్‌లో రాష్ట్రానికి సంబంధించిన వ్యవసాయ అవసరాలు, నీటి డిమాండ్‌పై సమర్ధంగా చెప్పడానికి వీలుగా బుధవారం నాడు వ్యవసాయ వర్సిటీలో ఏర్పాటు చేసిన ఈ సమావేశం ఇరిగేషన్ అంతర్రాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ నరసింహారావు, ప్రొఫెసర్ టి.ప్రతాప్‌ల ఆధ్వర్యంలో జరిగింది. వ్యవసాయ సంబంధ సంస్థలైన ఐసిఎఆర్, ఐఐఎంఆర్, ఇక్రిశాట్, క్రిడా, వాలంతరీ, వ్యవసాయ శాఖ, వ్యవసాయ వర్సిటీలకు చెందిన 20 మంది శాస్త్రవేత్తలు సమావేశంలో పాల్గొన్నారు. వ్యవసాయం, నీరు, భూమికి సంబంధించిన పలు అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు. మరోమారు సమావేశం కావాలని నిర్ణయించారు. సమావేశంలో ప్రొఫెసర్ రాజిరెడ్డి, అడ్వకేట్ రవీందర్‌రావు, ప్రొఫెసర్ పళనిస్వామి, కన్సల్టెంట్ పహీమ్, శాస్త్రవేత్తలు డాక్టర్ మహేంద్రకుమార్, డాక్టర్ ఎస్.రవికుమార్ పాల్గొన్నారు.

సవరణ

తేది : 09.01.2018న ప్రచురించిన ఆంధ్రాబ్యాంక్ డిమాండ్ నోటీసులో అధీకృత అధికారి పేరును డి. రాజశేఖర్‌కు బదులు పొరపాటుగా బి.రాజశేఖర్ అని ప్రచురించడమైనది. సదరు అధికారి పేరు డి.రాజశేఖర్ గా చదువుకోనవలెను.

సంపత్ అవసరం లేదు

మన తెలంగాణ/హైదరాబాద్ : కాంగ్రెస్ ఎంఎల్‌ఎ సంపత్‌ను పార్టీలో చేర్చుకోవాల్సిన అవసరం లేదని టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ గువ్వల బాల్‌రాజ్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్రజలను బాగు చేసేలా బ్యాంకుల ఎజెండా

- **బ్యాంకుల జోనల్‌స్థాయి సదస్సులో మంత్రి ఈటల**

మన తెలంగాణ / హైదరాబాద్ : బ్యాంకర్లు, ప్రభుత్వాల ఎజెండా ప్రజల జీవితాలను బాగు చేసే విధంగా ఉండాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఒక పక్క మన రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదని చెప్పుకుంటున్నా ఆర్థిక అసమానతలు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉన్నాయన్నారు. బ్యాంకులు ప్రజలకు అండగా ఉంటాయనే నమ్మకం కల్పించాలన్నారు. ఎవరికైతే నిజంగా అవసరముందో వారికి తప్పనిసరిగా రుణాలను ఇచ్చి బ్యాంకులు ఆదుకోవాలన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సహకార బ్యాంకుల జోనల్ స్థాయి సదస్సు బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్‌ల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ సమావేశానికి వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మంత్రి ఈటల రాజేందర్ హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రైతులు బ్యాంకుల నుంచి రుణాలు పొందాలంటే చాలా కష్టంగా మారిందన్నారు. కానీ ఇదే బ్యాంకులు కార్పొరేట్ కంపెనీలకు, రుణాలు ఎగ్గొట్టే బాపతులవారికి కోట్ల రూపాయలు ఇస్తున్నాయన్నారు. ఇకపై ఈ విధానం మారాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణాల్లోని పేద, మధ్యతరగతి వారికి , అలాగే అణగారిన వర్గాల వారికి రుణాలు ఇవ్వడంలో బ్యాంకులు ముందుండాల్సిన అవసరం ఉందన్నారు.
ఆగ్రో ప్రాసెస్ యూనిట్లు పెంచాలి : అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆగ్రో ప్రాసెస్ యూనిట్లు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులు ఇలాంటి పరిశ్రమలకు చేయూతనివ్వాలని పిలుపు నిచ్చారు. ముఖ్యమంత్రి కెసిఆర్ సంకల్పంతో తమ ప్రభుత్వం రైతులకు 24 గంటల కరెంటు ఇస్తోందన్నారు. కోటి ఎకరాలకు రెండు పంటలకు నీళ్లిచ్చే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించుకుందన్నారు.
ఇప్పటి వరకు రాష్ట్రంలో 71 లక్షల 75 వేల మంది వ్యవసాయదారుల ద్వారా కోటి 42 లక్షల ఎకరాల భూమి సాగులో ఉందన్నారు. రైతాంగానికి పంటల సాగు కోసం ఆర్థిక సాయంగా ఎకరానికి నాలుగు వేల రూపాయలు ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో 62 శాతం రైతులు చిన్న సన్న కారు రైతులే ఉన్నారని, ఒక్కొక్కరికీ రెండున్నర ఎకరాల లోపునే భూమి ఉందన్నారు. వ్యవసాయానికి విద్యుత్‌తో పాటు సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం రూ. లక్ష 50 వేల కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. తెలంగాణలో వందకు పైగా అర్బన్ బ్యాంకులు బాగా పని చేస్తున్నాయని, ఇప్పటి వరకు ఈ అర్బన్ బ్యాంకుల మీద ఎలాంటి ఫిర్యాదులు రావడం లేదన్నారు. బ్యాంకులు, రైతుల అంశంలో కో అపరేటివ్ అర్బన్ బ్యాంకు ఫెడరేషన్ ఇచ్చే సలహాలను స్వీకరిస్తామన్నారు. సహాయం చేయడంలో సహకార బ్యాంకులు ముందుంటాయన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ప్రసిడెంట్ కె. రవీందర్ రావు, ఐడిబిఐ బ్యాంక్ సిజిఎం బి. దాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్‌లతో దళితుల సమస్యలు పరిష్కారం కావు

- **ప్రొఫెసర్ కంచె ఐలయ్య**



మనతెలంగాణ/గోషామహల్: రిజర్వేషన్‌తో దళితుల సమస్యలు పరిష్కారం కావని ప్రముఖ రచయిత ప్రొఫెసర్ కంచె ఐలయ్య పేర్కొన్నారు. ప్రైవేట్ ఆంగ్ల బోధ నా పాఠశాలలు తొలగించి, ప్రభుత్వ పాఠశాలల్లో సమాన విద్యాబోధన జరిగినప్పుడే సమాన త్వం సాధ్యపడుతుందన్నారు. అంబేద్కర్ ఆంగ్లంలో రాజ్యాంగాన్ని రాసినందుకే నేడు దళితులు సమాన అవకాశాలు పొందగలుగుతున్నారని అన్నారు. సమాంతర ప్రచురణల ఆధ్వర్యంలో బుధవారం నాంపల్లిలోని తెలుగు విశ్వ విద్యాలయంలో నిర్వహించి న 200 సంవత్సరాలు భీమా కోరేగావ్ విజయోత్సవ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భ ంగా ఆయన ప్రముఖ రచయిత ఏఎన్ నాగేశ్వరరావు రచించిన భీమా కోరేగావ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బహుజనులారా ఆంగ్లం నేర్చుకోండి...బ్రాహ్మణులారా సంస్కృత నేర్చుకోండనిసూచించారు. ప్రపంచ భాష ఆం గ్లం నేర్చుకుంటేనే భవిష్యత్తు ఉంటుందన్న విషయాన్ని దళితులు గుర్తిం చాలన్నారు. పట్టుదలతో దళితులు ఆంగ్ల విద్యను అభ్యసి ంచడంతో పాటు ఆంగ్లంపై పట్టుసాధించి రాణించాలని పిలుపునిచ్చారు. ఉత్పత్తిలో, దేశ రక్షణలో సైని కులుగా లేని వారు తమ ను తాము ఉత్పత్తి చేసుకుంటూ తనను ప్రశ్నిస్తున్నారని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దేశంలోని వి శ్వవిద్యాలయాల్లో జాతీయ వాదానికి నిదర్శనంగా సైనికుల కవాతు జరిగిందని, కానీ బిజెపి అధికారం చెలాయిస్తున్న రాష్ట్రంలోని కోరేగావ్‌లో సైనికులు సంబ రాలు చేసుకునే సమయంలో దాడులు జరిగాయన్నారు. కర్రసాము చేసే మాలలు గొ ప్పవారా? లేక యోగా చేసే వారు గొప్పవారా? దేశాన్ని చైనా బారి నుండి కర్రసాముతో రక్షిస్తారా? లేక యోగాతో రక్షిస్తారా? అని ప్రజలు నరేంద్రమోడీ, రామ్‌దేవ్ బాబాలను అడగాలన్నారు. తాను బీసీనే కానీ దళితుల పట్ల రచనలు చేయడం వల్ల తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. బామ్‌సెఫ్ జాతీ య కార్యదర్శి శ్రీకాంత్ చింతల, ప్రచారకర్త అబ్దుల్ కదీర్, ప్రముఖ అం బేద్కరిస్టు ఎం ప్రేమ్‌కుమార్, ఎస్సీ ఆర్పీ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు డి. సుదర్శన్‌బాబు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కె విద్యాసాగర్, హెచ్‌సియు స్కాల ర్ అరుణ గోగుల మంద, డిక్కీ అధ్యక్షులు సిహెచ్ రాహుల్‌కిరణ్, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం సలహాదారు కె యాదరిగి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అమృతరావు తదితరులు పాల్గొన్నారు.

టిఆర్‌ఎస్‌కు చిత్తశుద్ధి లేదు

మన తెలంగాణ/హైదరాబాద్ : పెట్టుబడి ఇస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నారే కానీ రైతులపై టిఆర్‌ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ టి. జీవన్ రెడ్డి అన్నారు. ఈ యాసంగి నుంచే ఎకరాకు రూ. 4 వేలు ఇవ్వాలన్నారు. కౌలు, పట్టాదారు అనే భేదం లేకుండా అందరికీ పెట్టుబడి అందించాలన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వానకాలంలో పంట నష్టపోతే రాష్ట్ర ప్రభుత్వం రైతులను అదుకోలేదన్నారు.

పనులను వేగంగా పూర్తి చేయండి

- **పర్యాటకశాఖ కార్యదర్శి వెంకటేశం**

మన తెలంగాణ/హైదరాబాద్: పరేడ్ మైదానంలో జనవరి 13 నుంచి 15 వరకు జరిగే అంతర్జాతీయ పతంగుల పండుగ, మొదటి అంతర్జాతీయ మిఠాయిల పండుగ నిర్వహణ ఏర్పాట్లను పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం పర్యవేక్షించారు. నిర్వహణ పనులను వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రపంచ తెలుగు మహాసభల విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని కైట్, స్వీట్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని సూచించారు. 10 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ప్లేయర్స్ పాల్గొంటున్నారన్నారు.
స్వీట్ ఫెస్టివల్‌లో జాతీయ, అంతర్జాతీయ మిఠాయిలను నగర ప్రజలకు రుచిచూపిస్తామని స్పష్టం చేశారు. లక్ష మందికి పైగా ప్రజలు వీక్షించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ కమిషనర్ సునీతా భగవత్, సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ఫెస్టివల్ నిర్వహణ కమిటీ సభ్యులు బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు నిజం...చర్యలు శూన్యం

- **ఖమ్మం డిసిసిబిపై ప్రభుత్వంలో విచిత్ర వైఖరి**
- **నెలఖారులో ముగియనున్న పాలకవర్గ పదవీకాలం**

అవకతవకలను ప్రోత్సాహించడమే : పరిశీలకులు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఖమ్మం పూర్వ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డిసిసిబి) పాలకవర్గం అవకతవకలకు పాల్పడుతోందని, దాన్ని రద్దు చేయాలని సహకార శాఖ సిఫారసు చేసి మూడు నెలలు అవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. పాలకవర్గ కాలపరిమితి ఈ నెలాఖరుకు ముగుస్తోంది. ప్రభుత్వం మౌనంపై గుసగుసలు మొదలయ్యాయి. గతంలో ఖమ్మం డిసిసిబి రైతు సంక్షేమనిధి పేరుతో రైతుల రుణాల్లోంచి రూ.500 చొప్పున రూ. 8.11 కోట్లు వసూలు చేసి ఆస్పత్రిని నిర్మించింది. డిసిసిబి చైర్మన్ పేరు మీదే ట్రస్టు రిజిస్ట్రేషన్ జరిగిందని, నెలకు రూ.4 లక్షలు చెల్లిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు (టెస్కాబ్) అధికారులు చెబుతున్నారు. రైతులకు రుణాల మంజూరు, బ్యాంకు లావాదేవీలు జరపాల్సిన డిసిసిబి ఒక ట్రస్టు ఏర్పాటు చేసి ఆసుపత్రి నిర్మించడం రిజర్వుబ్యాంకు నిబంధనలకు, చట్టానికి విరుద్ధమని ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని సహకార శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి మూడు నెలల కింద సిఫారసు చేసింది. వసూలు చేసిన సొమ్మును రైతుల సంక్షేమం కోసం ఖర్చు పెడుతున్నట్లు పాలకవర్గం వివరణ ఇచ్చినా, అది రిజర్వు బ్యాంకు నిబంధనలకు విరుద్ధమని టెస్కాబ్ స్పష్టం చేసింది. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే మళ్లీ కొత్త పాలకవర్గం వచ్చిన తర్వాత, ఇతర డిసిసిబిలు కూడా ఇలాంటి అవకతవకలకు పాల్పడే ప్రమాదం ఉందని పరిశీలకులు పేర్కొంటున్నారు.



ఊపందుకున్న వరినాట్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో వరినాట్లు ఊపందుకున్నాయి. ఇప్పటి వరకు 4.69 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేసినట్లు బుధవారం వ్యవసాయ శాఖ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గతేడాది ఇదే కాలంతో పోల్చుకుంటే ఇది ఒకటిన్నర లక్షల ఎకరాలు ఎక్కువని అధికారులు తెలిపారు. సాధారణంగా ఈ యాసంగిలో 15.19 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడుతాయని అంచనాగా ఉంది. మొత్తం సాధారణ సాగు అంచనా 31.55 లక్షల ఎకరాలుగా ఉండగా, ఇప్పటి వరకు 14.50 లక్షల ఎకరాల్లో 46 శాతం వివిధ పంటలు సాగు అయ్యాయి. ఆహార పంటల సాగు కేవలం 42 శాతమే నమోదైంది. ఇది 50 శాతం వరకు వెళ్లడం కూడా కష్టమేనని అధికారులు చెబుతున్నారు. ఆహార పంటలు 23.84 లక్షల ఎకరాలకు గాను 10 లక్షల ఎకరాల్లో సాగు కావడం గమనార్హం.

రాష్ట్రంలో రెండు రోజులు చలిగాలులు

మన తెలంగాణ/హైదరాబాద్: వచ్చే రెండు రోజుల పాటు రాష్ట్రంలో పలు చోట్ల చలిగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ప్రధానంగా ఆదిలాబాద్‌లో చలి ప్రభావం ఎక్కువగా ఉండనుంది. ఇదిలా ఉండగా గత 24 గంటలలో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఆదిలాబాద్‌లో 7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. భద్రాచలం, మెదక్‌లలో 12 డిగ్రీలు, రామగుండం, ఖమ్మంలలో 13 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

శరవేగంగా కెటిపిఎస్ ఏడో దశ

మన తెలంగాణ/హైదరాబాద్: పాల్వంచలో నిర్మిస్తున్న కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రం (కెటిపిఎస్) ఏడవ దశ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే మార్చి నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించే లక్ష్యంతో నిర్మాణ పనుల్లో వేగం పెంచారు. 800 మెగావాట్ల సామర్థ్యంతో కెటిపిఎస్ 7ను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ప్లాంటు నిర్మాణంలో కీలకమైన, అతి ముఖ్యమైన 940 ఎంవిఎ సామర్థ్యం కలిగిన జనరేటర్‌ను బుధవారం నాడు విజయవంతంగా అమర్చారు. జెన్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకరరావు విద్యుత్‌సౌధ నుంచి ఆన్ లైన్‌లో పనులను పర్యవేక్షించగా, డైరెక్టర్ రాధాకృష్ణ క్షేత్రస్థాయిలో పాల్గొన్నారు. మెకానికల్ పవర్‌ను ఎలక్ట్రిక్ పవర్‌గా మార్చడానికి ఈ జనరేటర్‌ను వినియోగిస్తారు. బిహెచ్‌ఇఎల్ ఆధ్వర్యంలో హరిద్వార్ లో 480 టన్నుల బరువున్న ఈ జనరేటర్‌ను నిర్మించారు. ప్లాంటు వరకు తరలించడానికి 288 చక్రాలున్న ప్రత్యేక వాహనాన్ని వినియోగించారు. కీలకమైన జనరేటర్ బిగించడం పూర్తికావడంతో విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన తుది ఏర్పాట్లు జరగాల్సివుంది.

అన్ని జిల్లాల్లో కొత్త పారిశ్రామిక వాడలు

టిఎస్ఐఐసి డైరీ ఆవిష్కరణలో ఛైర్మన్ బాలమల్లు



మన తెలంగాణ/హైదరాబాద్ : పారిశ్రామిక అభివృద్ధి కేవలం రాజధాని హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా అన్ని జిల్లాలకు విస్తరించేలా నూతన పారిశ్రామిక వాడల కోసం జిల్లాల్లో అనువైన భూములను ఎంపిక చేయాలని టిఎస్ఐఐసి ఛైర్మన్ బాలమల్లు అధికారులను ఆదేశించారు. గత ఏడాది చేపట్టిన వివిధ ప్రాజెక్టుల పనులు , అలాగే ఈ కొత్త సంవత్సరం 2018లో చేపట్టనున్న ఫార్మాసిటి, కాకతీయ టెక్స్‌టైల్ పార్కు, సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజెస్ పార్కు తదితర ప్రాజెక్టులు ప్రారంభించడానికి చర్యలు వేగవంతం చేయాలని కోరారు. టిఎస్ఐఐసి ఉద్యోగుల 2018 డైరీ, క్యాలెండర్‌ను ఆయన బుధవారం నాడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఐఐసి ఎండి ఈవి నర్సింహారెడ్డి, నిమ్జ్ సిఈఓ మధు సూధన్‌తో పాటు సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

కన్‌ఫర్డ్ ఐఎఎస్ జాబితాకు యుపిఎస్‌సి ఆమోదం

పది మంది ఇకపై ఐఎఎస్ అధికారులు

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర సివిల్ సర్వీసెస్‌కు చెందిన పది మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు కన్‌ఫర్డ్ ఐఎఎస్‌లుగా ఎంపికయ్యారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ అధ్యక్షతన ఢిల్లీలో బుధవారం సమావేశమైన సెలక్షన్ కమిటీ ఈ పది మంది జాబితాకు ఆమోదం తెలిపింది. 2014, 2015, 2016 సంవత్సరాలకు రాష్ట్రంలోని పదహారు పోస్టులకుగాను తొలి జాబితాలో పది మంది పేర్లను ప్రతిపాదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల చివరి వారంలో యుపిఎస్సి ఆమోదానికి పంపింది. ప్రధాన కార్యదర్శి ఎస్పి సింగ్, రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి అదర్ సిన్హా బుధవారం ఈ సమావేశానికి హాజరయ్యారు. కన్‌ఫర్డ్ ఐఎఎస్‌కు ఎంపికైన కొర్ర లక్ష్మి, చిట్టెం లక్ష్మి, కె. ధర్మారెడడి, టి. వినయ్‌కృష్ణారెడ్డి, సిహెచ్. శివలింగయ్య, వి. వెంకటేశ్వర్లు, ఎం. హనుమంతరావు, డి. అమోయ్‌కుమార్, కె. హైమవతి, ఎం.హరితల పేర్లకు యుపిఎస్సి ఆమోదం లభించడంతో ఈ జాబితా బుధవారం సాయంత్రానికే కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని డివొపిటి (సిబ్బంది శిక్షణా వ్యవహారాల విభాగం)కి చేరినట్లు తెలిసింది. గురువారం సాయంత్రం లేదా శుక్రవారం ఉదయం కల్లా ఈ జాబితాను అధికారికంగా ప్రకటించనుంది. దీంతో వీరంతా ఇకపై ఐఎఎస్ అధికారులవుతారు.

ఒంటేరు అరెస్ట్ హేయం : టిడిపి

మన తెలంగాణ/హైదరాబాద్ : టిడిపి రైతు విభాగం అధ్యక్షులు ఒంటేరు ప్రతాప్ రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి మంగళవారం రెండోసారి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడాన్ని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ తీవ్రంగా ఖండించారు. ఒంటేరుపై పెట్టిన కేసులను గురువారం లోపు బేషరతుగా ఉపసంహరించుకోవాలని లేదంటే ఈ నెల 12వ తేదీన సిఎం క్యాంపు ఆఫీస్ ప్రగతి భవన్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఎన్‌టిఆర్ భవన్‌లో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులుతో కలిసి రమణ బుధవారం మీడియాతో మాట్లాడారు. 2014 ఎన్నికలలో గజ్వేల్ నియోజకవర్గం నుంచి సిఎం కె. చంద్రశేఖర్‌రావుపై పోటీ చేయడంతోనే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న వారి గొంతు నులిమే దుర్మార్గపు పోలీసుల రాజ్యం ఈ రాష్ట్రంలో నడుస్తోందన్నారు. ఒంటేరు అనారోగ్యంతో బాధపడుతున్నారని,ఏదైనా జరిగితే కెసిఆర్ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వమే తెలుగు దేశం పార్టీని పోరాటాల దిశగా ప్రేరేపిస్తోందని మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. రావుల మాట్లాడుతూ ప్రభుత్వం నుంచే కుట్రలు జరుగుతున్నాయని తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఇదిలా ఉండగా బుధవారం ఎన్‌టిఆర్ భవన్‌లో మూడవ బ్యాచ్ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ టిడిపి నేతలు మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక బడ్జెట్ పేరిట సిఎం కొత్త నాటకానికి తెరలేపారని మండిపడ్డారు.

పుస్తక ప్రదర్శనతో ఉపయోగం!

మన తెలంగాణ/హైదరాబాద్ : సమాజ మార్పుకు పుస్తకాలు ప్రధాన సాధనాలుగా ఉంటాయని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు, హైదరాబాద్ బుక్ ఫేయిర్ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్ అన్నారు. బుధవారం బోడుప్పల్‌లో కాకతీయ టెక్నో స్కూల్‌లో ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షులు డా.పి.అనంతరెడ్డి నేతృత్వంలో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్య సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ జనవరి 18 నుంచి 28 వరకు తెలంగాణ కళా భారతి (ఎన్‌టిఆర్ స్టేడియం)లో జరిగే హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనలో వేలాది మంది విద్యార్థులు పాల్గొంటారని స్కూళ్ల యాజమాన్యాలు వారి పిల్లలను తీసుకుని ఆ పుస్తక ప్రదర్శనకు రావాలని కోరారు. బాల సాహిత్యానికి సంబంధించి ఇంగ్లీష్, తెలుగు, హిందీ భాషలలోపుస్తకాలు లభిస్తాయని ఆయన చెప్పారు.దేశ వ్యాప్తంగా 300 మందికి పైగా పబ్లిషర్స్ పాల్గొంటారని, అన్ని శాస్త్రాలకు సంబంధించిన పుస్తకాలు అక్కడ లభ్యమవుతాయన్నారు. గత ఏడాది ఈ పుస్తక ప్రదర్శనకు పది లక్షల మంది పుస్తక ప్రియులు హాజరయ్యారని పేర్కొన్నారు. అన్ని పాఠశాలలు, కళశాలల యాజమాన్యాలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎన్ని పైసలిచ్చిండో టిఆర్ఎస్‌తో చెప్పించండి

- **టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ ఒప్పందాలు చేసుకున్నది రెండే**
- **ఆ రెండు సుబ్బరామిరెడ్డి కంపెనీవే**
- **గాంధీభవన్‌ను రేవంత్ గోబెల్స్ భవన్‌గా మార్చారు**
- **కాంగ్రెస్‌పై టిఆర్ఎస్ నేతల ధ్వజం**



మన తెలంగాణ/ హైదరాబాద్ : 'టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొత్తగా రెండు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలనే చేసుకొంది. అందులో ఒకటి ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం కాగా, ఇంకొకటి థర్మల్ పవర్ టెక్ కంపెనీతో చేసుకుంది. ఇది మీ కాంగ్రెస్ నాయకుడు సుబ్బరామిరెడ్డి కంపెనీనే. విద్యుత్ ఒప్పందాలలో అక్రమాలు జరిగాయంటున్న కాంగ్రెస్ నేతలు సుబ్బరామిరెడ్డి మాకు ఎన్ని పైసలు ఇచ్చిండో గాంధీభవన్ వేదికగా ఆయనతోనే చెప్పించండి' అని టిఆర్ఎస్ ఎంపి బాల్క సుమన్ కాంగ్రెస్ నేతలకు సవాలు విసిరారు. టిఆర్ఎస్ హయాంలో ఒక్క యూనిట్ కూడా కొత్తగా ఉత్పత్తి చేయలేదన్న ఆరోపణలు అబద్ధమని అన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను లెక్కలతో సహా వివరించారు. టిఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో శాసనమండలి ప్రభుత్వ విప్ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌సి టి.భానుప్రసాద్‌లో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రవ్వంత ఉండే రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన తరువాత గాంధీభవన్‌ను గోబెల్స్ భవన్‌గా మార్చేశాడని ఆరోపించారు. నూతన సంవత్సరం కానుకగా రైతాంగానికి 24 గంటల విద్యుత్‌ను ముఖ్యమంత్రి ఇస్తుంటే కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని, కళ్ళల్లో నిప్పులు పోసుకుంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ వస్తే అంధకారమవుతుందని అన్న నాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి మాటలను పటాపంచలు చేస్తూ మూడున్నరేళ్ళలతో చీకట్లను పారద్రోలుతూ విద్యుత్ వెలుగులను కెసిఆర్ రాష్ట్రంలో నింపారని చెప్పారు. సమైఖ్య రాష్ట్రంలో పవర్ హాలిడేలు, పవర్ కట్‌లు,అసెంబ్లీలో లాంతర్ల ప్రదర్శనలు ఉండేవని, ఇపుడు ఆ పరిస్థితి పోయిందని, హైదరాబాద్‌తో పాటు గ్రామాల్లో కూడా కోతలు లేవని స్పష్టం చేశారు.

అక్కడెందుకు పూర్తి కాలేదు : కాంగ్రెస్ హయాంలో పునాది వేసిన విద్యుత్ ప్రాజెక్టులే పూర్తయి విద్యుత్ అందుబాటులోకి వచ్చిందంటున్న ఆ పార్టీ నాయకుల ఆరోపణలను సుమన్ తప్పుబట్టారు. ఒకే సామర్థ్యంతో చేపట్టి, ఒకేసారి ప్రారంభించిన భూపాలపల్లిలోని కెటిపిపి, రాయలసీమలో ఆర్‌టిపిపి విద్యుత్ కేంద్రాలలో భూపాలపల్లి నిర్మాణం పూర్తయి, అన్ని యూనిట్లు ఉత్పత్తి చేస్తుండగా, ఆర్‌టిపిపి ఇప్పటి వరకు పూర్తి కాలేదన్నారు. జూరాల విద్యుత్ ప్లాంటు నీటిలో మునిగిపోతే తమ ప్రభుత్వం రిపేరు చేయించి పని చేపిస్తోందని, ఇవన్నీ తమ ప్రభుత్వ సమర్థత, చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాష్ట్రం ఆవిర్భవించే నాటికి భూపాలపల్లి ప్లాంట్ పనులు పది శాతం, జైపూర్ ప్లాంట్ పనులు 25 శాతం మాత్రమే పూర్తయ్యాయని, తాము వాటిని వేగంగా పూర్తి చేశామన్నారు. కెటిపిఎస్‌లో 800 మెగావాట్ల ప్లాంటును దేశంలోనే రికార్డు సమయంలో 38 నెలల్లో పూర్తి చేశామని చెప్పారు. విద్యుత్‌పై రోజూ అబద్ధాలు చెబుతూ గాంధీభవన్‌ను అబద్ధాల భవన్‌గా మార్చేశారఅన్నారు. మూడేళ్ళలో పూర్తి చేస్తామన్న యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్రాజెక్టులను కాంగ్రెస్ వంధిమాగధులు వేసిన కేసుల కారణంగా పని మొదలు కాలేదన్నారు. ప్రైవేటు కంపెనీ నుండి భద్రాద్రికి సంబంధించిన విద్యుత్ ప్లాంట్‌ను తీసుకున్నమన్న ఆరోపణ అబద్ధమని, తాము బిహెచ్‌ఇఎల్‌కు దాని నిర్మాణానికి ఆర్డర్ ఇచ్చామన్నారు.

కాంగ్రెస్‌కు విద్యుత్ షాక్ : పల్లా

టిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తుండడంతో కాంగ్రెస్ నాయకులకు విద్యుత్ షాక్ తగలిందని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఒక్క యూనిట్ కూడా కొత్తగా ఉత్పత్తి చేయలేదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారని, కేవలం సౌర విద్యుత్ ద్వారానే 3,100 మెగావాట్లు ఉత్పత్తి అవుతున్న విషయం తెలుసుకోవాలన్నారు. ఎంఎల్‌సి భాను ప్రసాద్ కూడా మాట్లాడారు.

విద్యుత్ లెక్కలు ఇవిగో..

తెలంగాణ ఏర్పడిన 2014 జూన్ 2 నాటికి రాష్ట్రంలో స్థాపిత విద్యుత్ 6574 మెగావాట్లని, అందులో జెన్‌కో ద్వారా 4365 మెగావాట్లు, ఎన్‌టిపిసి నుండి 1908 మెగావాట్లు, గ్యాస్ ప్లాంట్ల ద్వారా 31 మెగావాట్లు, థర్మల్ పవర్ ప్లాంట్ ద్వారా 270 మెగావాట్లు ఉత్పత్తి జరిగేదని బాల్క సుమన్ తెలిపారు. ఈ మూడున్నరేళ్ళలో స్థాపిత విద్యుత్ ఉత్పత్తి 14,913 మెగావాట్లని, అందులో జెన్‌కో ద్వారా 5,295 మెగావాట్లు, కేంద్ర ప్రభుత్వం కేంద్రాల నుండి 2,238 మెగావాట్లు, జాయింట్ సెక్టార్ పవర్ స్టేషన్‌ల నుండి 24.51 మెగావాట్లు, గ్యాస్ ఆధారతి ఐపిపిల నుండి 925 మెగావాట్లు, సంప్రదాయేతర విద్యుత్ (సోలార్,తదితర) ఉత్పత్తి కేంద్రాల ద్వారా 3,313 మెగావాట్లు, దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ బిడ్డింగ్ ద్వారా 839 మెగావాట్లు, ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం నుండి వెయ్యి మెగావాట్లు, సింగరేణి టిపిపి నుండి 1,200 మెగావాట్లు లభిస్తున్నట్లు వివరించారు. అంతే కాకుండా విద్యుత్ వినియోగం కూడా నాటికి, నేటికి పెరిగిందని చెప్పారు. 2014–15లో విద్యుత్ వినియోగం వ్యవసాయానికి 11,670, గృహావసరాలకు 8,600, పరిశ్రమలకు 14వేల మెగావాట్లు ఉండగా, 2017–18 నాటికి వరుసగా 16వేలు మెగావాట్లు, 10,700 మెగావాట్లు, 15,900 మెగావాట్లు పెరిగిందని వివరించారు. అలాగే రాష్ట్రం వచ్చేనాటికి 16,379 కిలోమీటర్ల పొడవు ఉన్న విద్యుత్ లైన్‌లను 20,890 కిలోమీటర్లకు పెంచామని, సబ్‌స్టేషన్‌లు, లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ తదితర మౌలిక సదుపాయాలకే రూ.12,305 కోట్లు టిఆర్ఎస్ ప్రభుత్వం వెచ్చించిందన్నారు.

వెలుగుల వెనుక చీకటి కోణం

మన తెలంగాణ/హైదరాబాద్ : వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ వెలుగుల వెనక చీకటి కోణం దాగి ఉందని కాంగ్రెస్ నాయకులు ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మూడున్నరేళ్ళలో విద్యుత్‌కు సంబంధించిన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై చర్చకు రావాలని, లేదా అఖిల పక్షం ముందు చర్చకైనా పెట్టండని డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలం చెల్లిన సబ్ క్రిటికల్ విద్యుత్ ప్లాంట్‌ను నిండా మునిగిన ఇండియా బుల్స్ సంస్థ నుండి కెసిఆర్ ముఖ్యమంత్రి కాగానే ప్రభుత్వంతో కొనుగోలు చేయించారని అన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఈ సంస్థ తమ ప్లాంట్‌ను అమ్మేందుకు ప్రయత్నించగా ప్రభుత్వం తిరస్కరించిందన్నారు. అసలు ఇండియా బుల్స్ కంపెనీని ఎందుకు కాపాడాల్సి వచ్చిందని ప్రశ్నించారు. భద్రాద్రి విద్యుత్ ప్లాంట్‌లో సివిల్ పనులతో సంబంధం లేని బిహెచ్‌ఇఎల్‌కు టర్బైన్‌లతో పాటు ప్లాంట్ నిర్మాణ పనులు కూడా అప్పగించారని,ఆ తరువాత నిర్మాణ పనులను కెసిఆర్ బంధువులకే కట్టబెట్టారని ఆరోపించారు. 2016లోనే కొత్త విద్యుత్ ప్లాంట్‌లు నిర్మాణం అవసరం లేదని, దేశంలో మిగులు విద్యుత్ అందుబాటులో ఉందని,రూ.2.2కే యూనిట్ విద్యుత్ వస్తుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చెప్పినా ప్రభుత్వం పెడ చెవిన పెట్టిందన్నారు. ప్రస్తుతం కొత్త ప్లాంట్లు అవసరం లేకున్నా యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం, తదితర పనుల ద్వారా రూ. లక్ష కోట్ల రుణభారం జెన్‌కోపై మోపుతున్నారని అన్నారు. అందులో పది శాతం కమిషన్ అధికారంలో ఉన్న పెద్దలకే పోతుందని,అందుకే అవసరం లేకున్నా వాటిని చెపట్టారని, ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుండి ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. గతంలో శాసనసభలో మూడేళ్ళలో 20వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులో తెస్తానని సిఎం కెసిఆర్ చెప్పారని, 15వేలమెగావాట్లు తెచ్చినా సన్మానం చేస్తానని తాను చెప్పానని, మూడేళ్ళు దాటినా యాదాద్రి, భద్రాది ఎటుపోయిందని ప్రశ్నించారు.



పిసిసి చీఫ్‌గా ఉత్తమ్‌కు కొనసాగింపుపై శుభాకాంక్షలు తెలుపుతున్న రేవంత్‌రెడ్డి, సీతక్క, నరేందర్‌రెడ్డి, విజయరమణరావు

విద్యుత్ మే సవాల్

- **రేవంత్ సవాల్‌కు ఎంపి సుమన్ సై**
- **సమయం, ప్రదేశం నిర్ణయించు 12న చర్చిద్దాం : రేవంత్‌రెడ్డి**

మన తెలంగాణ / హైదరాబాద్ : విద్యుత్ వ్యవహారంపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ పార్టీ విసిరిన సవాల్‌ను అధికార టిఆర్ఎస్ పార్టీ స్వీకరించింది. దీనిపై ఎక్కడ చర్చించేందుకైనా సిద్ధమేనని టిఆర్ఎస్ ఎంపి బాల్క సుమన్ బుధవారం ప్రకటించారు. దీనికి కాంగ్రెస్ నాయకుడు ఎ.రేవంత్‌రెడ్డి ప్రతిస్పందిస్తూ ఈ నెల 12వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రతిస్పందించారు. గత వారం రోజులుగా రైతులకు 24 గంటల విద్యుత్ పథకంపై సాగుతున్న ఆరోపణల పర్వం బుధవారం బహిరంగ చర్చ సవాళ్ళతో వేడెక్కింది. గాంధీభవన్‌లో వరుసగా రెండో రోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి విద్యుత్ కొనుగోలులో అక్రమాలు జరిగాయని, వాటిని నిరూపించేందుకు విద్యుత్ శాఖ మంత్రి లేదా అధికారులు, లేదా టిఆర్ఎస్ నాయకులు చర్చకు రావాలని సవాలు విసిరారు. టిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో సాయంత్రం టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌సి టి.భానుప్రసాద్‌లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపి బాల్క సుమన్ సవాలును స్వీకరించారు. "విద్యుత్‌పై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నాం. పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భాను ప్రసాద్‌లతో కలిసి నేను చర్చకు వస్తా. వేదిక, టైమ్‌ను నువ్వు (రేవంత్) నిర్ణయించు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లోనా? సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లోనా? అమరవీరుల స్థూపం దగ్గరా? ఎక్కడో చెప్పు. వెంట పిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డిని తీసుకొస్తావో, సిఎల్‌పి నేత జానారెడ్డిని తీసుకొస్తావో? ఉప నేత జీవన్‌రెడ్డిని తీసుకొస్తావో? మాజీ విద్యుత్ శాఖ మంత్రి షబ్బీర్ అలీని తీసు కొస్తావో నీ ఇష్టం. మా లెక్కలు తప్పైతే నేను ముక్కు నేలకు రాస్తా. నువ్వు చెప్పే లెక్కలన్నీ తప్పు అని నిరూపిస్తాం. నువ్వు క్షమాపణ చెప్పి అబిడ్స్ సెంటర్‌లో ముక్కు నేలకు రాయాలి' అని అన్నారు. దీనిపై కొద్ది సేపటికి రేవంత్‌రెడ్డి ప్రతిస్పందిస్తూ పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. "ఎంపి బాల్క సుమన్ కోరిన విధంగా బహిరంగ చర్చకు నేను, అలంపూర్ ఎంఎల్‌ఎ ఎస్.ఎ.సంపత్‌కుమార్, టిపిసిసి అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌తో కలిసి ఈ నెల 12వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు వస్తాము. చర్చ ప్రగతి భవన్‌లోనైనా సరే లేదా మీరు నిర్ణయించిన చోట ఎక్కడైనా సరే మేము వస్తాము. ఎక్కడికి రావాలో టిఆర్ఎస్ నేతలే చెప్పాలి. బహిరంగ చర్చ తరువాత తప్పుడు మాటలు మాట్లాడుతున్నది ఎవరో, ఎవరు ముక్కును నేలకు రాయాలో ప్రజలే నిర్ణయిస్తార'ని రేవంత్ పేర్కొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పరుగెత్తించండి

- **రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన ప్రాధాన్యత**
- **ఎంపిలతో దక్షిణ మధ్య రైల్వే జిఎం వినోద్‌కుమార్ భేటీ**



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని, కొత్త లైన్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను రైల్వే మంత్రిత్వ శాఖకు పంపాలని రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్)ను కోరారు. బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధమవుతున్న ప్పటికీ తగిన సమయంలో ఎంపిలతో సమావేశం నిర్వహించకపోవడం పట్ల పలువురు ఎంపిలు అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తగిన విధంగా స్పందించి రాష్ట్రంలో రైల్వే అభివృద్ధి ప్రాజెక్టులకు న్యాయం చేయాలని వారన్నారు. వచ్చే ఏడాది బడ్జెట్‌లో దక్షిణ మధ్య రైలే (ఎస్‌సిఆర్) పరిధిలో రైల్వే ప్రయాణికుల అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సవస్యలపై చర్చించేందుకు ఎస్‌సిఆర్ జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో బుధవారం రైల్ నిలయంలో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో 4 రైల్వే డివిజన్ల పరిధిలోని తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకలకు చెందిన పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు. ఎంపిలు తమ నియోజకవర్గ పరిధిలో అమలు కావలసిన రైల్వే అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారం, కొత్త రైలు మార్గాలు, కొత్త రైళ్ళు, నడుస్తున్న రైళ్ళకు కొనసాగింపు, అదనపు స్టాపేజీ, ఆర్‌ఓబి, ఆర్‌యుబిల నిర్మాణం, ప్రయాణీకుల సౌకర్యాల మెరుగుదల తదితర అంశాలపై డిమాండ్లను రైల్వే అధికారులకు వివరించారు. వినోద్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ రైల్వే అభివృద్ధి కార్యక్రమాల ప్రతిపాదనల రూపకల్పనలో ఎంపిల సలహాలను పరిగణనలోనికి తీసుకుంటామని, కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనలన్నీ రైల్వే బోర్డు ఆమోదానికి పంపుతామని జిఎం ఎంపిలకు హామీ ఇచ్చారు. ఎంపిలు తెలియజేసిన ఆలోచనలన్నీ రైల్వే అభివృద్ధి ప్రణాళికలను ఖరారు చేయడానికి ఉపకరిస్తాయన్నారు. అనంతరం జిఎం వినోద్ కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ ఆర్‌ఓబి, ఆర్‌యుబి నిర్మాణాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు కోరుతున్నామని, వందకు పైగా బ్రిడ్జీల నిర్మాణాన్ని త్వరలో చేపడతామన్నారు. కొత్తలైన్ల ఏర్పాటు పనులను పూర్తిచేస్తామని, సికింద్రాబాద్ – మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ఎంఎంటిఎస్ ఫేజ్ –2 ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి తెస్తామన్నారు. చర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌ను మరో నాలుగేళ్లలో ప్రయాణికులకు అందుబాలోకి తీసుకువస్తామన్నారు. ఈ స్టేషన్ అభివృద్ధికి అవసరమైన 50 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో రద్దీని తగ్గించేందుకు లింగంపల్లి స్టేషన్‌ను అభివృద్ధి పరుస్తామన్నారు. రాష్ట్రంలో రైల్వే అభివృద్ధి పనులను చేపట్టాలని ఏ ప్రతిపాదనలు చేసినా అవి తమ పరిధిలో లేవని ఎస్‌సిఆర్ జిఎం చెబుతున్నారని, ఆయన పరిధిలో ఏమి ఉన్నాయో తెలియడం లేదని సీతారాం నాయక్ అన్నారు. మణుగూరు – రామగుండం సర్వే ఇప్పటికీ జరగలేదన్నారు. సికింద్రాబాద్– మణుగూరు మధ్య మార్చి 14 నుంచి కొత్త రైలే సర్వీసును నడిపేందుకు అంగీకరించినట్లు తెలిపారు. మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని, వికలాంగులకు లిఫ్ట్ ఏర్పాటు చేయాలని, లాలాగూడ ఆస్పత్రిని మల్టీస్పెషాలిటి హాస్పిటల్‌గా మార్చాలని మల్కాజ్‌గిరి ఎంపి మల్లారెడ్డి కోరారు. ఎంఎంటిఎస్ ఫేజ్ –2ను సాధ్యమైనంత తొందరగా పూర్తిచేయాలని బండారు దత్తాత్రేయ కోరారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆధునికరించి వరల్డ్ క్లాస్ రైల్వే స్టేషన్ చేయాలని, ప్రయాణికులకు అనుగుణంగా సికింద్రాబాద్ బస్ స్టాండ్‌ను మార్చాలని, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్స్ మధ్య మరో రైల్వే లైన్ వేయాలన్నారు. ముంబయి, చెన్నై, తిరుపతికి సూపర్ ఫస్ట్ రైళ్లను నడపాలని కోమన్నారు.


ఖాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీని రైల్వే శాఖనే చేపట్టాలి

ఖాజీపేట్‌లో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) ద్వారా సాధ్యం కాదని, రైల్వే శాఖనే సొంతంగా ఏర్పాటు చేయాలని ఎంపి బి. వినోద్ అన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పెద్ద సమస్యగా ఉందని, రైల్వే శాఖ సొంతంగా కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు సిద్దంగా లేదన్నారు. పిపిపి పద్దతిలో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం సాధ్యం కాదని, ఇప్పటికే తమకు ఉన్న యూనిట్లలోనే రైల్వేకు అవసరమైన కోచ్‌ల నిర్మాణాన్ని చేపడతామని ప్రైవేటు సంస్థలు స్పష్టం చేశాయన్నారు. ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన భూమి విషయంలో ఎలాంటి లిటిగేషన్ లేదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాంతంలో అతి తక్కువ రైల్వే లైన్ ఉందని, ఎపి పునర్ వ్యవస్థీకరణ చట్టం షెడ్యూల్ 9 ప్రకారం రెండు రాష్ట్రాలకు రైల్వేలైన్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. భూసేకరణలో రాష్ట్ర ప్రభుత్వాలు సాయం చేయాలని రైల్వే అధికారులు కోరారని, రాష్ట్ర ప్రభుత్వం కొన్ని ప్రశ్నలు రైల్వే బోర్డును అడిగిందని, వారి నుండి ఇంకా సమాధానం రాలేదన్నారు. నంది ఎల్లయ్య మాట్లాడుతూ 2016–17లో వనపర్తి, గద్వాల్, అచ్చంపేట్, నాగర్‌కర్నూలు ప్రాంతానికి రైల్వే లైన్ కావాలని కోరినా ఇప్పటి వరకు ఫలితం లేదన్నారు.

వరంగల్‌కు 3వ లైన్ వేయండి



హైదరాబాద్ – వరంగల్ కు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌కు మూడవ లైన్ వేయాలని, హైదరాబాద్ – అమరావతి మధ్య హై స్పీడ్ రైలు నడిపేందుకు రూట్ సర్వే ప్రతిపాదనలు చేయాలని సూచించినట్లు బూర నర్సయ్య గౌడ్ చెప్పారు. పద్మావతి ఎక్స్‌ప్రెస్‌ను ప్రతి రోజూ నడపాలని, షిరిడి, ఇంటర్ సిటీ, పద్మావతి ఎక్స్ ప్రెస్‌లను హాల్టింగ్ చేసి యాదాద్రికి అనుసంధానం చేయాలన్నారు. సింహపురి, శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లను జనగామ్ స్టేషన్‌లో ఆపాలన్నారు. ఎంఎంటిఎస్‌ను వికారాబాద్ వరకు పొడగించాలని, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొన్ని స్టేషన్లలో రైళ్లను అపాలని కోరినట్లు చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి చెప్పారు. రైల్వే విజన్, మార్గదర్శక సూత్రాలను మార్చాలని, రైల్వేలో షార్ట్ డిస్టెన్స్ పెంచాలని సూచించామన్నారు.



"కొంతమందిని ఎల్లకాలం, అందరినీ కొంత కాలం మోసం చేయగలరేమోగానీ, ఎల్లకాలం అందరినీ మోసం చేయాలనుకోవడం అసాధ్యం.
– ఎమర్సన్"

సాంస్కృతిక నియంతృత్వం

సంపాదకీయం

అత్యంత వివాదాస్పదమైన హిందీ చలనచిత్రం 'పద్మావతి' టైటిల్‌ను 'పద్మావత్'గా మార్పుచేయటం, కొద్దిపాటి కట్‌లు, డిస్‌క్లెయిమర్స్ జోడింపుతో సెంట్రల్ బోర్డ్ ఫర్ ఫిలిం సర్టిఫికేషన్ (మామూలు పరిభాషలో సెన్సార్ బోర్డ్) ప్రదర్శన సర్టిఫికేట్ ఇచ్చినప్పటికీ, ఆ చిత్రాన్ని తమ రాష్ట్రంలో ప్రదర్శించనీయబోమని రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ బిజెపి ప్రభుత్వాలు ప్రకటించాయి. శాంతి–భద్రతలు కాపాడలేమన్న పోలీసు నివేదికలను చూపి చిత్ర ప్రదర్శనను నిషేధించేందుకు మహారాష్ట్ర, గోవా బిజెపి ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయి. మరికొన్ని బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అదే బాటలో పయనించే అవకాశాలున్నాయి. అసమ్మతి గ్రూపుల నిరసన ప్రదర్శనలతో నిలిపివేయాలనుకున్న సినిమా, చట్టబద్ధ సర్టిఫికేట్‌తో విడుదలకు సిద్ధమవుతుండగా, దాని ప్రదర్శనను అనుమతించబోమని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించటం ప్రజాస్వామిక, రాజ్యాంగ స్వేచ్ఛలపై దాడితో సమానం. ప్రజలు ఏమి తినాలో, తినకూడదో, స్త్రీలు ఎటువంటి వస్త్రధారణ చేయాలో, చేయకూడదో, ఎవరిని ప్రేమించవచ్చో, ప్రేమించకూడదో, ఏమి చదవాలో, చదవకూడదో నిర్దేశిస్తున్న హిందూత్వవాద ప్రభుత్వాలు ఇప్పుడు 'పద్మావత్' సినిమా ప్రదర్శనను నిషేధిస్తున్నాయి. ఇది సాంస్కృతిక ఫాసిజం తప్ప మరొకటి కాదు. రాజ్యాంగ పరిరక్షకురాలైన కేంద్రప్రభుత్వం ఇటువంటి విషయాల్లో 'మౌనముని'లాగా నోరు విప్పదు.

ప్రసిద్ధ దర్శక–నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ కళాసృష్టికి షూటింగ్ సమయంలోనే పెద్ద అంతరాయం ఏర్పడింది. ఈ చిత్ర సన్నివేశాలు రాజపుత్రుల మనోభావాలను, రాజపుత్ర స్త్రీల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నాయని ఆరోపిస్తూ 'కర్ణిసేన' అనే రాజపుత్ర గ్రూపు ఒకటి షూటింగ్ సెట్లను, అలంకార దుస్తులు, ఆభరణాలను దహనం చేసింది. సాధారణ నిర్మాత అయితే దుకాణం బంద్ చేసి పారిపోయేవాడు. కాని భన్సాలీ మొండివాడు మాత్రమే కాదు, తన చిత్రంపై అపారమైన ఆత్మవిశ్వాసంతో షూటింగ్ ప్రదేశం మరో చోటుకు మార్చి చిత్ర నిర్మాణం పూర్తి చేశాడు. కథామూలం లోకి వెళితే మహాసౌందర్యవతి అయిన కిట్టూరు రాణి పద్మావతి గూర్చిన గాథ ఆధారం. రాజపుత్ర రాణి అయిన ఆమెను మోహించిన ఢిల్లీ సుల్తాన్ అల్లా ఉద్దీన్ ఖిల్జీ దండయాత్ర చేయగా రాజు యుద్ధంలో హతుడవుతాడు. రాణి పరివార సమేతంగా నాటి సతీధర్మంగా అగ్నికి ఆహుతి అవుతుంది. 16వ శతాబ్దం నాటి గాథను 200 ఏళ్ల తర్వాత ఒక జానపద కవి గేయకావ్యంగా రాశాడు. దాని ఆధారంగా చిత్ర నిర్మాణం జరిగింది. పద్మావతి–ఖిల్జీ మధ్య కొన్ని సన్నివేశాలున్నాయని, అవి రాజపుత్ర మనోభావాలను దెబ్బతీస్తున్నాయనేది కర్ణిసేన ఆరోపణ. సెన్సార్ సర్టిఫికేట్ నిలుపుదలను ఆదేశించాలని కొందరు సుప్రీంకోర్టుకు వెళ్లారు. ప్రభుత్వం నియమించిన స్వయం ప్రతిపత్తిగల సెన్సార్‌బోర్డ్ విధి నిర్వహణను అడ్డుకోజాలమని సుప్రీంకోర్టు చెప్పింది. సెన్సార్‌బోర్డు కూడా చిత్రాన్ని తమకు సమర్పించిన వెంటనే సర్టిఫికేట్ ఇవ్వలేదు. చిత్రానికి వ్యతిరేకంగా నాలుగైదు రాష్ట్రాల్లో కొన్ని విభాగాలు చేస్తున్న ఆందోళనలు, దర్శకునికి, కథానాయికకు చంపుతాం, ముక్కుకోస్తాం లాంటి బెదిరింపులు, ఆందోళన కారులకు రాష్ట్రప్రభుత్వాల మద్దతు దృష్ట్యా ఆచితూచి వ్యవహరించింది. తమ సభ్యులతోపాటు భిన్న రంగాలకు చెందిన మేధావులతో కూడిన సలహామండలికి కూడా చిత్రం చూపించి, వారి ఉమ్మడి అభిప్రాయంగా కొన్ని కట్‌లు, చిత్రంలోని పాత్రలు, సన్నివేశాలు ఎవరినీ ఉద్దేశించినవికావు, కల్పితాలు లాంటి డిస్‌క్లెయిమర్స్ సూచించగా, వాటిని పాటించిన తదుపరి సర్టిఫికేట్ జారీ చేసింది. సాధారణ క్రమంలో అయితే చిత్రం విడుదలవుతుంది. ప్రేక్షకులు మెచ్చితే కొంతకాలం ఆడుతుంది, లేకుంటే లేదు. లాభమైనా, భారమైనా నిర్మాతది, చిత్రాన్ని కొనుక్కున్న డిస్ట్రిబ్యూటర్లది. ఎక్కడైనా కొన్ని సమూహాలు అల్లరిచేస్తే శాంతి–భద్రతలు కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర పోలీసు విభాగాలది. కాని రాష్ట్రప్రభుత్వాలే చిత్ర ప్రదర్శనను నిషేధించటం నిరంకుశం, రాజ్యాంగ విరుద్ధం. అందువల్ల కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, తమ రాష్ట్రప్రభుత్వాలకు 'రాజ్యధర్మాన్ని' బోధించాలి.

రాహుల్ సహన హిందూత్వ?

చూపు

'హిందువుని అని చెప్పుకోడానికి గర్వించు' అనే నినాదం ద్వారా దేశ రాజకీయాలను మలుపు తిప్పామని భారతీయ జనతా పార్టీ ఘనతను చాటుకోవచ్చు. కానీ ఆ నినాదం ఇప్పుడు వారు ఊహించని విధంగా దారి తప్పి వేరే పార్టీ ఆవరణలో కూడా తచ్చాడుతోంది. 1990 నాటి రామజన్మ భూమి ఉద్యమంతో పాతాళపు లోతులలోంచి కేంద్రస్థానంలోకి వచ్చిన ఆ పార్టీ హిందూత్వపై తన గుత్తాధిపత్యాన్ని ఇతరులు దెబ్బతీస్తుంటే నోరెళ్లబెట్టే పరిస్థితి వచ్చింది. రాహుల్ గాంధీ ఇటీవల గుజరాత్ ఎన్నికల సందర్భంగా ఆలయ సందర్శనలు విరివిగా జరిపారు. అలాగే బెంగాల్‌లో మమతా బెనర్జీ మెజారిటీ వర్గీయులైన హిందువులకు మోకరిల్లుతూ ఇటీవల చేపట్టిన కార్యక్రమాలు కూడా బిజెపి నినాదాన్ని ఇతర పార్టీలు హైజాక్ చేస్తున్నాయి అనడానికి నిదర్శనాలు.

ఇదివరకు సెక్యులర్ మంత్రజపం వల్ల ప్రధాన మతంతో వ్యక్తిగతంగా మినహా ఎటువంటి సంబంధాలు బాహాటంగా పెట్టుకోడానికి భయపడే ఆనవాయితీ నుంచి ప్రధాన పార్టీలు బయటపడి పెను మార్పుకు నాంది పలుకుతున్నాయనడానికిది నిదర్శనం. మతాన్ని రాజకీయాలతో కలగలపడం ఆదిలో ముస్లిమ్ లీగ్ అనుసరించిన పోకడ. 1937 ఎన్నికలలో కాంగ్రెస్‌పై చెప్పుకోదగ్గ విజయం దక్కకపోవడంతో మత మార్గాన్ని పట్టక తప్పదని అది నిర్ణయానికి వచ్చింది. 'ఇస్లామ్ ఖత్రేమే హై' (ఇస్లామ్ ప్రమాదంలో ఉంది) అని హెచ్చరిస్తూ, వలస పాలకులు పోయి కాంగ్రెస్ సారథ్యంలో హిందూ పాలకులు వస్తే ముస్లిమ్‌లు నశించి పోవలసిందే అని తమ మతస్థులలో ముస్లిమ్ లీగ్‌వారు భయాలను వ్యాపింపజేశారు. అదే దారిలో బిజెపి కూడా 1984లో రెండు పార్లమెంటు సీట్లే గెలిచినపుడు ఓటర్లను బుజ్జగించితే ఎటూ తేలమనీ నిర్ధారణకు వచ్చింది. హిందూ కార్డే శరణ్యం అని నిర్ణయించింది. మధ్యయుగాల నాటి ఆలయాల ధ్వంసం నుంచి 1947లో దేశ విభజనదాకా అన్నిటికీ ముస్లిములే కారణమని నిందించడం ప్రారంభించింది. మత ద్వేషాన్ని ప్రచారం చేయడం ద్వారా హిందూ ఐక్యతను, తద్వారా మెజారిటీ ఓటు బ్యాంకును సృష్టించే ప్రయత్నంలో పడింది. దేశ విభజన తర్వాత కూడా దేశంలో ముస్లింలు ఉనికిని కొనసాగించడాన్ని బిజెపి మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ వ్యతిరేకిస్తోంది. ఆ సంస్థ గురువు ఎంఎస్ గోల్వాల్కర్ 'బంచ్ ఆఫ్ థాట్స్' అనే పుస్తకంలో ముస్లింలు దేశం చూరుపట్టుకు వేలాడుతున్నారని ఎద్దేవా చేశారు.

ఈ మత విద్వేష ధోరణి వల్ల బిజెపికి కలిగిన ఏకైక ప్రయోజనం ఏమిటంటే సెక్యులర్ పార్టీలను దోషులుగా చూపడం. రాజకీయాల్లోకి హఠాత్తుగా మత ధోరణులు ప్రవేశించడంతో సెక్యులర్ పార్టీలు గందరగోళంలో పడ్డాయి. ఆ పార్టీల విధానాలను 'కుహనా సెక్యులరిజం'గా బిజెపి విమర్శించసాగింది. తమది అసలైన సెక్యులరిజం అని బిజెపి చెప్పుకుంటుంది. 'ఏ ఒక్కరినో సంతోషపెట్టడం కాకుండా అందరికీ న్యాయం చేకూర్చడమే తమ సెక్యులరిజం లక్ష్యం' అని ప్రచారం చేసుకుంటోంది. 'కుహనా సెక్యులరిజం' ముస్లింలను సంతోషపెట్టడానికే ఉందని ఉధృతంగా ప్రచారం చేసింది. కొంతమేరకు ఈ తరహా ప్రచారంలో బిజెపి విజయవంతం అయింది. తమది 'అందరి కోసం' ఉన్న పార్టీ అంటూ, ముస్లింలను జాతి వ్యతిరేకులుగా చాటడం దాని ప్రధాన లక్ష్యం. నరేంద్ర మోడీ 'అందరికీ అభివృద్ధి (సబ్ కా సాథ్ సబ్ కా వికాస్) మంత్రం ఈ ధోరణిలో ఇచ్చిన నినాదమే.

ముస్లిం ఆధిక్యతలోని 54 జిల్లాలు దేశ ఐక్యతకు, సమగ్రతకు



ప్రమాదకరమని వ్యాఖ్యానించడం ద్వారా గిరిరాజ్ సింగ్ వంటి ఆయన మంత్రులు మతపరమైన విద్వేష ప్రచారాలను కొనసాగిస్తున్నప్పటికీ అభివృద్ధిలో అందరినీ కలుపుకుపోవాలి అనే నినాదాన్ని మోడీ ఇచ్చారు. మరో బిజెపి ఎంఎల్ఎ తాజ్ మహల్‌ను భారతీయ సంస్కృతికి మచ్చగా అభివర్ణించారు. మోడీ నినాదం ఆచరణలో కనపడడం లేదనడానికి ఆయన మంత్రులు, ఎంఎల్ఎలు చేసే వ్యాఖ్యలే ఉదాహరణ. బిజెపి చెబుతున్నంత హిందూ వ్యతిరేకులం తాము కామని సెక్యులర్ పార్టీలు మూడు దశాబ్దాల తర్వాత ఇప్పుడు కొత్తగా చెబుతున్నాయి. గుజరాత్ ఎన్నికల తరుణంలో రాహుల్ గాంధీ ఆలయాల సందర్శన వారిలోని ఈ కొత్త ధోరణికి నిదర్శనం.


బిజెపి దారిలో నడిస్తే ప్రమాదమని శశిథరూర్ వంటి కొందరు కాంగ్రెస్ నాయకులు హెచ్చరిస్తున్నారు. లేకుంటే ముస్లింలను దూరం చేసుకోవడం ద్వారా హిందువుల హృదయాలను చూరగొనాల్సి వస్తుందన్నది కూడా వారి హెచ్చరిక సారాంశం. బిజెపికి చెందిన అరుణ్ జైట్లీ కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారు. అసలు సరుకు దొరుకుతున్నప్పుడు దానిలాంటి మరోటి ఎందుకు కోరతారు అన్నది ఆయన ప్రశ్న. అంటే హిందూ మిత్రపక్షం బిజెపి మాత్రమేనని, బిజెపిని అనుసరించే పార్టీలకు తావుండదని చెప్పడమే. కాంగ్రెస్ దారి మార్చుకోవడం బిజెపికి సుతరామూ ఇష్టం లేదని చెప్పలేము అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ రాహుల్ గాంధీ ఆలయ సందర్శనలను వెక్కిరిస్తూ వాటిలో ఆయన 'నమాజ్' చేశారా అని అన్నారు. ఆలయాల్లో రాహుల్ భంగిమ అలాగే కనిపిస్తోందన్నారు. రాహుల్ తన ఇంటిపక్క ఆలయాలనే సందర్శించారా అంటూ గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ విస్తుపోయారు. రాహుల్ గాంధీ కొత్త అవతారాన్ని వ్యూహాత్మక ఎత్తుగడగా ముస్లింలు భావించకపోవచ్చు కాబట్టి ఆ పార్టీ ముస్లిం ఓటు బ్యాంకు చెక్కుచెదరదని బిజెపికి తెలుసు. దేవాలయాలకు వెళ్లడం అంటే మసీదును కూల్చడంగా ముస్లింలు భావించరు. ఆ పని 1992 డిసెంబర్‌లో బిజెపి మద్దతుదార్లు అయోధ్యలో చేశారు. మథుర, వారణాసి మసీదులను ఇప్పటికీ వారు గురిపెడుతున్నారు. ఈ కోణంలో చూస్తే రాహుల్ ప్రవర్తనలో మార్పు కేవలం సరిదిద్దుకోవడమే అవుతుంది.

సెక్యులరిజం అర్థాన్ని పూర్తిగా మార్చివేసి విరుద్ధ ధోరణిలో బిజెపి సాగుతున్నందువల్ల తన మార్గాన్ని సరిదిద్దుకోవలసిన అవసరం రాహుల్‌కు వచ్చింది. అలాగే గతంలో షాబానో విషయంలో కాంగ్రెస్ కూడా ముస్లిం ఛాందసవాదులను సంతోషపెట్టబోయి తప్పు చేసింది. ఛాందసవాదుల భావజాలం సగటు ముస్లిం కలిగి ఉంటాడని అప్పట్లో కాంగ్రెస్ అపోహపడింది. కాంగ్రెస్‌వి అనైతిక రాజకీయాలని, తాము దశాబ్దాలుగా హిందూ సనాతన భావజాలానికి రక్షకులమని బిజెపి చాటుకుంటోంది.

బిజెపి ప్రచారాలను తిప్పికొట్టడమే రాహుల్ ఆలయాల సందర్శన అసలు ఉద్దేశం. బెంగాల్‌లో మమతా బెనర్జీ హిందూ అనుకూలతను ప్రదర్శించడాన్ని కూడా ఈ నేపథ్యంలోనే చూడాలి. మొత్తానికి రాహుల్ వైఖరిలో మార్పు బిజెపికి గొంతులో పచ్చి వెలక్కాయలా మారిందని చెప్పవచ్చు. 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా' అని రాహుల్ అన్నట్టుగా ఈ వ్యవహారం ఉంది.

* అమూల్య గంగూలీ

'దూరవిద్య' దూరం కానుందా?



రావుల రాజేశం
9848811424

'గడప ముందుకు డిగ్రీ విద్య' అనే నినాదంతో దేశంలోనే మొట్టమొదట నెలకొన్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధికారుల నిర్ణయాల వల్ల 'దూరవిద్య' దూరం అయ్యే ప్రమాదం పొంచి ఉన్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రెగ్యులర్ డిగ్రీ కాలేజీల్లో రెండేళ్ల క్రితం ప్రవేశపెట్టిన సెమిస్టర్ విధానం ఇంకా కష్టాలు కన్నీళ్ళతోనే నడుస్తున్నది. రెగ్యులర్ డిగ్రీ కాలేజీలలో మంచి ఫలితాలు ఇవ్వక డిగ్రీ చదువు మా కొద్దు అని (సిబిసిఎస్) విద్యార్థులు ఓ పక్క లబోదిబోమంటుండగా, 'సందెట్లో సడేమియా' వలే డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2017–18 విద్యాసంవత్సరం నుండి చాయిస్ బేస్డ్ క్రెడిట్ ఎడ్యుకేషన్(సిబిసిఎస్) విధానానికి శ్రీకారం చుట్టటంతో విద్యార్థులు బెంబేలు ఎత్తిపోతున్నారు.

1982లో హైదరాబాద్ గడ్డమీద దేశంలోనే మొదటి దూరవిద్య విశ్వవిద్యాలయంగా అంబేద్కర్ యూనివర్సిటీ ప్రారంభం అయింది. లక్షలాదిమంది కాలేజీకి, విశ్వవిద్యాలయానికి వెళ్లలేని వారికి ఉన్నత విద్య అవకాశాలు అందించి దేశంలోనే మంచి యూనివర్సిటీగా పేరు పొందింది.

ప్రింట్ మెటీరియల్ ఇస్తూ, చక్కని కౌన్సెలింగ్ కాంటాక్టు తరగతులను అందించటమే కాక రేడియో, టెలివిజన్, ఆడియో, విడియో క్యాసెట్లు ద్వారా విద్యాగంధాన్ని దూరతీరాలకు చేరవేస్తున్నది. ఆదివారాల్లో కౌన్సెలింగ్ క్లాసులు నిర్వహించి రెగ్యులర్ డిగ్రీ, పీజీ చదువుకు సరిసమానమైన సర్టిఫికెట్లను, విజ్ఞానాన్ని అందిస్తున్నది. 'తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 215 అధ్యయన కేంద్రాలు 23 ప్రాంతీయ అధ్యయన కేంద్రాల ద్వారా సుశిక్షితులైన కౌన్సిలర్లతో క్లాసులు నిర్వహిస్తుంది.

జాతీయ స్థాయిలో మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా సిబిసిఎస్‌ను ప్రవేశపెట్టారు. ఉద్యోగ నైపుణ్యాలను కల్పించటానికి దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న సంస్కరణలు, విద్యారంగంలోని మార్పులు దూరవిద్యకి అవసరమా అని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు.

సిబిసిఎస్ లేనప్పుడు సంవత్సరానికి 25 కాంట్రాక్టు క్లాసుల ద్వారా విద్యార్థికి తగిన విద్యా పరిజ్ఞానాన్ని కౌన్సెలర్లు అందించేవారు. ఇంటరాక్షన్ విధానం ద్వారా ప్రతి కౌన్సెలర్ 25 కాంటాక్టు క్లాసులలోనే సిలబస్ పూర్తి చేసేవారు. ఉద్యోగ బాధ్యతలు ఉన్నవారు, పదోన్నతుల కోసమే డిగ్రీ, పిజి కోర్సులు 'ఓపెన్' విశ్వవిద్యాలయంలో చదివేవారు. క్లాసులకు 40% మంది మాత్రమే హాజరై 100మార్కుల పేపర్‌ను రాసి పాస్ అయ్యేవారు. కొన్నిసార్లు కాంటాక్టు క్లాసుకి హాజరుకాని దూరవిద్య అభ్యర్థులు వార్షిక పరీక్షలు రాసి వందమార్కుల పేపర్‌కు 60 మార్కులు తెచ్చుకొని లబ్ధిపొందేవారు. 'ఓపెన్' విద్యలో హాజరుకు ప్రాధాన్యం లేనందువల్ల 'సెల్ఫ్‌స్టడీ' ద్వారా కూడా మంచి ఫలితాలు పొందేవారు.

ఇప్పుడున్న సబ్జెక్టులు విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించటం లేదని ఉద్యోగం వచ్చే చదువు చదవాలని, చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టారు. రెగ్యులర్ డిగ్రీ, పీజీ కాలేజీకైతే ఏమో కాని దూరవిద్యకు సిబిసిఎస్ విధానం అవసరమా అని విద్యావేత్తలు, మేధావులు ప్రశ్నిస్తున్నారు.

సిబిసిఎస్ సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నారు. గతంలో 3ఏళ్లలో మూడు పరీక్షలు రాస్తే అభ్యర్థికి డిగ్రీ పట్టభద్రుడు(గ్రాడ్యుయేట్) అయ్యేవాడు. ఇపుడు మూడు ఏళ్ల చదువును 6 సెమిస్టర్ల ద్వారా పాసు కావాలి. ప్రతి 6నెలలకు ఒక సెమిస్టర్ ఉంటుంది.

వ్యాపారం, వ్యవసాయం, ఉద్యోగం చేసేవారు దూరవిద్య పరీక్షల కోసం ఏటా ఐదు లేక 8 రోజులు 'సెలవు' పెట్టి వార్షిక పరీక్షలు రాసి పట్టాలు సులభంగా పొందేవారు. దేశంలో అన్ని యూనివర్సిటీలకన్నా అంబేద్కర్ ఓపెన్ విశ్వవిద్యాలయానికి విద్యార్థులు క్యూ కట్టేవారు. సిబిసిఎస్ విధానం అమలు చేస్తున్న విశ్వవిద్యాలయం 6నెలల ముందే పాఠ్యపుస్తక రచయితలను ఎంపిక చేసి కొత్తకోర్సు పాఠ్యపుస్తకాలను ముద్రించవలసి ఉంది. డిగ్రీ మొదటి సెమిస్టర్ కాంట్రాక్టు క్లాసులు ముగిసినప్పటికీ, ఇప్పటికీ మారిన మొదటి సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు అన్నీ మార్కెట్‌కు విడుదల కాలేదు. కనీసం ఎపుడు ముద్రిస్తారో తెలియదు. మొదటి సెమిస్టర్ పరీక్షలు డిసెంబర్ నెలలో పూర్తి కావాల్సి ఉన్నా ఇంకా పరీక్షల ప్రస్తావన లేదు. మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుపకుండా జనవరి ఆరు నుండి సెకండ్ సెమిస్టర్ క్లాసులు నిర్వహించమని ఆదేశించినట్లు సమాచారం. మొదటి సంవత్సరం గతంలో 24క్లాసులు ఉండగా, మొదటి, రెండవ సెమిస్టర్‌లో కలిపితే 10 క్లాసులు కావటం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్లాసుల సంఖ్యను 24 నుండి 10కి తగ్గించటం పట్ల విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డిగ్రీ పూర్తి కావాలంటే విద్యార్థి 160 క్రెడిట్ల కోర్సులను చదవాల్సి ఉంటుంది. మొదటి నాలుగు సెమిస్టర్‌లలో ప్రతి సెమిస్టర్‌కు 25క్రెడిట్ల చొప్పున చదువాల్సి ఉంటుంది. ఐదు, ఆరు సెమిస్టర్‌లలో 30క్రెడిట్ల చొప్పున చదువవల్సి ఉంటుంది. అసలే దూరవిద్య 'ఆదివారం చదువు'. దీనికి సెమిస్టర్ అవసరమా? అని డిగ్రీ చదివే విద్యార్థులు గందరగోళానికి గురి అవుతున్నారు. తికమక పడుతున్నారు. మొదటి, నాల్గవ సెమిస్టర్‌లలో ప్రతి ఐచ్ఛిక సబ్జెక్టుకు 5 క్రెడిట్లు, ఇతర భాష, స్కిల్ కోర్సులకు మూడు, మరియు రెండు క్రెడిట్లు ఉంటాయి. విద్యార్థి మొదటి సెమిస్టర్ నుండి నాల్గవ సెమిస్టర్ దాక ప్రతి సెమిస్టర్‌లో 3 ఐచ్ఛిక సబ్జెక్టులు, 4 ఇతర చిన్న సబ్జెక్టులు చదువాల్సి ఉండటంతో దూర విద్య విద్యార్థులు గందరగోళానికి గురి అవుతున్నారు.

ఐదు, ఆరవ సెమిస్టర్లలో పూర్తిగా 6ఐచ్ఛిక సబ్జెక్టులనే చదవాలని విశ్వవిద్యాలయం నిర్ణయించటం జరిగింది. గతంలో డిగ్రీ చదివే విద్యార్థి మొదటి సంవత్సరం తెలుగు, ఆంగ్లము, సాంఘిక శాస్త్రాలలో తప్పక పరీక్ష రాసే అవకాశం ఉండేది. కాని ఇపుడు మొదటి సంవత్సరమే విద్యార్థి ఐచ్ఛికాలు (ఆప్షనల్స్) ఎంపిక చేసుకోమని అంటున్నారు. ఇందులో మూడు రకాలైన కోర్సులు ఉంటాయి. అవి కోర్ సబ్జెక్టులు. ఎలక్టివ్ సబ్జెక్టులు, ఎబిలిటి ఎన్‌హాన్స్‌మెంట్ కంపల్సరీ కోర్సులు. ప్రతి విద్యార్థి డిగ్రీ పూర్తి చేయడానికి 40 రకాల కోర్సులను ఎంచుకోవాలని సూచించటంతో అసలుకే మోసం వచ్చింది. చాలా పాఠ్యపుస్తకాలు ముద్రణ కాలేదు. మొదటి సెమిస్టర్ క్లాసులు పూర్తి అయిన ఎగ్జామ్ తేది ఇంకా రాలేదు.

పద్ధతి ప్రకారం ఉన్న కోర్సులను సిబిసిఎస్ కింద సెమిస్టర్లుగా మార్చటం వల్ల క్లాసులోనే 40 రకాల విద్యార్థులు ఉంటున్నారు. 20మంది కన్నా ఎక్కువ విద్యార్థులు ఉంటేనే, కౌన్సెలర్‌ను క్లాసులు చెప్పటానికి అనుమతిస్తారు. ఎక్కువ సబ్జెక్టులను ఎంపిక చేసుకొనే అవకాశం ఇవ్వటంతో ఏ సబ్జెక్టుకి 10 మంది విద్యార్థులు లేరు. దీనితో రెండు రాష్ట్రాల్లో ఉన్న కౌన్సిలర్లు బజారున పడ్డారు. కోర్సుల్లో విద్యార్థులు అడ్మిట్ అయితేనే క్లాసులు ఇస్తామని విశ్వవిద్యాలయం చెబుతోంది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రెగ్యులర్ డిగ్రీ కాలేజీలలోనే సెమిస్టర్ విధానం ఫలవంతం కాలేదు. రెగ్యులర్ డిగ్రీ అధ్యాపకులకే రెండు ఏళ్లు గడిచినా సిబిసిఎస్ విధానం అంటే తెలియటం లేదు. వారానికొక క్లాసు జరిగే, ఓపెన్ చదువుకి ఇది అవసరమా అని విద్యార్థులు,విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో విశ్వవిద్యాలయాలు దూరవిద్య విధానంలో ఎన్నో రకాలైన కోర్సులను నిర్వహిస్తున్నప్పటికీ అవి ఇంకా సిబిసిఎస్ పద్ధతి ప్రవేశపెట్టలేదు. పూర్తిగా సన్నద్ధం కాకముందే హడావిడిగా, సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి ఓపెన్ విశ్వవిద్యాలయం తన విద్యార్థుల సంఖ్యను తగ్గించుకున్నది. ఉద్యోగ, ఉపాధి రంగాల్లో పనిచేస్తూ చదివేవారు ప్రతి సెమిస్టర్‌కు సెలవులు పెట్టి పరీక్షలు రాయడం కష్టమని చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని విద్యార్థులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

పౌరసేవలహక్కు చట్టం తేవాలి

కండలేని వానికే గండం అన్నట్లుగా తయారైంది నేడు దేశంలోని పేద ప్రజల పరిస్థితి. స్వాతంత్ర్యం వచ్చి 70 వసంతాలు గడిచినా పేదవాడికి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు ఎన్ని ప్రవేశపెట్టినా, ప్రభుత్వ సేవలను పొందటంలో ఎదురవుతున్న ఇబ్బందులు తీర్చేలా నేటికీ వ్యవస్థలో మార్పు రాకపోవడం దురదృష్టకరం. స్వాతంత్ర్యం అనంతరం 14 రాష్ట్రాలుగా ఉన్న మన దేశం నేడు 29 రాష్ట్రాలుగా మారినప్పటికీ నేటికీ పాలన సామాన్యుడికి చేరువ కాలేకపోయింది. అవినీతి, అక్రమాలు, బంధుప్రీతి, అధికార దుర్వినియోగం, అలక్ష్యం లాంటి అంశాలు ప్రభుత్వ పాలనా వ్యవస్థను పట్టిపీడిస్తుండగా, అదే సమయంలో నిరక్షరాస్యులైన సామాన్యులకు, అక్షరాస్యులైనా ఆర్థికంగా లేనివారికి సేవలు, న్యాయం అందని ద్రాక్షగానే మారిందనటంలో అతిశయోక్తి లేదు.

సమైక్య పాలనలో అడుగడుగునా నిర్లక్ష్యం, అణచివేత అనుభవించిన తెలంగాణ ప్రజలు స్వపరిపాలన మొదలయ్యాక జిల్లాలను కూడా పునర్వ్యవస్థీకరించి పాలనను ప్రజలకు చేరువ చేయబూనడం హర్షణీయమే అయినప్పటికీ అదే స్థాయిలో ఉద్యోగ నియామకాలు జరగకపోవడంతో నిజమైన పాలనా సౌలభ్యం రాలేదనే చెప్పాలి. అంతేకాకుండా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక చేపట్టిన అనేక వినూత్న సంక్షేమ కార్యక్రమాల వల్ల, ఉన్న ఉద్యోగులపై కూడా తీవ్రమైన ఒత్తిడి పెరిగింది. ముఖ్యంగా భూదస్త్రాల ప్రక్షాళన, సాదా బైనామా, కళ్యాణలక్ష్మి, గొర్రెల పంపిణీ వంటి వినూత్న పథకాలతో ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అయితే ఇలాంటి పథకాలు మరింత విజయవంతం కావాలంటే మరింతగా మానవ వనరులను చేర్చుకోవడమే శరణ్యం. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం ద్వారా పేదరిక నిర్మూలనకు తీవ్రంగానే కృషి చేస్తున్నప్పటికీ పథకాల అమలులో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా అర్హులను దూరం చేస్తూ అనర్హులను ఎంపిక చేయడం, చేతివాటం ప్రదర్శన, రాజకీయ ఒత్తిళ్లు, దళారుల ప్రమేయం, అలసత్వం లాంటి అంశాలతో నేటి పాలనా వ్యవస్థ కొట్టుమిట్టాడుతున్నది.

అంతా నెట్ మయమైన నేటి సమాజంలో ఇప్పటికీ ఇంకా పాత దరఖాస్తు పద్ధతులపై ఆధారపడటం విడ్డూరం. ఆధునిక ఆవిష్కరణలను ఆలంబనగా చేసుకొని ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేసి ప్రతి వ్యక్తిని అనుసంధానించి జవాబుదారీతనం పెరిగేలా, పారదర్శక వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేయాలి. అందుకుగాను ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపకల్పన, యాప్‌ల తయారీ(రాష్ట్ర సర్వీసులు అన్నింటికీ కేంద్రీకృతంగా ఉండేలా), మొబైల్ ద్వారానే వీలైనన్ని పనులు జరిగే విధానం, సంబంధిత అధికారులపై పర్యవేక్షణ, అధికారుల నిర్లక్ష్యంపై నిరక్షరాస్యులకు, పేద వర్గాలకు ఆలంబనగా ఉండేవిధంగా అవసరమైతే అధికారులపై ముఖ్యమంత్రి స్థాయి వరకు ఫిర్యాదు చేయగలిగేలా వ్యవస్థలో మార్పు తీసుకువస్తేనే నిజమైన అభివృద్ధి, పారదర్శకమైన పాలన సాధ్యమవుతుంది. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉమంగ్, నమో వంటి యాప్‌లు బాగానే ఉన్నా ప్రతి రాష్ట్రంలోనూ అలాంటివి వచ్చేలా కేంద్రం చూడాలి. ఇప్పటికీ సర్టిఫికేట్ జారీకై కొందరు, ప్రభుత్వ ఆసరాకోసం కొందరు ఆర్థికంగా, మానసికంగా సతమవుతూ, లంచాల వల్ల బాధపడుతున్న నిర్భాగ్యులు ఎందరో ప్రతిరోజు ప్రభుత్వ కార్యాలయాల వద్ద తారసపడుతూనే ఉన్నారు.

ప్రభుత్వానికి పన్నులు చెల్లించి ప్రజాస్వామ్యానికి మద్దతుగా నిలుస్తున్న సామాన్యులకు పాలన చేరువైనప్పుడే నిజమైన స్వాతంత్ర్యంగా భావించవచ్చును. అందువల్ల ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆదర్శ పాలనకోసం జవాబుదారీ తనం, పారదర్శకత పెంచేలా, త్వరితగతిన సమస్యలు పరిష్కారం అయ్యేలా, పౌరుడి ఇంటికే పాలన చేరేలా ఆధునిక ఇంటర్‌నెట్ వ్యవస్థను వాడుకొని ప్రతి పౌరుడి ఫిర్యాదును విలువైనదిగా స్వీకరించేలా అధికార వ్యవస్థను సమూలంగా ప్రక్షాళించాలి. అందుకు అనుగుణంగా మార్పులు తెచ్చి ఫిర్యాదు వివరాలతో సహా దాని పరిష్కారం, గడువు, ప్రస్తుత స్థితి, నిర్ణయం, తుది ఫలితం, ఒకవేళ తిరస్కరణకు గురైతే కారణాలు తెలిపేలా అధికార వ్యవస్థ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించేలా పౌరసేవల హక్కుచట్టం (సమాచారహక్కుచట్టం మాదిరిగా)తీసుకురావాలి. అప్పుడే పౌరులకు పనులు మానుకొని ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగే బాధ తగ్గటమే కాక, దళారీల దందాను అదుపు చేయడానికి వీలవుతుంది. ప్రజా ఫిర్యాదుల వ్యవస్థకు అందే అర్జీలు తగ్గితేనే నిజమైన అభివృద్ధి అని భావించాలి.

– వినోద్ కుమార్ సుద్దాల, 9908312949

వ్యక్తిగత రాబడి పన్ను శ్లాబులు పెంచాలి

ఎడిటర్‌కు లేఖ

అనాదిగా ఆర్థిక మంత్రులు, వ్యక్తిగత ఆదాయ పన్ను శ్లాబులను క్రింది విధంగా లెక్క చేస్తున్నారు.

సీనియర్ సిటిజెన్(60ఏళ్ళు నుండి 80 ఏళ్ళులోపు ఉన్న వారు)

చాలా సీనియర్ సిటిజన్స్ (80 ఏళ్లకు పై బడినవారు)

60 ఏళ్ల తరువాత నేరుగా 80 ఏళ్ళు దాటిన వారికే పన్ను రాయితీలలోను, స్లాబ్స్‌లోను మార్పులు కల్పిస్తున్నారు. రానున్న గంటలో ఏ ఆపద జబ్బుతో ప్రాణం మీదకు వస్తుందోనన్న భయంతో జీవించే 65 ఏళ్ళు పైబడిన ఆదాయపు పన్ను చెల్లించే వారిపై ఆర్థికమంత్రి, ప్రియతమ ప్రధానమంత్రి ఆలోచించక పోవటం శోచనీయం. వారి బాధ్యతలు కుటుంబ వ్యక్తులకే గాని పాలకులకు ఉండకూడదా. టాక్స్ చెల్లించేవారు అందరూ ప్రభుత్వ ఉద్యోగులైతే కొంతలోకొంత ప్రభుత్వ సహాయం అందుతుంది. ఇక ప్రైవేట్ ఉద్యోగులైతే నిత్యం మందులతో, రోగాలతో ఆసుపత్రి చుట్టూ తిరిగి వందలు, వేలు, లక్షలు చెల్లించాల్సిందే. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2015సంవత్సర ర్యాంకింగ్ ప్రకారం భారతదేశం 125వ స్థానంలో ఉంది (ఈ సమాచారం 2016 మే లో ప్రచురించారు) ఆ లెక్కల ప్రకారం భారతదేశంలో స్త్రీ సగటు ఆయుర్దాయం 69.9 సంవత్సరాలు, పురుషులకు 66.9 సంవత్సరాలు. ఈ పరిస్థితిలో ఎంతమంది 80సంవత్సరాలు బ్రతికి ఉంటారు, ఇంకా అందులో రూ.5లక్షలు టాక్స్ ఆదాయం ఉన్నవారు ఇంకెంతమంది ఉంటా రు. అందుకే వ్యక్తిగత టాక్స్‌లో స్లాబులు ఎక్కువగా పెడితేనే ప్రజలకు ఉపయోగం ఉంటుంది. 60 ఏళ్ళ తరువాత ప్రతి 5 సంవత్సరాలకి ఒక స్లాబ్ పెడితే బాగుంటుంది. అప్పుడు ప్రతి టాక్స్ పేయిర్ టాక్స్‌లో రాయితీ పొందగలుగు తారు. ఎలాగా ఉచిత ప్రభుత్వ వైద్య సహాయం అందచేయట్లేదు. అందుకే ఈ క్రింది విధముగా ఆదాయ పన్ను స్లాబ్స్ పెడితే ఆనందిస్తారు.

65 సంవత్సరాలు పైన 70లోపు 70 సంవత్సరాలు పైన 75 లోపు
75 సంవత్సరాలు పైన 80లోపు 80 సంవత్సరాలు పైన వారికి
అస్సలు టాక్స్ ఉండకూడదు.
(వ్యాపారస్తులను మినహాయించండి)

– చామర్తి వెంకట రామకృష్ణ, హైదరాబాద్



అఖిల



జీవితమే ఒక నాటకం.. ప్రతిక్షణం ఓ పాత్రలో జీవించాలి.. అంతిమ ఘడియల్లో పోషించే పాత్ర కొంతమందికి అత్యంత విషాదకరంగా మారుతుంది. మృత్యుకుహరాల్లోకి జారుకుంటారని తెలిసినా బతకాలనే ఆశ చిగురిస్తుంటుంది. ఆదరించే బంధువులు కరువైనా... అద్దె ఇళ్లల్లో చివరి క్షణాల్లో ఉండనీయకున్నా.. నేనున్నాను అంటూ ఆపన్నహస్తం అందిస్తోంది స్పర్శ హాస్పస్ ట్రస్టు. జీవన చివరి క్షణాల్లో అనుభవించే బాధను స్వచ్ఛందంగా దూరం చేసేందుకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తోంది. మానవీయకోణంలో ఈ ట్రస్టును వైద్యురాలు ఫణిశ్రీసాయి నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు వందలాది మందికి స్వచ్ఛంద సేవలు అందిస్తున్న ఫణిశ్రీతో "అఖిల" ముఖాముఖి.



ప్రేమతో ఉపశమనం

జీవిత చరమాంకంలో ఉన్న వారికి నిస్వార్థ్యంగా సేవ చేయాలనే ఆలోచన ఎలా వచ్చింది?

ఇలాంటి సంస్థలు విదేశాల్లో చాలా ఉన్నాయి. నేను డాక్టర్‌గా విదేశాల్లో ఉన్నప్పుడు ప్రత్యక్షంగా చూశాను. ఇండియాలో ఇలాంటి సంస్థలు ఇప్పటివరకు లేవు. నేను రోటరీక్లబ్ సభ్యురాలుగా ఉండటంతో కొంతమంది డాక్టర్లకు నా ఆలోచన చెప్పాను. స్వచ్ఛందంగా, ఉచితంగా సేవలు అందించేందుకు డాక్టర్లను సమీకరించాను. ఆ తర్వాత అద్దె ఇంటి కోసం ప్రయత్నించాను. ఇల్లు అద్దెకు ఇచ్చేందుకు ఎవరూ ముందుకురాలేదు. చివరిదశలో ఉన్న రోగులను ఆదుకునేందుకు కానీ, వారికి ఇల్లు అద్దెకు ఇచ్చేందుకు ఎవరికీ మనసు అంగీకరించలేదు. అయినా ప్రయత్నం మానుకోలేదు. చివరకు ఒక ప్రభుత్వ ఉన్నతాధికారి తన ఇంటిని తక్కువ అద్దెకు ఇచ్చి ప్రోత్సహించారు. 2011లో స్పర్శ హాస్పస్ ట్రస్టును ఏర్పాటు చేసి సేవలు అందించడం ప్రారంభించాను.



*** ఎలాంటి వారికి సేవలందిస్తారు?**

డాక్టర్లు వైద్యం నిలిపివేసి ఇక శరీరం వైద్యానికి అంగీకరించదు అంటూ.. రోగులను ఇంటికి పంపిస్తే వారి పరిస్థితి దీనంగా ఉంటుంది. బంధువులు ఆదరించరు. ఇంటి వద్ద దీనంగా చూస్తారు. వైద్యఖర్చులు అనవసరమని భావిస్తారు. అద్దె ఇంట్లో ఉండనీయరు. రోగి చనిపోక ముందే నరకం అనుభవించడం బాధవేస్తుంటుంది. ప్రత్యక్ష నరకానికి నకలుగా రోగులు అనుభవించే మానసిక క్షోభ గుండెలను పిండివేస్తుంటుంది. అలాంటి వారిని ఆదుకోవడమే స్పర్శ లక్ష్యం. ఉచితసేవలందించడమే స్పర్శ ధ్యేయం. చివరిదశలో ఉండే పేషెంట్స్‌ను మిగతా వారితో పోలిస్తే మానసికస్థితి ఆందోళనగా ఉంటుంది. చనిపోతారని తెలిసి బతకాల్సిన సందర్భంలో రోగి పడే బాధ హృదయాలను కదిలిస్తుంటుంది. వారికి ప్రత్యేకమైన చికిత్స అందివ్వాలి. ఎక్కువగా క్యాన్సర్ రోగులకు ఈ పరిస్థితి ఉంటుంది. అడ్వాన్స్‌డ్ స్టేజిలో క్యాన్సర్ ఉన్నప్పుడు అనేక ఇబ్బందులు ఉంటాయి. వారిని సరిగ్గా అర్థం చేసుకుని మానసిక ధైర్యాన్ని కలిగిస్తూ వైద్యం చేయాలి. వారికి చికిత్సే కాదు ప్రేమతో పలకరిస్తే ఉపశమనం కలుగుతుంది.

*** ఉచితసేవలు అందిస్తారా..మందుల కోసం చార్జీ వేస్తుంటారా?**

ఇక్కడ సేవలన్నీ ఉచితమే..రోగితో పాటు అటెండెంట్‌కు కూడా భోజనసదుపాయం కల్పిస్తున్నాం. పనిచేసే సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారు. వారికి వసతి సదుపాయాలు కలిగిస్తుంటాం. మా డాక్టర్ల బృందం ఖర్చు భరించడంతోపాటు రోటరీ క్లబ్ ద్వారా ఆర్థిక సహాయాన్ని కొంతవరకు పొందుతున్నాం. పెద్దభవనం లేకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయి. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆసుపత్రి నిర్మాణానికి స్థలం ఇచ్చేందుకు అంగీకరించింది. క్యాన్సర్ రోగులు బాధతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. వారి నొప్పులను తగ్గించేందుకు ఖరీదైన మందులు అవసరమవుతుంటాయి. చికిత్స పొందిన ఆసుపత్రి రికార్డులను పరిశీలించి చివరి ఘడియల్లో ఉన్నారని మా వైద్యబృందం నిర్ణయించిన అనంతరమే సేవలందిస్తాం. ఇప్పటి వరకు 800 మందికి చివరి దశలో అందించిన సేవల్లో కొంత మంది బతికారు.

*** సేవాకార్యక్రమాలకు కుటుంబపరమైన సహాయం ఉందా?**

నేను డిగ్రీవరకు గోదావరిఖనిలో చదివాను. ఎంబిబిఎస్ కరీంనగర్‌లో చేశాను. మా వారు జగదీష్ పూర్తిగా సహకరిస్తున్నారు. అమెరికాలో డాక్టర్‌గా పనిచేస్తున్నప్పుడు ట్రీట్‌మెంట్ పూర్తయిన తర్వాత కూడా వృద్ధులు మళ్ళీ వచ్చేవారు. దీనితో వృద్ధుల వైద్యంపై జిడియాట్రిక్స్ చదివాను. అప్పటి చదువు ఇప్పుడు ఉపయోగపడుతోంది.

*** వృద్ధులకు వైద్యసేవలు ఎలా ఉంటున్నాయి?**

వైద్య శాస్త్ర అభివృద్ధితో వృద్ధుల జీవితకాలం పెరిగింది. విదేశాల్లో సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేక అడ్వాన్స్ మెడికల్ కేర్ ఉంది. అలాంటిది మనదేశంలో రావాలి. 60 ఏళ్లు పైబడిన వారికి అనారోగ్య సమస్యలు ప్రత్యేకంగా ఉంటాయి. ప్రధానంగా క్యాన్సర్ బాధ భరించడం కష్టంగా ఉంటుంది. మూత్రపిండాల సమస్య వస్తుంటుంది. చికిత్స ద్వారా ఆరోగ్యవంతుల్నిగా చేసే వైద్యవిజ్ఞానశాస్త్రం అందుబాటులో ఉంది. జీవితగమనంలో పోరాడి అలిసిపోయిన ఆరోగ్య సమస్యలు మృత్యుకుహరాలకు నెడుతుంటాయి. అలాంటివారికి ధైర్యం చెబితే హాయిగా కన్ను మూసే అవకాశాలు ఉంటాయి.ప్రతి ఒక్కరూ ఏదో ఒకరోజు ఏదో విధంగా జీవితంలో చివరి అడుగు వేయాల్సిన వారే, అయితే ముందూవెనక తేడాలు మాత్రంయి..అందుకే అంతిమ ఘడియల్లో ఆనందం కోసం తపించే హృదయాలను ఆనందింపచేయడంలోనే ఆనందం వెతుక్కోవాలి.

వి.భూమేశ్వర్

విరుగుడు

లైఫ్‌స్టైల్ @

అమ్మాయ్ మాధవీ! రేపు నీకు పెళ్లి చూపులు
ఆఫీస్ నుంచి త్వరగా వచ్చెయ్ ....
నాకు పెళ్లి చూపులా ...ఎవరు? ఎందుకు? ఎప్పుడు వస్తారు..
అబ్బాయి, అబ్బాయి తల్లి, తండ్రి రేపు మనింటికి వస్తున్నారు ...
అబ్బాయి తల్లి, తండ్రి వస్తారా...
వాళ్ళెందుకు?
అదేంటే... వాళ్ళు చూడద్దా నిన్ను...
ఎందుకు చూడాలి?
ఎందుకేంటి? వాళ్ళకి నువ్వు నచ్చద్దా ...
వాళ్ళకెందుకు నచ్చాలి?
ఇది మరీ బాగుంది వెధవ ప్రశ్నలూ నువ్వునూ...కాబోయే కోడలిని చూసి నచ్చుకోవద్దూ ...
నేను వాళ్ళకి ఎందుకు నచ్చాలి... అబ్బాయికి నచ్చితే చాలదా...
నీకేం మతి చలించిందా ... పిచ్చి ముదిరింది రోకలి మెడకు చుట్టమన్నదట నీలాంటిదే ...
అసలు నాకు పెళ్లి చూపులంటేనే ఆశ్చర్యంగా ఉంది... పైగా అబ్బాయితో పాటు అతని తల్లి, తండ్రి కూడా రావడమా ..
ఇందులో ఆశ్చర్యపోడానికేం ఉంది ? నీకు పెళ్లీడు రాలేదా ... పెళ్లి చేసుకోవా ...
వస్తే పెళ్లి చేసుకోవాలా ... తప్పదా...
ఎలా తప్పుతుంది.. ? ఎవరైనా అమ్మాయి అయినా, అబ్బాయి అయినా ఒక వయసు వచ్చాక పెళ్లి చేసుకోవాలిగా.... అదే ఎందుకు అని అడుగుతున్నాను ....ఎందుకేంటే ... పెళ్ళెందుకు చేసుకుంటారు..
పిల్లల్ని కనడానికి, వాళ్ళని పెంచి పెద్ద చేయడానికేగా..
నీకు నిజంగానే పిచ్చెక్కింది.. ఏ మాత్రం అనుమానం లేదు.. పోనీ అంతే అనుకో ...
అనుకో ఏంటి అంతే ... మీరంతా చేసింది అదేకదా... జనాభా పెంచడానికి మీ వంతు కృషి చేశారు.
ఏవండి ... మిమ్మల్నే ... ఇలా రండి.. మీ కూతురు ఏవో సిద్ధాంతాలు మాట్లాడుతోంది...సిద్ధాంతాలు కాదమ్మా...
పాయింట్‌కి వస్తున్నా ... అసలే దేశంలో జనాభా పెరిగిపోతోందా.... నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయా? పెరిగే జనాభాకి సరిపడా నీళ్ళు, కరెంట్ ఇవ్వడానికి ప్రభుత్వం చాలా అవస్థలు పడుతోందా.. జనం పెరగడం వలన ఉపాధి అవకాశాలు కూడా పెరిగి పరిశ్రమలు వస్తున్నాయా? బోలెడన్ని వాహనాలు, బోలెడంత ఇంధనం, వీటి వలన బోలెడంత కాలుష్యం ... బోలెడన్ని రోగాలు ...
ఇదీ ఓ రోగమే కాబోలు...
అలా విసుక్కోకు మరి... నేను పెళ్లి చేసుకుని, పిల్లల్ని కని మరికొంత జనాభా పెరగడానికి కారణం అవుతాను కదా ...
అయితే ఏంటి నీ నస ... అందుకని పెళ్లి చేసుకోనంటావా ...ఇలా బ్రహ్మచారిణిగా ముదిరిపోతావా...
పెళ్లి చేసుకోను... అలాగని బ్రహ్మచారిణిని కాను ...
హవ్వ ... అవేం మాటలే .... నలుగురు వింటే నవ్వి పోతారు...
అమ్మా ... పెళ్లి చేసుకుంటే నేను ఇక్కడి నుంచి వెళ్ళిపోయి అతనితో బతకాలి కదా...
లేక నా నెత్తిన కూర్చుని ఇలా జీవితాంతం విసిగిస్తావా..
కదా... అలాంటప్పుడు పెళ్లి చేసుకోకపోయినా నేను అతనితో బతకచ్చుగా
ఛీ, ఛీ ...
అదేనమ్మా ... ఇలా చాలు ,
చాలు అంటూ మమ్మల్ని ఎదగనివ్వడంలేదు మీరు.. దేశం బాగుపడాలన్నా.. నాగరికత పెరగాలన్నా మా యువతరం తీసుకు వస్తున్న కొన్ని విప్లవాత్మక మార్పులని మీరు అంగీకరించాలి.. ఆశీర్వదించాలి.. పెళ్లి, సంసారం, అత్తామామలు, సేవలు, ఆడపడుచుల పెళ్ళిళ్ళు, మరుదుల చదువులు, బాధ్యతలు... పిల్లల్ని కనడాలు, వాళ్ళని పెంచడాలు, వాళ్ళకి చదువులు, పెళ్ళిళ్ళ కోసం మా యవ్వనం అంతా కష్టపడి ఆస్తులు కూడపెట్టడం, ఓ మైగాడ్ ... టోటల్లీ బాక్ .... బాక్ ...
యువత ముందుకు నడవాలి....
మీరంతా వెనక ఉండి నడిపించాలి.. అందుకే నేను పెళ్లి చేసుకోను.. సహచర్యం చేస్తాను..
అలాగే ... ఏవండి ... మీ అమ్మాయి పెళ్లి కోసం ఎఫ్‌డిలో దాచిన పదిలక్షలు రేపే డ్రా చేసి తీసుకురండి...
కొత్తగా బంగారం షాపు ఒకటి పెట్టారుట.. అక్కడ కొత్త, కొత్త నగలు వచ్చాయిట నేను కొనుక్కుంటాను..




అత్తలూరి విజయలక్ష్మి
99512 50144

ముత్యాలముగ్గులు







యం.సుకన్య, వనస్థలిపురం
28 చుక్కలు– 6వరుసలు –6వచ్చే వరకు



సి.రాజలక్ష్మి, హైదరాబాద్
16 చుక్కలు– 8వరుసలు –8 వరకు



చిరిపోతుల లక్ష్మి, భూపాలపల్లి జిల్లా
24 చుక్కలు– 8వరుసలు –8వచ్చే వరకు



కె. పావని, కాళీమందిర్, హైదరాబాద్

అంతర్జాతీయ అవార్డు రేసులో 'టి హబ్' స్టార్టప్



మన తెలంగాణ / హైదరాబాద్ : నూతన ఆవిష్కరణలకు ప్రొత్సాహాన్ని అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన 'టి హబ్' అంతర్జాతీయంగా కూడా తనదైన ముద్రను వేAసుకుంటోంది. టి హబ్ రూపొందించిన 'స్టార్టప్ బన్యన్ నేషన్' అంతర్జాతీయ అవార్డుల బరిలో నిలిచింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌ల ఈ నెలలో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ఈ అవార్డులను ప్రకటిస్తారు. ప్రముఖ కంపెనీ డెల్ సంస్థ పీపుల్స్ ఛాయిస్ అవార్డును ప్రకటించనుంది. ప్రపంచ వ్యాప్తంగా పలు సంస్థలను పరిగణనలోకి తీసుకున్న డెల్ సంస్థ ఈ అవార్డు కింద విజేతను ఎంపిక చేసేందుకు తీవ్ర కసరత్తు చేసింది. తుది దశకు చేరుకునే సరికి ఆరు సంస్థలు పోటీలో నిలిచాయి. ఇందులో భారత్ నుండి ఎంపికయిన సంస్థ బన్యన్ నేషన్ మాత్రమే కావడం గమనార్హం. ఆయా సంస్థల పని తీరును వివరిస్తూ ఓటింగ్ ఆధారంగా తుది విజేతను ఎంపిక చేయనున్నారు. ఇందుకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో బన్యన్ నేషన్‌కు మద్దతుగా ఓటు వేయాలని మంత్రి కెటిఆర్ ట్విట్టర్ వేదికగా ట్వీట్ చేశారు.

ప్రతాప్‌రెడ్డి తల్లిదండ్రులకు మిగిలింది ఆయన మానవత్వం, మంచితనం



మన తెలంగాణ/సూర్యాపేట : తన కళ్ల ముందే తన కుమారుడు ఇక లేడని చెప్పుకొనే ఆ తల్లిదండ్రుల మనో వేదన చెప్పలేనిదని మన తెలంగాణ దినపత్రిక ఎడిటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు, మాజీ ఎంఈవో గోపు ప్రతాప్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసి ఉన్న అనుబంధాన్ని నెమరవేసుకున్నారు. తెలంగాణ ఉద్యమం జరుగుతున్న తరుణంలో తాను ప్రచురించిన కథనాలు నేటికి కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తున్నాయన్నారు. 40సంవత్సరాల వృత్తిలో ఎన్నో మన్ననలు పొందారని తెలిపారు. అందరితో కలివిడిగా ఉంటూ సమాజాన్ని అవగాహన చేసుకున్న గొప్ప వ్యక్తి ప్రతాప్‌రెడ్డి అని శ్లాఘించారు. పని ఒత్తిడి వల్ల ప్రతాప్‌రెడ్డిని తాము కలుసుకోలేక పోయినా చరవాణిలోనే సమాచారం తెలుసుకునే వాళ్లమని గుర్తు చేశారు. అనంతరం ప్రతాప్‌రెడ్డి తల్లిదండ్రులు గోపు మల్రెడ్డి రాంరెడ్డి, శౌరీలమ్మ, భార్య సుందరి, కుమారులు శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలను ఓదార్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, పార్టీ సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డిలు మాట్లాడుతూ సాయుధ పోరాట గడ్డగా పేరొందిన సూర్యాపేటలో పాత్రికేయ వృత్తిలో రాణించి పలువురి మన్ననలు పొందడం గొప్ప విషయమని అన్నారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి వెంట సీనియర్ జర్నలిస్టు, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు దేవరశెట్టి రవికుమార్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు మిక్కిలినేని శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఊట్కూరి రవీందర్, కందుల నాగరాజు, కొచ్చెర్ల రవి, గోపగాని మనోజ్, తూడి శ్రీనివాస్ ఉన్నారు.

పరిశ్రమల బడ్జెట్‌పై కసరత్తు !

- 3 వేల కోట్ల నిధుల్ని ఆశిస్తున్న పరిశ్రమల శాఖ
- తయారీ రంగ పరిశ్రమలకు 15 శాతం రాయితీకి అవకాశం



మన తెలంగాణ / హైదరాబాద్ : వచ్చే ఆర్థిక సంవత్సరం 2018–19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే బడ్జెట్ అంచనాల కసరత్తును ప్రారంభించింది. ఈ సారి తయారీ రంగ పరిశ్రమలకు 15 శాతం వరకు పన్ను రాయితీలు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోందని సమాచారం. ఇందుకు ముందుగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని, ఒక వేళ కేంద్రం సంసిద్ధత తెలపక పోతే రాష్ట్రమే పన్ను రాయితీని ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. అలాగే వ్యవసాయ రంగం, సాగు (మిషన్ కాకతీయ), తాగు నీటి (మిషన్ భగీరథ) రంగాల తర్వాత పరిశ్రమల రంగానికి అత్యధికంగా ప్రాధాన్య ఇస్తారని భావిస్తున్నారు. ప్రభుత్వంలో అత్యంత కీలకంగా ఉన్న మంత్రి కెటిఆర్ నిర్వహిస్తున్న శాఖ కూడా కావడంతో పరిశ్రమల శాఖకు కేటాయింపులు కూడా ఆశాజనకంగానే ఉండవచ్చంటున్నారు. అదే సందర్భంలో ప్రభుత్వ ప్రాధాన్యతలను బట్టి ఇతర వివిధ శాఖలకు నిధులను నిర్దేశిత లక్ష్యాల మేరకు కేటాయించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. పరిశ్రమల శాఖకు బడ్జెట్ కేటాయింపులపై ఆ శాఖ ఉన్నతాధికారులు జయేష్ రంజన్, ఇతర ఉన్నతాధికారులు ఇప్పటికి పలు దఫాలుగా చర్చించుకుని ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలు పంపించారు. వీటిలో ముఖ్యంగా ఖాయిలా పరిశ్రమలను తిరిగి తెరిపించేందుకు రివైవల్ ప్యాకేజీల నిమిత్తం సుమారు రూ. 2 వేల కోట్లు, 2013–14 ఆర్థిక సంవత్సరం నుండి ఇన్‌సెంటివ్స్ కింద పారిశ్రామిక సంస్థలకు చెల్లించాల్సిన పాత బాకాయిలు తదితరాలు కలుపుకుని మొత్తం మూడు వేల కోట్ల వరకు విడుదల చేయాలని కోరనున్నట్లు తెలిసింది. పావలా వడ్డీ, పవర్ సబ్సిడీలు తదితరమైనవి ఇందులో ఉన్నాయని సమాచారం. అదీ గాకుండా మంత్రి కెటిఆర్ స్వయంగా ఈ శాఖను నిర్వహిస్తుండడంతో ఈ శాఖకు కేటాయింపులపై ఉన్నతాధికారులు సమీక్షలు, సమావేశాలను నిర్వహిస్తూ వాస్తవిక పరిస్తితిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు యత్నిస్తున్నారు.

నిలదొక్కుకునే వరకు కేంద్రం తోడ్పాటు :

నూతనంగా ఏర్పాడిన రాష్ట్రాలు ఆర్థిక పరంగా స్వంతంగా నిలదొక్కునేంత వరకు సాయం చేస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. దీని ప్రకారం కేంద్రం నుండి అందాల్సిన నిధులు, రాయితీలను పొందేందుకు ఉన్న అవకాశాలను కూడా వినియోగించుకోవాలని రాష్ట్రం భావిస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ తరహాలో కొత్త రాష్ట్రమైన తెలంగాణలోనూ జిల్లాల్లో పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి కేంద్ర రాయితీలను అధికంగా వినియోగించుకోవాలని చూస్తోంది. 2015 ఏప్రిల్ 1 తర్వాత పరిశ్రమలను ప్రారంభించే వారికి కేంద్ర ఆదాయపన్ను చట్టం సెక్షన్ 32 ఏడి ప్రకారం ఈ వెసులుబాటును కల్పించాలని కేంద్రాన్ని కోరనున్నట్లు సమాచారం. మేకిన్ ఇండియా స్పూర్తిగా తయారీ రంగంలో పరిశ్రమలను ప్రారంభించే వారికి 15 శాతం వరకు రాయితీలను ఇచ్చే అవకాశం ఉందని పరిశ్రమల శాఖ అధికారి ఒకర మన తెలంగాణకు తెలిపారు.

ఇలా తెలంగాణలోని పారిశ్రామిక వర్గాలకు 15 శాతం రాయితీలు అందించడం వల్ల రానున్న రోజుల్లో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పుకునే వీలు కల్గుతుందంటున్నారు. కేంద్ర నిధులు గనుక విడుదలైతే తెలంగాణలో ముఖ్యంగా పాత జిల్లాలైన నల్గొండ, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ నిధులను ఎక్కువగా వినియోగించుకోనున్నట్లు సమాచారం.

రిజిస్ట్రేషన్ నో

(మొదటిపేజీ తరువాయి)

పోచారం శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్న ఈ సమావేశంలో వివిధ అంశాలపై, ప్రతిపాదనలపై, ఆలోచనలపై సుదీర్ఘ చర్చ జరిగింది. అనుమతిలేని లే అవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను ఆపివేస్తే ఎలా ఉంటుందన్న అంశంపై అంతకు ముందు సంబంధిత శాఖ మంత్రి, డిప్యూటి సిఎం మహమూద్ అలీతోనూ ఉప సంఘం ప్రత్యేకంగా చర్చించింది. ఎలాంటి అనుమతులు లేకుండా లే అవుట్లు చేస్తూ విచ్చలవిడిగా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, దీని వల్ల సామాన్యులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని సబ్ కమిటి సమావేశంలో చర్చకు వచ్చింది. లే అవుట్‌కు అనుమతి ఉంటేనే ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు తీసుకుంటే మంచిదనే అభిప్రాయం వ్యక్తం అయింది. ప్రస్తుతం జిల్లా పరిషత్, మండల పరిషత్తుల్లో ఉన్నట్లుగానే పంచాయతీ పాలకవర్గ సమావేశాలకు హాజరయ్యే సభ్యులకు కూడా సిట్టింగ్ ఫీజు ఇవ్వాలనే అభిప్రాయం వ్యక్తం అయింది. ప్రత్యేక పరిస్థితుల్లో మినహా వరుసగా మూడుసార్లు పాలకవర్గ సమావేశాలకు గైర్హాజరైతే అనర్హత వేటు కూడా వేసే అంశంపై కూడా వీరు చర్చించారు. పంచాయతీల్లో కో ఆప్షన్ సభ్యులను నియమించే అంశాన్ని పరిశీలిస్తున్న సబ్ కమిటి ఇందులో ఎన్ఆర్ఐ (ప్రవాస భారతీయులు)లకు, గ్రామంలో లేని వారికి కూడా అవకాశం ఇస్తే ఎలా ఉంటుందన్న దానిపై చర్చించారు. అలాగే పంచాయతీ జనాభానుబట్టి ఇద్దరు, ముగ్గురిని కూడా నామినేటెడ్ చేసుకునే అవకాశాలపై కమిటి సభ్యులు చర్చించారు. ఇందులో గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు, గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, నిపుణులకు అవకాశం కల్పించడం వల్ల గ్రామ అభివృద్ధికి వారి సహకారం కూడా అందుతుందనే అభిప్రాయం వ్యక్తం అయింది. భవనాల అనుమతులపైనా ఈ సమావేశంలో చర్చించారు. 200 చదరపు గజాల లోపు విస్తీర్ణంలో జి ప్లస్ 2 ఎత్తులో నిర్మించే భవనాల అనుమతులను గ్రామ పంచాయతీల్లో ఇస్తుండగా , అంతకన్నా ఎక్కువ విస్తీర్ణంలో అయితే మండలాల్లోనూ ఎంపిడిఓ , తహసీల్దార్, ఈఓపిఆర్‌డి, పంచాయతీరాజ్ ఎఈల నేతృత్వంలో కమిటి ఏర్పాటు చేసి అనుమతించే అంశంపై చర్చించారు. అలాగే భవన నిర్మాణానికి హెచ్‌ఎండిఏ అనుమతిచ్చిన వారం రోజుల్లోనే పంచాయతీ క్లియరెన్స్ ఇవ్వాలని, లేని పక్షంలో అది అనుమతిచ్చినట్లుగానే భావించాల్సి ఉండేలా చట్టంలో పొందుపర్చే అంశం కూడా సబ్ కమిటి భేటీలో ప్రస్తావనకు వచ్చింది. అలాగే పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి పంచాయతీల నుండి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేకుండా చట్టంలో పొందుపరిచే అంశంపైనా చర్చించారు. చాలా అంశాలు చర్చలకు మాత్రమే పరిమితమై స్పష్టమైన నిర్ణయం జరగకపోవడంతో గురువారం కూడా కెబినెట్ సబ్ కమిటి మరో సారి సమావేశం కానుంది.

దావోస్‌కు కెటిఆర్

(మొదటిపేజీ తరువాయి)

మంత్రిని కోరామన్నారు. నిజామాబాద్ స్పైస్ పార్క్‌కు రూ.20 కోట్లను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ప్రకటించిందని, ఆ నిధులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. హైదరాబాద్– వరంగల్, హైదరాబాద్ – రామగుండం, హైదరాబాద్ – బెంగళూరు ఇండస్ట్రీయల్ కారిడార్లకు కావాల్సిన నిధులను కేటాయించాలని సురేష్ ప్రభును కోరినట్లు కెటిఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో మెగా లెదర్ పార్క్ ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించబడిందని, తెలంగాణ రాష్ట్రానికి మెగా లెదర్ పార్క్ కేటాయించాలని కోరామని మంత్రి తెలిపారు. ఫిబ్రవరి 22, 23న హైదరాబాద్‌లో నిర్వహించే బయో ఆసియా సదస్సుకు గౌరవ అతిథిగా సురేష్ ప్రభును ఆహ్వానించామని, రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు సదస్సులో పాల్గొంటానని ఆయన స్పష్టం చేశారని కెటిఆర్ తెలిపారు. అంతకు ముందు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ఆధ్వర్యంలో జరిగిన పిఐఒ పార్లమెంటేరియన్ (భారత సంతతి పౌరులు) సమావేశంలో కెటిఆర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా పలు సూచనలు, సలహాలను అందించారు. దేశంలోనే పాస్‌పోర్ట్‌ల వెరిఫికేషన్, ఇమ్మిగ్రేషన్ విషయాల్లో తెలంగాణ ప్రభుత్వం ముందు వరుసలో ఉందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ప్రశంసించారని మంత్రి తెలిపారు. పశ్చిమాసియా దేశాలలో చాలా మంది తెలుగువారు ఉన్నారని, ఈ నేపథ్యంలో అక్కడి రాయబార కార్యాలయాల్లో నలుగురి చొప్పున తెలుగు ట్రాన్స్‌లేటర్లను నియమిస్తే బాగుంటుందని సమావేశంలో సూచించామని మంత్రి తెలిపారు. యెమన్, లిబియా వంటి దేశాల్లో చిక్కుకున్న భారతీయులను వెనక్కి తీసుకు వచ్చినా, ఆ దేశాల్లో దక్కే వేతనాలను చూసి మళ్లీ బాధితులు పర్యాటక, ఆరోగ్య వీసాలపై అక్కడికి వెళ్తున్నారని మంత్రి తెలిపారు. నకిలీ ఏజెంట్లపై తెలంగాణ ప్రభుత్వం కొరడా ఝులిపిస్తోందని, ఇప్పటికే చాలా నకిలీ ఏజెంట్ల దుకాణాలు మూసి వేయడమే కాకుండా, వారిపై విదేశాంగ చట్టాలను అనుసరించి కేసులు నమోదు చేసినట్లు మంత్రి తెలిపారు. తెలుగు వారికి ఉపయోగపడేలా హైదరాబాద్‌లో విదేశీ భవన్ ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని మంత్రి కె. తారక రామారావు తెలిపారు. మంత్రి కెటిఆర్‌తోపాటు ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ జి.అశోక్ కుమార్ ఉన్నారు.

50:60

(మొదటిపేజీ తరువాయి)

రావాల్సిన కోటాలోంచి చేరో పది టిఎంసిలు తగ్గించుకొని, మిగతా నీటిని అవసరాలకు తగ్గట్లుగా వాడుకోవాలని కోరారు. దీంతో తెలంగాణకు 50 టిఎంసిలు, ఆంధ్రప్రదేశ్‌కు 60 టిఎంసిల వినియోగానికి బోర్డు అనుమతించింది. అయితే ఇప్పటికే వినియోగించిన నీటిలో ఆంధ్రప్రదేశ్ అధికంగా వాడుకున్న విషయం సమావేశంలో ప్రస్తావనకు రాలేదు. శ్రీశైలంలో నీటి విడుదలపై చెన్నైకి నీటి విడుదల తర్వాత చెబుతామని చెప్పిన ఎపి ఇఎన్‌సి వెంకటేశ్వరరావు, సాగర్‌లో 520 అడుగుల వరకు నీటిని వినియోగించుకుందామని ప్రతిపాదించారు.

దీంతో తెలంగాణ ఇఎన్‌సి మురళీధర్ అంగీకరించారు. శ్రీశైలంలో ఎంత వరకు వినియోగించుకోవాలనే విషయంపై స్పష్టత రాలేదు. ప్రాజెక్టుల నిర్వహణ బోర్డుకే అప్పగిద్దామని ఎపి ఇఎన్‌సి వెంకటేశ్వరరావు ప్రతిపాదించారు. టెలీమెట్రీ పాయింట్ల ఏర్పాటును వేగవంతం చేయాలని నిర్ణయించారు. పోతిరెడ్డిపాడు నీటిని తక్కువ చూపుతున్న వైనంపై, నాగార్జునసాగర్ ఎడమ కాలువలో ఆంధ్రా కోటా కింద తక్కువగా వస్తున్న విషయంపై సమావేశంలో ప్రస్తావనకు రాగా, దానిపై కమిటీలు వేశామని, వాటి నివేదికలు వచ్చాక చర్చిద్దామని సభ్య కార్యదర్శి పరమేషం సూచించారు. అయితే ఆంధ్రప్రదేశ్ తరపున 38 టిఎంసిలు, తెలంగాణ తరపున 17 టిఎంసిల నీటి విడుదల కోరుతూ ఇప్పటికే ఇండెంట్ ఇచ్చారు.

చెక్కు చెదరకుండా

(మొదటిపేజీ తరువాయి)

అందించే విధానంపై వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం రెండో రోజూ బుధవారం సచివాలయంలో సమావేశమైంది. రైతుల నుంచి వచ్చిన అభిప్రాయాలపై చర్చించింది. రాష్ట్ర వ్యాప్తంగా 551 మండలాలలోని 624 గ్రామాలలోని 62,677 మంది రైతుల నుండి వ్యవసాయ శాఖ సేకరించిన అభిప్రాయాల్లో చెక్కుల ద్వారా పంపిణీకే ఎక్కువమంది మొగ్గు చూపారు. అందుకనుగుణంగానే నిర్ణయం తీసుకున్నట్లు సమావేశం అనంతరం మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి మీడియాకు వెల్లడించారు. ఈ సమావేశంలో సభ్యులు మంత్రులు తి టి. హరీష్ రావు, తుమ్మల నాగేశ్వర రావు, ఈటెల రాజెందర్, జగదీశ్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, వ్యవసాయ శాఖ కార్యదర్శి సి. పార్థ సారధి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, టిఎస్‌క్యాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్ రావు, ఎస్ఎల్‌బిసి కన్వీనర్ మణి కందన్ పాల్గొన్నారు.

సరిపడా నగదు సరఫరాకై ఢిల్లీకి మంత్రులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రైతు పెట్టుబడి పథకాన్ని మే నెలలో వానకాలం సీజన్ నుంచే అమలు చేయాలనుకుంటున్నందువల్ల సుమారు రూ. 5685 కోట్లు అవసరమౌతాయని ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. ఒకే నెలలో ఇంత మొత్తం నగదు బ్యాంకుల వద్ద సర్దుబాటు అయ్యే అవకాశం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు ఆర్థిక శాఖ మంత్రి నేతృత్వంలో వ్యవసాయ మంత్రి పోచారం, ఉన్నతాధికారులు ఈ నెల 17, 18 తేదీల్లో రిజర్వుబ్యాంకు గవర్నర్‌ను కలిసి స్వయంగా ఈ పథకం గురించి వివరించి తగినంత నగదును రాష్ట్రానికి సరఫరా చేయాలని కోరనున్నారు. వీలైతే కేంద్ర ఆర్థిక మంత్రికి కూడా వివరించే అవకాశం ఉంది.

సాగుకు యోగ్యం కాని భూమికి పెట్టుబడి పై చర్చ

ఈ సమావేశంలో ప్రధానంగా సాగుకు యోగ్యం కాని భూములను పథకం పరిధి నుంచి తొలగించాలన్న అభిప్రాయం ఈ సమావేశంలో చర్చకు వచ్చింది. ఆర్థిక భారం తగ్గించుకోవడంతో పాటు పథకం లక్ష్యం నెరవేరుతుందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రెవిన్యూ రికార్డు ప్రక్షాళన తరువాత కేటగిరి ఎ కింద రాష్ట్రంలో 71 లక్షల 75,000 మంది రైతు ఖాతాలు, 1.42 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు లెక్క తేలింది. ఇందులో చాలా వరకు పట్టా భూములు గుట్టలు, బండ రాళ్లతో సాగుకు పనికి రాకుండా ఉన్నాయని వీటిని గుర్తించాలని నిర్ణయించారు. మిగతా భూమిలో ఖచ్చితంగా ఏదో ఒక పంట వేసేలా చూడాలని పేర్కొన్నారు.

చెక్కులపై తండ్రి లేదా భర్త పేరు

ప్రభుత్వం పంపిణీ చేయనున్న చెక్కులపై రైతు పేరుతో పాటు తండ్రి లేదా, భర్త పేరును కూడా ప్రచురించనున్నారు. గ్రామాలలో ఒకే ఇంటి పేరుతో పాటు ఒకే పేరు కలిగిన వ్యక్తులు ఉండే అవకాశం ఉంటుందని, ఎటువంటి గందరగోళం లేకుండా ఉండేందుకు చెక్కుల వెనక భాగంలో ఆధార్ కార్డు నెంబర్‌ను కూడా వేయాలని మంత్రివర్గ ఉపసంఘం సూచించింది. దండోరా వేయించి గ్రామ సభలు నిర్వహించి, వ్యవసాయ, రెవిన్యూ శాఖ అధికారుల సహకారంతో ప్రజాప్రతినిధులందరూ పాలుపంచుకుని పండుగ వాతావరణంలో చెక్కుల పంపిణీ చేయాలని మంత్రులు చర్చించుకున్నారు.

అవసరం లేని వారు స్వచ్ఛందంగా వదులుకోవాలి

పెట్టుబడి పథకం ద్వారా అందించనున్న ఆర్థిక సహాయాన్ని అవసరం లేని వారు స్వచ్ఛందంగా వదులుకునేలా ప్రచారం చేయాలని క్యాబినేట్ సబ్ కమిటీ సూచించింది. ఎల్‌పిజి గ్యాస్ సబ్సిడీని వదులుకునేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోడి చేపట్టిన గివ్ ఇట్ అప్ పనిచేసిందని, రాష్ట్రంలోనూ పెట్టుబడి పథకానికి అన్వయించుకోవాలని మంత్రులు పేర్కొన్నారు. తద్వారా నగర, పట్టణ ప్రాంతాలలో పదులు, వందల ఎకరాలకు కలిగిన వారు ముందుకొచ్చి పెట్టుబడి సొమ్మును వదులుకుంటారని భావిస్తున్నారు. అలాగే సాగు భూములు కలిగిన ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు ఇతర ఉన్నతాధికారులు స్వచ్ఛందంగానే ఎకరాకు రూ. 4 వేలు వద్దని ముందుకు వస్తారని చర్చలో అభిప్రాయ పడ్డారు.

మధ్యంతర భృతి ?

(మొదటిపేజీ తరువాయి)

పాటు పదవీ విరమణ చేసిన సుమారు రెండు లక్షల మందికి కూడా ఇది వర్తిస్తుంది. ఈ నెలాఖరుకల్లా 11వ పిఆర్సిని ఏర్పాటు చేసే ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఉద్యోగుల వేతనాలు, ఆర్థిక అంశాలపై అవగాహన ఉన్న పదవీ విరమణ చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారిని పిఆర్సి ఛైర్మన్‌గా ప్రకటించే అవకాశం ఉంది. గత మూడు దశాబ్దాలుగా ప్రతి ఐదేళ్ళకోసారి రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సిని ఏర్పాటుచేస్తూ ఉంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు వి.కె. అగర్వాల్ నేతృత్వంలో పదవ పిఆర్సి 2013లో ఏర్పాటైంది. ఈ ఏడాది జూలై 1వ తేదీ కల్లా దాని గడువు పూర్తికానుంది. అప్పటికి కొత్త పిఆర్సి ఉనికిలోకి రావాల్సి ఉన్నందున నిర్దిష్టమైన సిఫారసులను కూడా తయారుచేయడానికి వీలుగా ఈ నెలాఖరుకే దీనిపై ప్రకటన చేయాలని సిఎం భావిస్తున్నట్లు తెలిసింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు వారి సంఘాల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి లోతుగా అధ్యయనం చేసి తగిన సిఫారసులతో కూడిన నివేదికను రూపొందించడానికి పట్టే ఆరు నెలల సమయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వీలైనంత తొందరలోనే పిఆర్సి ఏర్పాటుపై ప్రకటన చేసే అవకాశం ఉంది. సిఫారసులతో సంబంధం లేకుండా వెంటనే 30% ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని సిఎం భావిస్తున్నట్లు తెలిసింది. మూల వేతనంలో పెరిగే ఈ ఫిట్‌మెంట్, దానికి అదనంగా వచ్చే కరువు భత్యం తదితరాలన్నీ కలిపితే ప్రభుత్వంపై పడే ఆర్థికభారం గణనీయంగానే ఉండే అవకాశం ఉంది.

ఉద్యోగుల వివరాల క్రోడీకరణ : ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన వివరాలు ప్రభుత్వం దగ్గర సిద్ధంగానే ఉన్నా కొన్ని కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు తదితర సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్, కంటింజెంట్, వర్క్‌ఛార్జ్‌డ్, ఫుల్‌టైం, పార్ట్ టైమ్, అంగన్ వాడీ... ఇలా అనేక పేర్లతో కొనసాగుతున్నవారి వివరాలన్నింటినీ సమర్పించాల్సిందిగా ఆర్థిక శాఖ కోరింది. వీరికి వేతనాలు, ప్రత్యేక అలవెన్సుల రూపంలో ఏ మేరకు చెల్లించబడుతుందో ప్రభుత్వం దగ్గర వివరాలు లేవు. ఒక విశ్వవిద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్న గ్రాంట్లలోంచి ఇలాంటి ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నందువల్ల ప్రభుత్వం దగ్గర వీటికి సంబంధించిన వివరాలు ఉండడంలేదు. కొన్ని కార్పొరేషన్లు కూడా వాటి అవసరాలకు అనుగుణంగా కొద్దిమంది ఉద్యోగులను వివిధ రూపాల్లో చేర్చుకుంటూ ఉన్నందువల్ల వారికి చెల్లిస్తున్న వేతనాల వివరాలు కూడా ప్రభుత్వం దగ్గర లేవు. ఇలాంటివాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వేతనాలు, అలవెన్సులు తదితరాలకు ఎంత మొత్తంలో చెల్లింపు జరుగుతుందో పూర్తి వివరాలను సమర్పించాల్సిందిగా ఆర్థిక శాఖ కోరింది. రానున్న బడ్జెట్‌లో ఆయా సంస్థలకు ఏ మేరకు వార్షిక గ్రాంట్లను ఇవ్వాల్సి ఉంటుందో, వాటి వినియోగం ఏ అవసరాలకు వెచ్చిస్తున్నారో తెలుసుకోడానికి ఇది దోహదపడుతుంది. ఈ వివరాలన్నింటినీ కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయడంతో పాటు ఇకపైన ఆ సంస్థలు ఎవరిని నియమించుకున్నా వెంటనే సమాచారాన్ని ఇవ్వడం ద్వారా కంప్యూటర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయడం, పదవీ విరమణ చేసిన తర్వాత వారి వివరాలను పింఛను జాబితాలోకి చేర్చడం.. ఇలాంటి అవసరాలకు ఉపయోగపడుతుందని ఆర్థికశాఖ అధికారులు భావిస్తున్నారు. కొన్ని సంస్థలు ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలను నిర్వహిస్తూ ఉన్నందువల్ల వాటి వివరాలను కూడా సమర్పించాలని కోరారు.

100% ఎఫ్‌డిఐలు

(మొదటిపేజీ తరువాయి)

సవరించింది. అదే విధంగా వైద్యపరికరాలను విక్రయించే సంస్థలు, ఆడిట్ సంస్థల విషయంలోను ఉన్న నిబంధనలను సరళతరం చేసింది. సింగిల్ బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్‌లోను, నిర్మాణరంగంలోను 100 శాతం ఎఫ్‌డిఐ అనుమతి నిచ్చింది.అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఎయిరిండియాను గాడిలో పెట్టేందుకు 49 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం కల్పించింది. దేశంలో సులభతర వ్యాపారానికి అవకాశం కల్పించేందుకే ఈ చర్యలు తీసుకున్నామని, తద్వారా పెట్టుబడులు, ఆదాయం, ఉద్యోగావకాశాలు పెరిగే అవకాశం ఉందని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వం తెలియజేసింది. 2017 మార్చి వరకు ఎయిరిండియాకు మొత్తం రూ. 48,877 కోట్లు రుణాలున్నాయి. అందులో రూ. 17,360 కోట్లు ఎయిర్ క్రాఫ్ట్ రుణాలు కాగా రూ. 31,517 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ రుణాలు. 201617 ఆర్థిక సంవత్సరానికి 3,643 కోట్లు నష్టాలను చవిచూసిన ఎయిరిండియా 2017–18 ఆర్థిక సంవత్సరంలో 3,579 కోట్లు నష్టం కలిగే దిశగా అడుగులు వేస్తోందని బడ్జెట్ అంచనాలు తెలియజేస్తున్నాయి. విద్యుత్ ఒప్పందాల విషయంలో కూడా కీలక నిబంధనలను కేబినెట్ సవరించింది. ఇప్పటి వరకు సెకండరీ మార్కెట్‌కు మాత్రమే పరిమితమైన విదేశీ సంస్థాగత పెట్టుడిదారులను (ఎఫ్ఐఐ), విదేశీ పోర్ట్ ఫోలియో పెట్టుబడిదారులను (ఎఫ్‌పిఐ) ప్రాథమిక మార్కెట్‌లోకి కూడా అనుమతినిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాల విషయంలో కేంద్ర వాణిజ్య మంత్రి సురేష్ ప్రభు స్పందించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు స్వీకరించడంలో ఉన్న అడ్డంకులను తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో2016 జూన్ నెలలో ఎన్‌డిఏ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎయిరిండియాలో 49 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం కల్పిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని సిపిఐ(ఎం) తప్పుబట్టింది. భారత విమాన సంస్థను విదేశీ విమాన యాన సంస్థల చేతుల్లో పెట్టడాన్ని తీవ్రంగా నిరసించింది. ఈ మేరకు ఆ పార్టీ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సింగిల్ బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్‌లో ఆటో మే టిక్ రూట్ ద్వారా 100 శాతం విదేశీప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం కల్పించడాన్ని అఖిల భారత వర్తక సమాఖ్య (కన్ఫెడరేషన్ ఆఫ్‌ఆలిండియా ట్రేడర్స్) తీవ్రంగా ఖండించింది. మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల చిన్న వర్తకులకు హాని కలుగుతుందని సమాఖ్య ఆందోళన వ్యక్తం చేసింది.

ఇస్రో చైర్మన్‌గా శివన్

(మొదటిపేజీ తరువాయి)

ఆ పదవిలో మూడేళ్ల పాటు ఉండనున్నారని సిబ్బంది మంత్రిత్వ శాఖ జారీ చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం విక్రం సారాభాయ్ రోదసి కేంద్రం డైరెక్టరుగా శివన్ పని చేస్తున్నారు. ఆయన ఇస్రో చైర్మన్ కిరణ్ కుమార్ స్థానంలో 2015 జనవరి 12న ఆ పదవిని చేపట్టారు. మద్రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి 1980లో ఆయన ఏరోనాటికల్ ఇంజినీర్‌గా గ్రాడ్యుయేట్ అయ్యారు. ఆ తర్వాత 1982లో బెంగళూరులోని ఐఐఎస్‌సి నుంచి ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో మాస్టర్ ఆఫ్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 2016లో బాంబేలోని ఐఐటి నుంచి ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో పిహెచ్‌డిని పూర్తి చేశారు. శివన్ 1982లో ఇస్రోలో చేరి పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్(పిఎస్‌ఎల్‌వి) ప్రాజెక్టుకు పనిచేశారు. మిషన్ ప్లానింగ్, డిజైనింగ్, ఇంటిగ్రేషన్, అనాలిసిస్‌ల్లో ఆయన అసామాన్య సేవలందించారు. ఇస్రోలో ఆయన అనేక రకాల బాధ్యతలు నిర్వహించారు. వివిధ పత్రికల్లో ఆయన అనేక రచనలు ప్రచురితమయ్యాయి.

హెల్త్‌కార్డులు ఇవ్వాలి

మన తెలంగాణ/హైదరాబాద్: మార్కెటింగ్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని మార్కెటింగ్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం నేత రాపోల్ జనార్ధన్ డిమాండ్ చేశారు. సచివాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్‌కార్డులుఇచ్చారని, మంత్రి హరీశ్‌రావు జోక్యం చేసుకొని మార్కెటింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు.

కాళేశ్వరం భేష్

(మొదటిపేజీ తరువాయి)

వచ్చే జూన్‌లో ప్రాజెక్టు తొలి ఫలితాన్ని పొందుతారని అభిప్రాయపడ్డారు. రెండు రోజుల పాటు కాళేశ్వరం పనులు పరిశీలించిన కేంద్ర జలసంఘం బృందం సభ్యులు బుధవారం నాడు జలసౌధలో మీడియాతో మాట్లాడారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణ రంగంలో జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాల రీత్యా కూడా కాళేశ్వరం అన్ని విధాలుగా ప్రత్యేకమైందని జలసంఘం బృందం అభిప్రాయపడింది. ఇది సమీకృత, బహుళార్ధసాధక ప్రాజెక్టు అని జలసంఘం ప్రాజెక్టుల అప్రైజల్ విభాగం చీఫ్ ఇంజనీర్ సికెఎల్ దాస్ అన్నారు. మిడ్ మానేరు, ఎస్ఆర్ఎస్‌పి సహా పలు ప్రాజెక్టులకు కాళేశ్వరం ఆధారం కాబోతుందని చెప్పారు. ఇలా ఒక భారీ ప్రాజెక్టు మరికొన్ని సాగు నీటి ప్రాజెక్టులతో అనుసంధానం చేస్తున్న ప్రక్రియ తెలంగాణలోనే కనిపిస్తుందని అభిప్రాయం వ్యక్తపరిచారు. ప్రాజెక్టులోని వివిధ విభాగాల నిర్మాణం, ప్రణాళిక, పనుల వేగం, పనులు జరుగుతున్న తీరు తమను ఆకట్టుకున్నాయన్నారు. రేయింబవళ్లు మూడు షిఫ్టులలో భారీగా జరుగుతున్న పనుల వేగాన్ని బట్టి వచ్చే వానాకాలం నాటికల్లా కాళేశ్వరం ప్రాజెక్టు మొదటి మైలురాయి దాటుతుందని జలసంఘం బృంధ సారధి దాస్ అభిప్రాయపడ్డారు. ఈ తరహా వేగవంతమైన పనులు ఎక్కడా చూడలేదన్నారు. కాళేశ్వరం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, 18 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు మరో 18 లక్షల ఎకరాలకు కొత్తగా సాగు నీటిని అందించే బృహత్తర ప్రాజెక్టు అని ఆయన ప్రశంసించారు. జూన్‌లో ప్రాజెక్టు ద్వారా తొలి ఫలితాన్ని అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, అనుకున్న దాని ప్రకారం లక్ష్యాన్ని చేరడమే పెద్ద సవాల్ అన్నారు. ప్రాజెక్టు వ్యయం పెరగకుండా పనులు పూర్తికావాలని ఆకాంక్షించారు. ఇందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషిచేయాలని సూచించారు. పనులలో వేగం మరింత పెంచాలన్నారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఒక సవాల్‌గా తీసుకుందన్నారు. జాతీయ అభివృద్ధిలో కాళేశ్వరం భాగస్వామి అవుతుందన్నారు. మేడిగడ్డ వద్ద నీటి లభ్యతకు ఎలాంటి సమస్య లేదని కేంద్ర జలసంఘం హైడ్రాలజీ డైరెక్టర్ నిత్యానంద రాయ్ స్పష్టం చేశారు. నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తపరిచారు. దేశంలోనే గొప్ప ప్రాజెక్టుగా కాళేశ్వరం అవుతుందన్నారు. కోట్లాది మంది రైతుల ప్రయోజనాలతో పాటు బహుళ ప్రయోజనాలు ఇమిడి ఉన్న ఈ ప్రాజెక్టు ఒక అద్భుతమని, ఇదో మెగా ప్రాజెక్టు అని కొనియాడారు. నిర్ణీత గడువులోగా కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి తెలిపారు. ఈ పనులపై సిఎం కెసిఆర్, మంత్రి హరీశ్‌రావు నిరంతర సమీక్షలు, పర్యవేక్షణ, హైదరాబాద్ నుంచే లైవ్ కెమెరాలతో సమీక్షిస్తున్నట్లు వివరించారు. జలసౌధలో మంత్రి హరీశ్‌రావు చాంబర్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్‌లో మేడిగడ్డ బ్యారేజి, కన్నెపల్లి పంపుహౌజ్‌ల పనులను లైవ్‌లో జలసంఘం బృందానికి చూపారు. ఈ సమావేశంలో జలసంఘం డైరెక్టర్లు ముఖర్జీ, రాజీవ్‌కుమార్, కాళేశ్వరం చీఫ్ ఇంజనీర్లు హరిరాం, ఎన్.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

హస్తినాపురంలో చెడ్డీ గ్యాంగ్ హల్ చల్!



మన తెలంగాణ/ఎల్బీనగర్ : బాలాపూర్ మండలంలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం తెల్ల వారు జామున చడ్డీ గ్యాంగ్ హల్ చల్ సృష్టించింది. దీంతో పరిసరాల కాలనీల వాసులు ఉలిక్కిపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్ కాలనీలోని బ్లూమింగ్ డాల్ అపార్టుమెంటుకు తెల్లవారు జామున ఎపి 09 సిపి 4061 నెంబర్ గల కారులో 8 మంది సభ్యులు గల చెడ్డీ గ్యాంగ్ చేరుకుంది. అక్కడికి రాగానే అపార్టుమెంటు వాచ్‌మెన్‌ను బంధించారు. అపార్టుమెంటులోకి ప్రవేశించిన గ్యాంగ్ సభ్యులు 8 ఫ్లాట్లకు బయట నుంచి గడియ వేశారు. అదే అపార్టుమెంటులో నివాసముంటున్న చంద్రమోహన్‌రెడ్డి అనే వ్యక్తి ఫ్లాట్‌లోకి గ్యాంగ్ సభ్యులు ప్రవేశించారు. చంద్రమోహన్‌రెడ్డి ఫ్లాట్‌లో ఎవరూ లేరు. వారి పిల్లలు అమెరికాలో ఉంటున్నారు. చంద్రమోహన్‌రెడ్డి ఊరెళ్లారు. ఫ్లాట్‌లోకి ప్రవేశించిన చెడ్డీగ్యాంగ్ సభ్యులు ఫ్లాట్‌లో 11 తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ఫ్లాట్‌లో నివాసముంటున్న వారు లేచి అరవగా అలజడికి వారు పారిపోయారు. సంఘటనా స్థలాన్ని ఎల్బీనగర్ డిసిపి వెంకటేశ్వర్, ఇతర పోలీసు అధికారులు సందర్శించారు. మీర్‌పేట్ పోలీసులు కేసును నమోదు చేసుకుని అన్ని కోణాల నుంచి దర్యాప్తు చేస్తున్నారు.



74.71లక్షల పాతనోట్లు స్వాధీనం


మల్కాజ్‌గిరి డిసిపి ఉమా మహేశ్వర్ శర్మ

మన తెలంగాణ/ ఉప్పల్ : రద్దుపరిచిననోట్లు మార్పిడి చేస్తున్న మూఠాను రాచకొండ ఎస్‌ఓటి పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన ఉప్పల్ పరిధిలో జరిగింది. పాతనోట్లను తీసుకుని కొత్త నోట్లు చలామణి చేస్తామన్న ముగ్గురు వ్యక్తుల ముఠా నుండి ఎస్‌ఓటి పోలీసులు 74.71లక్షలు పాతనోట్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్కాజ్‌గిరి డీసీపి ఉమా మహేశ్వర్ శర్మ మాట్లాడుతూ హైద్రాబాద్‌లోని హుస్సేన్ ఆలామ్‌కు చెందిన మహ్మద్ హఫీజ్ (34)లు, తలాభ్ కట్టకు చెందిన ఎండి అధిల్ (44)లు, ముర్గీచౌక్‌కు చెందిన మంజూర్ అహ్మద్ (15)లు రాజస్థాన్‌కు చెందిన మహ్మద్ హాఫీజ్ 20 శాతం మార్జిన్ మనీ మాట్లాడుకొని కొత్త నోట్లు ఇస్తామని చెప్పి హుస్సేన్ అలామ్‌కు హైద్రాబాద్‌లో వ్యాపారం చేస్తున్న వ్యక్తిని నమ్మించినట్టు చెప్పారు. అందుకు అంగీకరించిన వ్యక్తి ఉప్పల్ ప్రశాంత్ నగర్‌లో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న మరోవ్యక్తి వద్దకు రావాలని చెప్పడంతో వారు రెండుమోటారు సైకిళ్ళపై తీసుకువచ్చి కొత్త కరెన్సీ ఇచ్చే వ్యక్తుల కోసం ఎదురు చూస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఓటి పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుండి పాతనోట్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌ఓటి డీసీపీ నవీన్‌కుమార్, ఉప్పల్ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సత్యనారాయణలు పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్ పోర్టులో హై అలర్ట్


మన తెలంగాణ/ శంషాబాద్ : శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ(బిసిఎఎస్),నిఘావర్గాల ఆదేశాల మేరకు బుధవారం హైఅలర్ట్‌ను ప్రకటించారు. దీంతో ఎయిర్‌పోర్టులో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ నెల 31వ తేదీ వరకూ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. దేశీయ ప్రయాణికులు 2గంటలు, అంతర్జాతీయ ప్రయాణికులు 3గంటల ముందు విమానాశ్రయానికి చేరుకొని తనిఖీలు, ఇతర భద్రతాపరమైన అంశాల్లో సహకరించాలని సూచించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇంటెలిజెన్సీ బ్యూరో(ఐబి) హెచ్చరికల నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రయంతో పాటు పరిస రాల్లో నిఘా,భద్రతను కట్టుదిట్టం చేశారు. విమానాశ్రయం, రైల్వేస్టేషన్, హైవే,ఔటర్ రింగ్ రోడ్డు, ఇతర రద్దీ ప్రదేశాల్లో నిఘాను పెంచారు.

మద్యం మత్తులో భార్యను చంపిన భర్త



మన తెలంగాణ/ వాజేడు : మద్యం మత్తులో భార్యను కత్తితో పొడిచి, హత్య చేసిన సంఘట బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా, వాజేడు మండలంలోని క్రిష్టాపురం గ్రామంలో చోటు చేసుకుంది. పేరూరు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపిన కథనం ప్రకారం క్రిష్ణాపురం గ్రామానికి చెందిన దూమారి లక్ష్మయ్య, బానమ్మ(35)లు మద్యం మత్తులో ఉండగా ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో కోపోద్రిక్తుడైన లక్ష్మయ్య భార్య బానమ్మను కత్తితో విచక్షణరహితంగా పొడిచాడు. దీంతో తీవ్ర గాయాల పాలైన బానమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఇది గమనించిన గ్రామస్థులు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని సిఐ రవీందర్, ఎస్‌ఐ శివ ప్రసాద్‌లు కేసు నమోదు చేసుకుని నిందితుడు లక్ష్మయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. తల్లి మృతి, తండ్రి జైలు పాలుకావడంతో కుమారుడు సిద్ధయ్య అనాథయ్యాడు.

మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య



మన తెలంగాణ/ ఖానాపురం : వరంగల్ జిల్లా, ఖానాపురం మండలం మంగళవారిపేట శివారు కొద్దిమాడి తండాకు బోడ జవహర్ తల్లి సునీత దంపతుల కూతరు సుజాత(15)బుదరావుపేట ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. రోజు వారి మాదిరిగా మంగళవారం పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన సుజాతను తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన బాలిక సాయంత్రం ఆరుగంటల సమయంలో నోట్‌బుక్ కొనుక్కుంటున్నానని బయటకు వెళ్లిన సుజాత ఎంతకూ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులతో పాటు బంధువులు రాత్రంతా వెతికినా వారికి ఆచూకీ దొరకలేదు. ఉదయం ఆచూకీ కోసం వెతుకుతుండగా వారి వ్యవసాయ బావి వద్ద సైకిల్‌తో పాటు చెప్పులు ఉండడం వలన తండ్రికి అనుమానం వచ్చి బావిలోకి చూడగా సుజాత శవమై ఉన్నట్లు తెలిపాడు. తండ్రి ఫిర్యాదు మేరకు సిఐ బోనాల కిషన్, ఎస్‌ఐ అభినవ్‌లు కేసునమోదు చేసుకున్నారు.

రేగొండలో యువతి..

మన తెలంగాణ/ రేగొండ (జయశంకర్ జిల్లా) : కుటుంబ కలహాలతో పురుగుల మందుతాగి యువతి ఆత్మహత్యచేసుకున్న సంఘటన రేగొండ మండల శివారు గడిపల్లిలోబుధవారం చోటు చేసుకుంది. గడిపల్లికి చెందిన చామంతి(20) అనే యువతి తన తల్లి వసంత గత కొన్ని సంవత్సరాల క్రితం చనిపోగా అప్పటి నుంచి అమ్మమ్మ వాకటి మల్లమ్మ ఇంటివద్దనే ఉంటూ చదువుకుంటోంది. ఈ క్రమంలో తన తండ్రి రవీందర్ గత కొన్ని నెలలగా అమ్మమ్మ వద్ద నుంచి డబ్బు తీసుకు రావాలంటూ చామంతిని వేధిస్తున్నాడు. దీంతో మనస్థాపానికి గురైన యువతి బుధవారం వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు మల్లమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని పోలిసులు దర్యాప్తు చేస్తున్నారు.

జంతువుల వ్యర్థాలతో నూనె తయారు

మన తెలంగాణ/ హైదరాబాద్/ చార్మినార్ : జంతువుల వ్యర్థాలతో నూనె తయారు చేసి ఫాస్టు ఫుడ్ సెంటర్లు, చిన్న పాటి హోటల్స్‌లకు సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని రెయిన్‌బజార్ పోలీసులు అదుపులోనికి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. బుధవారం రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేసంలో ఏసీపీ ఆనంద్, ఇన్స్పెక్టర్ జావేద్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. రెయిన్‌బజార్ బగే జహారాకు చెందిన మహ్మద్ గౌస్(45) చంచల్‌గుడాలోని గొడ్డు మాంసం దుకాణంలో పనిచేసేవాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో ఈ కర్కషత్వానికి ఒడిగట్టాడని తెలిపారు.

మేడారానికి 4,200 ప్రత్యేక బస్సులు

- హైదరాబాద్, వరంగల్ నుంచి ఎసి సర్వీస్‌లు
- ఆర్‌టిసి చైర్మన్ సోమారపు సత్యనారాయణ



మన తెలంగాణ/ వరంగల్‌బ్యూరో : మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులను చేరవేసేందుకు తెలంగాణ వ్యాప్తంగా 4200 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌టిసి చైర్మన్ సోమావరపు సత్యనారాయణ తెలిపారు. బుధవారం వరంగల్‌లో మేడారం ఏర్పాట్లపై ఆర్‌టిసి రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 3వరకు జరిగే జాతరకు ఆర్‌టిసి నుంచి విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జాతరకు వచ్చే భక్తులను సురక్షితంగా వారివారి గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్‌టిసి లక్ష్యమన్నారు. ఇందు కోసం 4,200 బస్సులను నడుపుతున్నామని, ఇందులోవరంగల్ రీజియన్ నుంచి 2,150 బస్సులు, కరీంనగర్ రీజియన్ నుంచి 520 బస్సులు, ఖమ్మం రీజియన్ నుంచి 380 బస్సులు, సికింద్రాబాద్ రీజియన్ నుంచి 250 బస్సులు, ఆదిలాబాద్ నుంచి 300, రంగారెడ్డి నుంచి 100, మెదక్ నుంచి 50 బస్సులతోపాటు మరో రెండు వందల బస్సులను వరంగల్, హైదరాబాద్ నుంచి ఏసి బస్సులతోపాటు ఇతర బస్సులను నడుపనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రమాదాలను నివారించేందు కోసం 20 మొబైల్ టీంలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రైవేటు వాహనాలలో వచ్చే భక్తులను నార్లాపూర్ పార్కింగ్ నుంచి మేడారం వరకు ఆర్‌టిసి ద్వారా భక్తులను ఉచితంగా చేస్తామన్నారు. జాతర మొత్తం ఆర్‌టిసి డ్రైవర్, కండక్టర్, మెకానిక్ మొదలుకొని ఆర్‌ఎం స్థాయి వరకు మొత్తం 12వేల మంది సిబ్బంది, అధికారులు జాతర కోసం విధులు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈసారి జాతరకు ప్రత్యేకంగా వజ్ర బస్సులను నడుపుతున్నామని, వీటితోపాటు వరంగల్, హైదరాబాద్ నుంచి ఎసి బస్సులను కూడా నడపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సత్యనారాయణ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌టిసి విసి అండ్ ఎండి జెడి రమణారావు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి వెంకట్రావు, ఇడి గరిమిళ్ల సత్యనారాయణ, ఆపరేషన్ వింగ్ వేణు, వరంగల్ రీజియన్ ఆర్‌ఎం సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతర కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌ను సత్యనారాయణ విడుదల చేశారు.

ఆర్మీ నియామక ర్యాలీలో తొక్కిసలాట

డెహ్రీ అన్ సొన్ (బీహార్) : బీహార్‌లోని రోహ్‌తస్ జిల్లాలోని డెహ్రీ అన్ సొన్‌లో జరిగిన ఆర్మీ నియామక ర్యాలీలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతువాతపడగా, నలుగురికి గాయాలయ్యాయి. బిఎంపి గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ నియామక ప్రక్రియలో ఐదవరోజు బుధవారం ఉదయం 3గంటలకు అభ్యర్థుల పరుగులో తొక్కిసలాట జరిగిందని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ఎంఎస్ ధిల్లాన్ తెలిపారు. చనిపోయిన వ్యక్తిని గాయా జిల్లాకు చెందిన ముఖేశ్ కుమార్‌గా గుర్తించామని చెప్పారు. అంతకుముందు కుమార్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతిచెందాడని ఆసుప్రతి వర్గాలు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఘటన జరగడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. గాయపడిన విమ్లేశ్ కుమార్, దేవ్‌బ్రాట్ కుమార్, శ్యామ్‌నందన్ కుమార్ వర్మ, ధర్మేంద్ర కుమార్‌లు ససరమ్‌లోని సదరమ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

రిట్ పిటిషన్‌ను పిల్‌గా దాఖలు చేయండి

మన తెలంగాణ/ హైదరాబాద్ : పశ్చిమగోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని పలు డీఈడీ కాలేజీల్లో 163 మంది విద్యార్థులు ఉంటే వెయ్యి మంది ఉన్నట్లుగా కాలేజీ యాజమాన్యాలు రికార్డుల్లో చూపించాయన్న ఆరోపణల 'రిట్ పిటిషన్‌ను ప్రజాప్రయోజన వ్యాజ్యం'గా చేయాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. ఆ జిల్లాల్లోని మహాత్మాగాంధీ, సలామ్ అమరావతి, ఎస్ఆర్, జీఎస్ఆర్, ఎస్ఆర్‌డీ, షారోన్ కాలేజీల్లోని విద్యార్థులు లేకపోయినా ఉన్నట్లుగా రికార్డుల్లో చూపించారని ఎన్. మాధవరావు అనే వ్యక్తి రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ మేరకు కాలేజీలో ప్రభుత్వం నుంచి ఆమోదం పొందే ప్రయత్నాలు చేస్తున్నాయని, ఈ చర్యల్ని అడ్డుకోవాలని పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు. రిట్‌ను హైకోర్టు న్యాయమూర్తి ఎస్వీ భట్ విచారించారు. ఆయా కాలేజీలు ఆమోదానికి ప్రభుత్వానికి నివేదికలు రాలేదని ప్రభుత్వ న్యాయవాది చెప్పగా, ఇందులో ప్రజాప్రయోజనాలు ఉన్నాయని పిటిషనర్ లాయర్ అన్నారు. దాంతో రిట్‌ను పిల్ గా చేయాలని హైకోర్టు ఆదేశించింది.

నందనవనంలో 'కార్డన్ సెర్చ్'





- 25 మంది పాతనేరస్తుల అరెస్ట్
- 25 టూ వీలర్స్, 2ఆటోలు, 20 ఫోర్ వీలర్స్, 50 లిక్కర్ బాటిల్స్ స్వాధీనం

మన తెలంగాణ/ ఎల్బీనగర్ : నేరాల నివారణకు రాచకొండ పోలీసులు ఎల్బీనగర్ నియోజకవర్గంలోని హస్తినాపురం డివిజన్ నందనవనం కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎల్బీనగర్ డిసిపి వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో 250 మంది పోలీసులు, ఎసిపిలు, సిఐలు కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్నారు. బుధవారం తెల్లవారుఝామున నందనవనంలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో ముగ్గురు రౌడీషీటర్లు గోపిచంద్, బంగారు శ్రీను, బొమ్మలే సురేష్‌ను అదుపులోకి తీసుకోగా, సరైన పత్రాలు లేని 25 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలు, మరో ఫోర్ వీలర్స్, 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానంతో సంచరిస్తున్న మరో 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలో నేరాలను తగ్గించేందుకు కృషి చేస్తున్నామని, అందులో భాగంగానే నందనవనంలో కార్డన్ సెర్చ్ నిర్వహించామని తెలిపారు.కార్డన్ సెర్చ్‌లో ఎల్బీనగర్ డిసిపి వెంకటేశ్వర్‌రావు, ఏసిపి రవీందర్‌రెడ్డి, మీర్‌పేట్, సరూర్‌నగర్, బాలాపూర్ ఇన్స్పెక్టర్లు ఎ.మదన్‌మోహన్, ఎన్.సి.హెచ్.రంగస్వామి, మోహన్‌రెడ్డి, పలు పోలీస్ స్టేషన్ల సబ్ ఇన్స్పెక్టర్లు రాజు, రాఘవేందర్ పాల్గొన్నారు.

యాంకర్ ప్రదీప్‌కు రెండు రోజుల గడువు

మనతెలంగాణ/ సిటీబ్యూరో : డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిని టివి యాంకర్ ప్రదీప్ కోర్టుకు హాజరుకాలేదు. తాను షూటింగ్ కార్యక్రమాల్లో ఉన్నందున న్యాయస్థానం హాజరు కాలేకపోతున్నట్టు, మరో రెండు రోజులు సమయం కావాలని నగర పోలీసులను అభ్యర్థించారు. ప్రదీప్ విన్నపాన్ని పరిగణలోకి తీసుకుని ట్రాఫిక్ పోలీసులు మరో రెండు రోజుల గడువును ఇస్తూ అనంతరం కోర్టుకు హాజరుకావాలని ఆదేశించారు. కానీ ప్రదీప్ కారు సీజ్ అయి పోలీసుల ఆధీనంలోనే ఉన్నట్టు తెలిపారు.

కోర్టుకు హాజరైన టివి వాఖ్యాత రవి

మనతెలంగాణ/ సిటీబ్యూరో : టివి యాంకర్ రవి బుధవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. రారండోయ్ వేడుక చూద్దాం సినిమా కార్యక్రమంలో మహిళలను కించపరిచేలా వ్యాఖ్యానాలు చేశారంటూ అతడిపై కేసునమోదైనది. ఈ కేసు విచారణ కోసం రవి న్యాయస్థానానికి వచ్చారు. విచారణ అనంతరం ఫిబ్రవరి 7వ తేదీకి వాయిదాపడినట్టు తెలిసింది. ఈ సందర్భంగా రవిని కలిసి మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా అందుకు స్పందించి అసలు ఆరోజు ఏమి జరిగిందో వివరంగా ఫేస్‌బుక్‌లో పోస్టు చేస్తా మీడియాకు ఇంకా మసాలా ఇవ్వదలచుకోలేదు. కొన్ని పర్సనల్స్ ఉంటాయి అన్ని విషయాలు బటయకు చెప్పలేం. నేను చాలా మారాను. దీనిపై నేను ఏమి మాట్లాడినా మళ్ళీ పెద్దన్యూస్‌గా చేస్తారు. అంటూ రవి అక్కడి నుండి వెళ్ళిపోయాడు.


సిపిఐ(ఎంఎల్) సిపి బాట సభ్యుడు అరెస్ట్




మన తెలంగాణ/ గూడూరు(వరంగల్ జిల్లా) : సిపిఐ(ఎంఎల్) సిపి బాట పార్టీని పటిష్టం చేయడానికి సిపి పార్టీ నష్టానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవడానికి బొమ్మగాని నర్సింహ, తన కొరియర్ గుండాల సంధానితో హైదరాబాద్‌నుంచి గూడూరు మండలంలోని అపరాజుపల్లి క్రాస్‌రోడ్డు వద్ద బస్సు దిగి అడవిలోని దళంలో కలవడానికి వెళుతున్న ఆయనను పోలీస్‌లు అరెస్ట్ చేసి 12 బోర్ తుపాకీలు, 25 రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ ఎస్‌పి నంధ్యాల కోటిరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సింహ, సంధానిల అరెస్ట్‌ను చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొమ్మగాని నర్సింహ, అలియాస్ నర్సిరెడ్డి అలియాస్ విశ్వనాథ్ అలియాస్ ఆనంద్ ఈయన తండ్రి బొమ్మగాని చంద్రయ్య కుమారుడు అంకిరెడ్డి గ్రామం, చౌటుప్పల్ మండలం యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందినవాడని తెలిపారు. 1982లో బిఎస్సి చదువుతూ పిడిఎస్‌యులో చేరి 1987 నుంచి 1994 వరకూ పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశాడన్నారు. జనశక్తి చీలిక నేపథ్యంలో సిపియుఎస్పైలో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా అజ్ఞాతంలో పనిచేశారని ఆయన తెలిపారు. 2005 నుంచి 2008 వరకు ఒరిస్సా పార్టీ ఇన్‌చార్జ్‌గా పనిచేసే సమయంలో టాటాస్టీల్ కంపెనీకి వ్యతిరేకంగా ముండా ఆదివాసిల ఉద్యమంలో పాల్గొని అరెస్ట్ అయ్యారన్నారు. 2014లో జైలు నుంచి విడుదలై సిపిఐ(ఎంఎల్) జనశక్తి కూర రాజన్న పార్టీలోనే రాష్ట్ర కమిటీ సభ్యులుగా పనిచేస్తూ, 2016 బొమ్మగాని నర్సింహ భీం భరత్‌లు సిపి బాటా పేరుతో కొత్త సాయుధ దళాలని ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. సిపిఐ(ఎంఎల్) సిపి బాట దళాలు ములుగు, నర్సంపేట, మంగపేట, ఏటూరునాగాం, మణుగూరు, భద్రాద్రి, కొత్తగూడెం, మహబూబాబాద్ ఏరియాలలో దళాలు పనిచేస్తున్నాయని తెలిపారు. గతనెల ఏరియా ఎన్‌కౌంటర్‌లో 9 మంది మృతిచెందడం మిగతావాళ్లు అరెస్ట్ చేయడం, సరెండర్ కావడం జరిగిందని ఆయన తెలిపారు. సంధాని 15 సంవత్సరాల నుంచి కొరియర్‌గా పనిచేస్తూ సమచారాన్ని రాష్ట్ర కమిటీకి చేరవేయడం, దళాలకు పార్టీ పేర చందాలు వసూలు చేస్తాడని రాష్ట్ర కమిటీ సభ్యుడు నర్సింహతో కలిసి ఉండగా అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ డిఎస్పి నరేష్‌కుమార్, గూడూరు సిఐ రమేష్‌నాయక్, ఎస్సైలు, ఎస్‌కే యాసిన్, రామారావు, పోలీస్‌లు పాల్గొన్నారు.

ప్రేమోన్మాది ఘాతుకం


- ప్రేమను నిరాకరించిందన్న అక్కసుతో కత్తితో పొడిచి పరారైన దుండగుడు
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాలు, రాజకీయ పార్టీల డిమాండ్



మృతురాలు జానకి(ఫైల్)



ఉన్మాది అనంత్



పోలీసులకు వినతి పత్రం అందజేస్తున్న మహిళలు

మనతెలంగాణ/ మూసాపేట/ కూకట్‌పల్లి: ప్రేమను నిరాకరించిందన్న అక్కసుతో యువతిని కత్తితో పొడిచి దుండగుడు పరారైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతురాలి రూంమేట్ రూప తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా గుయ్యన వలస గ్రామానికి చెందిన బోసు జానకి(24) గత కొద్ది నెలల క్రితం బ్రతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కేపీహెచ్‌బికాలనీ 5వఫేజ్‌లోని డిమార్ట్‌లో సేల్స్ గర్ల్‌గా పనిచేస్తుంది. మూసాపేట హబీబీనగర్‌లో అదే జిల్లాకు చెందిన రూప అనే యువతితో కలిసి రూం అద్దెకు తీసుకుని ఉంటున్నారు. కాగా రంగారెడ్డి జిల్లా పేద్దేముల్‌కు చెందిన అనంత్ అలియాస్ అనంతప్ప అనే యువకుడు మూసాపేట ప్రగతినగర్‌లో ఉంటూ గత కొద్ది రోజులుగా ప్రేమ పేరుతో జానకి వెంటపడుతున్నాడు. దీంతో మంగళవారం రాత్రి 8 గంటలకు పని ముగించుకుని రూంకు వచ్చిన రూపకు రక్తపు మడుగులో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న జానకి కనిపించింది. దీంతో కొద్ది సేపు షాక్‌కు గురైన రూప స్థానికుల సహకారంతో హుటాహుటిన మూసాపేట శ్రీహరినగర్‌లోని వసుంధర ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు అక్కడి డాక్టర్లు చెప్పడంతో అక్కడి నుంచి కూకట్‌పల్లిలోని ఓమ్ని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే జానకి మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతురాలి శరీర భాగంలో మూడు చోట్ల కత్తి గాట్లు ఉన్నాయి. కడుపు భాగంలో రెండు చోట్ల, వెన్ను భాగంలో మరోచోట కత్తితో పొడవడంతోపాటు గొంతుని నులిమి హంతకుడు పరారైనట్లు శరీరంపై ఉన్న గాయాలను బట్టి పోలీసులు భావిస్తున్నారు. గత కొంతకాలంగా ప్రేమించమని వెంటపడుతున్న అనంత్ అలియాస్ అనంతప్ప అనే యువకుడే ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉంటాడని మృతురాలి రూం మేట్ రూప ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కఠినంగా శిక్షించాలి

ప్రేమోన్మాది కిరాతకానికి యువతి బలైందన్న సమాచారం తెలుసుకున్న పలువురు మహిళా సంఘాల ప్రతినిధులు కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చి ప్రేమోన్మాది అనంత్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టిఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షులు గువ్వల జ్యోతి, ఉమావతిగౌడ్, అనితా శ్రీపాద్‌తోపాటు బాలాజీనగర్ కార్పొరేటర్ కావ్యాహరీష్‌రెడ్డి, సబియాగౌసుద్దీన్, కాంగ్రెస్‌నాయకురాలు స్వరూప గౌడ్‌లు వేర్వేరుగా కూకట్‌పల్లి సీఐని కలిసి వినతిపత్రాలు అందజేశారు.

డబుల్ బెడ్‌రూంల నిర్మాణాలు వేగవంతం చేయాలి

మనతెలంగాణ/ యాదాద్రిభువనగిరి : ఇంజనీరింగ్ అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చిత్రారామచంద్రన్ కోరారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమా వేశమై యాదాద్రిభువనగిరి జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల ప్రగతిని పంచా యతీ రాజ్ రోడ్లు, భవనాల శాఖ ఇంజనీర్లు కాంట్రాక్టర్లతో ఆమె సమీకించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ పాలనాపరమైన మంజూరీలు ఇచ్చిన ఇండ్ల విషయంలో కార్యాచరణ రూపొం దించుకొని గ్రౌండింగ్ చేపట్టి త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచే యాలని అన్నారు. రోడ్డు భవనాలశాఖ ఇంజనీర్లు ఇది నా పని కాదని ఎంతమాత్రం భావించరాదని, ఇప్పటికే కొన్ని జిల్లాలలో 50 శాతంనుండి 60 శాతం వరకు పనులు జరుగుతు న్నట్లు గుర్తుచేశారు. ఇప్పటినుండి ప్రత్యేక దృష్టి సారించాలని ఇంజనీర్లను ఆదేశించారు. భూమి దొరకనిచో పట్టణ ప్రాంతాలలో జి+1, జి+2 ఇండ్లను నిర్మించాలని ఆమె సూచించారు. కామారెడ్డి, ఎర్రవెల్లి ఇతర జిల్లాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

భారీగా ఆహార భద్రత కార్డుల తొలగింపు

- రెండేళ్లలో 3లక్షల కార్డులు ఏరివేత
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు

మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగర పరిధిలో భారీగా ఆహారభద్రత కార్డుల రద్దు ప్రక్రియ కొనసాగుతోంది. గత రెండేళ్లుగా పౌరసరఫరాలశాఖ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బోగస్ కార్డులను ఏరివేస్తోంది. అయితే కార్డుల ఏరివేతలో భాగంగా బోగస్, అనర్హులతో పాటు అర్హులైన పేదల కార్డులు కూడా రద్దవుతున్నాయి. ఆధార్ అనుసంధానంతో కొన్ని కార్డులు, జీహెచ్ఎంసీ, ఆర్టీఏ తదితర పన్నుల పరిధిలోకి వచ్చిన కుటుంబాలకు చెందిన మరి కొన్ని కార్డులు రద్దయ్యాయి. అలాగే ప్రజా పంపిణీ వ్యవస్థలో ఈ పాస్ విధానం అమలవుతుండటంతో వరుసగా మూడు నెలల పాటు సరుకులు తీసుకొని పేద కుటుంబాలకు చెందిన కార్డులు సైతం ఆన్‌లైన్ ప్రక్రియ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో రద్దయ్యాయి. అధికారిక లెక్కల ప్రకారం మహానగరంలో మూడు లక్షలకుపైగా ఆహార భద్రత కార్డులు రద్దయ్యాయి. టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తెల్లకార్డులు రద్దు చేసి, దరఖాస్తు చేసుకున్న వారందరికి ఆహారభద్రత కార్డులు మంజూరు చేసింది. అయితే పౌరసరఫరాలశాఖలో సిబ్బంది కొరత కారణంగా క్షేత్ర స్థాయిలో ఎలాంటి విచారణ చేపట్టకుండానే కేవలం ఆధార్ కార్డులను పరిగణలోకి తీసుకొని ఆహార భద్రత కార్డులు మంజూరు చేశారు. దీంతో బోగస్, డబుల్, ఇతర రాష్ట్రాల్లోని లబ్ధిదారులకు సైతం కార్డులు మంజూరయ్యాయి. దీంతో తప్పుదిద్దుకునే చర్యలు చేపట్టిన ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఆధార్ నంబర్లను ఎన్ఐసీతో అనుసంధానం చేయడంతో బోగస్, డబుల్, ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర రాష్ట్రాల్లో కార్డులు ఉన్నవారిని గుర్తించి వారికి సంబంధించిన కార్డులను రద్దు చేసింది. అయితే కార్డులు ఏరివేతలో అనర్హులతో పాటు అర్హులైన పేదల కార్డులు భారీ సంఖ్యలో రద్దయ్యాయి. ప్రస్తుతం చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ కార్యాలయం పరిధిలో 12 సర్కిళ్లు ఉన్నాయి. అందులో హైదరాబాద్ పరిధిలో తొమ్మిది, మేడ్చల్ అర్బన్‌లో రెండు, రంగారెడ్డి జిల్లా పరిధిలో ఒక సర్కిల్‌లు ఉన్నాయి. 12 సర్కిళ్ల పరిధిల్లో రెండేళ్ల క్రితం 14. 04 లక్షల ఆహారభద్రత కార్డులు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 10,94,633 చేరింది. కార్డుల ఏరివేత తరువాత హైదరాబాద్‌లోని 9 సర్కిళ్లో 8,22,648 కార్డులకు గాను 5,56,211. రంగారెడ్డి మేడ్చల్ అర్బన్ పరిధిలో 5,82,297కు గాను 5,38,422కు కార్డులు తగ్గాయి. అలాగే మేడ్చల్ అర్బన్ పరిధిలో 5,82,297 కార్డులకు గాను 5,38,422 కు తగ్గాయి. ఇదిలా ఉండగా ఏరివేతలో రద్దయిన అర్హుల కార్డులు పునరుద్ధరణకు కూడా నోచుకోవడం లేదు.

వంటలపై ఆన్‌లైన్‌లో పుస్తకం!



పెళ్లి చేసుకున్న తర్వాత కూడా బాలీవుడ్‌తో పాటు సౌత్‌లో పలువురు అందాల తారలు సినిమాల్లో నటిస్తూనే ఉన్నారు. అయితే కొందరు భామలు ఏదో ఒక వర్క్ చేస్తూ మంచి గుర్తింపు పొందుతున్నారు. బాలీవుడ్‌లో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా పలు హిట్ సినిమాల్లో నటించిన తార శిల్పాశెట్టి. ఆమె తెలుగులో 'సాగర వీరుడు సాగర కన్య' సినిమాలో కూడా నటించింది. అప్పట్లో ఆమె చాలా బిజీగా ఉండేది. కానీ పెళ్లి తర్వాత సినిమా రంగం నుంచి కొంచెం తప్పుకున్నా కూడా టివి రియాలిటీ షోలతో మంచి పాపులారిటీ తెచ్చుకుంది. అలాగే ఈమధ్య వంటకాలపై కూడా అమ్మడు కొత్త ప్రయోగాలు చేస్తోంది. 90 వంటకాల తయారీని ఒక పుస్తకం ద్వారా ప్రజల ముందుకు తీసుకువస్తోంది. 'ద డైరీ ఆఫ్ ఏ డొమెస్టిక్ దివా' అనే పుస్తకాన్ని రచించి ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టింది. ఈ పుస్తకాన్ని స్టార్ హీరో హృతిక్ రోషన్ సోషల్ మీడియాలో ఎంతో ప్రచారం చేస్తున్నాడు. ప్రస్తుతం శిల్ప వంటల పుస్తకం సోషల్ మీడియాలో సందడి చేస్తోంది.

తండ్రి హిట్స్‌పై కన్నేశాడు



నాగచైతన్య

నాగచైతన్య కొత్త కథల కోసం చూడటం మానేసి తన తండ్రి కథల వైపు చూస్తున్నాడు. తండ్రి సినిమాల్లో అది చూడండి... ఇది చూడండి అంటూ దర్శకులకు సలహాలు ఇస్తున్నాడు. కొత్తగా ట్రై చేయడం కంటే ఇదివరకే వచ్చిన కథలను కొత్తగా చూపించడం మంచిదని అనుకుంటున్నాడు ఈ హీరో. ఇప్పటికే గత ఏడాది 'నిన్నే పెళ్లాడతా' రీమేక్ అయిన 'రారండోయ్ వేడుక చూద్దాం'తో కెరీర్‌లోనే పెద్ద హిట్ అందుకున్నాడు చైతూ. ఆ సినిమా ఇచ్చిన విజయం నచ్చిందో ఏమో కానీ ఇప్పుడు మరోసారి తండ్రి సినిమాలనే కావాలంటున్నాడు ఈ యంగ్ హీరో. అప్పట్లో 'హలో బ్రదర్' రీమేక్‌కు ముహూర్తం పెట్టి ఆపేసిన నాగచైతన్య ఇప్పుడు మరోసారి నాగార్జున ఆల్‌టైమ్ హిట్స్‌పై కన్నేశాడు. మారుతితో ఆయన చేయబోయే సినిమాకు 'శైలజా రెడ్డి అల్లుడు' అనే టైటిల్ పెడుతున్నారు. ఇందులో పొగరుబోతు అత్తగా రమ్యకృష్ణ నటించనుంది. ఇక ఈ చిత్రం అప్పట్లో నాగార్జున నటించిన బ్లాక్‌బస్టర్ మూవీ 'అల్లరి అల్లుడు'కు రీమేక్ అని తెలిసింది. కోదండరామి రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఇందులో పొగరుబోతు అత్తగా వాణిశ్రీ నటించడం విశేషం. ఇప్పుడు రమ్యకృష్ణ ఆ పాత్ర చేయనుంది. ప్రస్తుతం దర్శకుడు చందూమొండేటి చిత్రం 'సవ్యసాచి'తో బిజీగా ఉన్న చైతూ త్వరలో మారుతి సినిమాపై దృష్టిపెట్టనున్నాడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

నా మార్క్ ఫిలిం ఒకటి చేస్తా

'చంటిగాడు' చిత్రంతో దర్శకురాలిగా మారి గుండమ్మగారి మనవడు, లవ్‌లీ, వైశాఖం వంటి ఫీల్‌గుడ్ మూవీస్‌ను ప్రేక్షకులకు అందించిన జయ.బి దర్శకురాలిగా చిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ స్పెషల్ ఇమేజ్‌ను తెచ్చుకున్నారు. 'వైశాఖం' చిత్రంతో ప్రేక్షకుల ప్రశంసలతో పాటు సిల్వర్ క్రౌన్ అవార్డు పొందిన ఆమె గురువారం తన పుట్టినరోజును జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటిస్తూ దర్శకురాలు జయ.బి చెప్పిన విశేషాలు...



బి.జయ

జూన్‌లో 'లక్కీఫెలో' ప్రారంభం...

'వైశాఖం' చిత్రం నాకు పూర్తిగా సంతృప్తిని కలిగించింది. ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించి పెద్ద హిట్ చేశారు. నెక్స్ట మా ఆర్.జె. సినిమాస్ బ్యానర్‌లో 'లక్కీఫెలో' అనే చిత్రాన్ని రూపొందించనున్నాం. జూన్‌లో సినిమాను ప్రారంభించి మూడు, నాలుగు నెలల్లో షూటింగ్ పూర్తిచేస్తాం. ప్రస్తుతం స్క్రిప్ట్‌వర్క్ జరుగుతోంది. ఓ యంగ్ హీరో ఈ చిత్రంలో నటిస్తారు. ఆ హీరో ఎవరనేది త్వరలోనే ప్రకటిస్తాం.

అదే హీరో క్యారెక్టరైజేషన్...

కొంతమందికి అనుకోకుండా, విచిత్రంగా ఒక మంచి ఛాన్స్ వస్తుంది. అది రాగానే అందరూ అతన్ని 'లక్కీ ఫెలో' అని అంటారు. అతను ఆ ఛాన్స్ కోసం ప్రయత్నించకపోయినా అతనికి ఆ ఛాన్స్ వస్తుంది. అది చాలా అరుదుగా జరుగుతుంది. అది హీరో క్యారెక్టరైజేషన్. ఆ ఛాన్స్‌ని హీరో సద్వినియోగం చేసుకుంటాడా? ఇంకా హైట్స్‌కు వెళ్తాడా? అనేది కాన్సెప్ట్. హ్యూమన్ సైకాలజీని ఆధారంగా చేసుకొని ఈ సబ్జెక్ట్‌ను సిద్ధం చేస్తున్నాం.

వినోదంతో పాటు సందేశం...

హీరోతో పాటు హీరోయిన్ క్యారెక్టర్ కూడా చాలా బలంగా ఉంటుంది. మన సమాజంలో అమ్మాయిలకు చిన్న చిన్న ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అవి మానసికంగా వారిని అల్లకల్లోలం చేస్తుంటాయి. ఆ పాయింట్‌ను ఇంతవరకు ఎవరూ టచ్ చేయలేదు. టెన్త్, ఇంటర్మీడియట్, డిగ్రీ చదివే అమ్మాయిలు బస్సులో ప్రయాణించేటప్పుడు మగవాళ్లు కొందరు కావాలని, మరికొందరు అనుకోకుండా అమ్మాయిల్ని టచ్ చేస్తారు. ఆ సమయంలో అమ్మాయిలు చాలా ఇబ్బందికి గురవుతారు. ఆ టచ్ వాళ్లని చాలా కాలంపాటు వెంటాడుతుంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ క్యారెక్టర్ ఉంటుంది. పాటలకు, రొమాన్స్‌కే కాకుండా హీరోయిన్ క్యారెక్టర్‌ను ప్రత్యేకంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నాం. సినిమాలో వినోదంతో పాటు మంచి సందేశం కూడా ఉంటుంది.

ఆతర్వాత ప్రజల్లోకి వెళ్తా..

మేము ఆశించిన మేరకు 'వైశాఖం' చిత్రం కమర్షియల్‌గా సక్సెస్ అయింది. 'లవ్‌లీ' సినిమాకు కమర్షియల్‌గా సక్సెస్‌తో పాటు ప్రశంసలు కూడా లభించాయి. 'లక్కీ ఫెలో' చిత్రం 'లవ్‌లీ' కంటే చాలా పెద్ద హిట్ అవుతుంది. ఇందులో కమర్షియల్ ఎలిమెంట్స్ అన్నీ ఉంటాయి. ఇకనుంచి వైవిధ్యభరితమైన మంచి సినిమాలు తీసి ప్రేక్షకులను మైమరపించాలని కోరుకుంటున్నాను. అలాగే నా మార్క్ ఫిలిం ఒకటి చేయాలని ఉంది. ఆతర్వాత ప్రజల్లోకి వెళ్లి వారితో మమేకమై సేవ చేయాలని ఉంది.

సినిమాకున్న పవర్ అది...

ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో ఇద్దరు, ముగ్గురే మహిళా దర్శకులు ఉన్నారు. ఇంకా ఎంతోమంది చిత్ర పరిశ్రమలోకి రావాలి. మహిళా దర్శకుల సంఖ్య మరింత పెరగాలి. ఇక నాకు వెబ్ సిరీస్ చేసే ఆలోచన లేదు. నా ఫోకస్ అంతా సినిమాలపైనే. సినిమాలకున్న క్రేజ్ వెబ్ సిరీస్‌కు ఉండదు. ఇప్పటికీ చంటిగాడు, లవ్‌లీ, వైశాఖం చిత్రాల గురించి మాట్లాడుకుంటున్నారు అంటే అది సినిమాకున్న పవర్.

రొమాంటిక్ డ్రామా

నటిగా, నిర్మాతగా తనకంటూ ప్రత్యేకమైన పంథాను ఏర్పరచుకొని ఇప్పుడు దర్శకురాలిగా పరిచయమవుతున్నారు మంజుల ఘట్టమనేని. సూపర్ స్టార్ కృష్ణ కుమార్తె, మహేష్‌బాబు అక్క అయినప్పటికీ తండ్రి, తమ్ముడి స్టార్‌డమ్‌లను ఆసరాగా చేసుకోకుండా స్వయంకృషితో ఆమె ఎదిగారు. నటిగా 'షో' సినిమాతో ఆశ్చర్యపరిచిన మంజుల నిర్మాతగా 'పోకిరి' చిత్రంతో సరికొత్త రికార్డులు సృష్టించారు. ఇప్పుడు దర్శకురాలిగా 'మనసుకు నచ్చింది' అనే చిత్రంతో ప్రేక్షకులను పలకరించనున్నారు. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, ఇందిరా ప్రొడక్షన్స్ పతాకాలపై సంజయ్ స్వరూప్, పి.కిరణ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. సందీప్‌కిషన్, అమైరా దస్తూర్ జంటగా నటించిన ఈ చిత్రం ట్రైలర్‌ను సూపర్‌స్టార్ మహేష్‌బాబు ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. ఈ చిత్రం ఈనెల 26న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ సందర్భంగా దర్శకనిర్మాతలు మాట్లాడుతూ ''సినిమా ట్రైలర్‌కు విశేషమైన స్పందన లభించింది. రొమాంటిక్ డ్రామాగా రూపొందిన చిత్రం 'మనసుకు నచ్చింది'. రాధన్ సంగీత సారథ్యంలో రూపొందిన పాటలకు కూడా మంచి స్పందన వచ్చింది. త్వరలోనే ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించి ఈనెల 26న చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నాం''అని అన్నారు. త్రిధా చౌదరి, ప్రియదర్శి, పునర్నవి భూపాలం, నాజర్, అరుణ్ ఆదిత్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రవి యాదవ్, ఎడిటర్: సతీష్ సూర్య, కళ: హరివర్మ, మాటలు: సాయిమాధవ్ బుర్రా.



సందీప్‌కిషన్, అమైరా దస్తూర్

పూర్తి హారర్ థ్రిల్లర్



విజయ్ దేవరకొండ

'అర్జున్ రెడ్డి' చిత్రంతో తిరుగులేని పాపులారిటీని సంపాదించుకున్న యంగ్ హీరో విజయ్ దేవరకొండ. ఈ చిత్రం తర్వాత అతనికి ప్రేక్షకుల్లో భారీగా క్రేజ్ వచ్చింది. ఆతర్వాత ఆరు సినిమాలను ఓకే చేశాడు. ప్రస్తుతం మూడు సినిమాలు షూటింగ్‌లో ఉన్నాయి. 'అర్జున్ రెడ్డి' తర్వాత గీతాఆర్ట్స్ పతాకంపై రాహుల్ దర్శకత్వంలో చేస్తున్న సినిమానే అతని నెక్స్ట మూవీ. ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. అయితే ఇప్పటిదాకా యూత్‌ఫుల్ సినిమాలు చేస్తూ వచ్చిన విజయ్ దేవరకొండ ఇప్పుడు హర్రర్ జోనర్‌లో ఈ చిత్రాన్ని చేస్తున్నాడు. అయితే తెలుగులో హార్రర్ సినిమాలంటే కామెడీ కూడా ఉంటుంది. కానీ ఈ సినిమా అలా కాదట. పూర్తిగా హార్రర్ థ్రిల్లర్ అని తెలిసింది. దాదాపుగా పూర్తయిన ఈ సినిమా ఈ వేసవి ప్రారంభంలోనే విడుదలయ్యే అవకాశం ఉంది.

మల్టీస్టారర్‌లో రకుల్ ప్రీత్ సింగ్



రకుల్‌ప్రీత్ సింగ్

తన రేంజ్‌ను నిలకడగా పెంచుకుంటున్నాడు యంగ్‌స్టార్ నాని. మీడియం రేంజ్ హీరో నుంచి నాని మెల్లిగా స్టార్ హీరో రేంజ్ దిశగా వెళ్తున్నాడు. అయితే అప్పుడెప్పుడో 'ఈగ' సినిమాలో సమంతను మినహాయిస్తే ఇప్పటివరకు అతను స్టార్ హీరోయిన్‌లతో కలిసి పనిచేయలేదు. ఇప్పుడు నాని పక్కన నటించేందుకు ఓ టాప్ లీగ్ భామ ఓకే చెప్పిందని సమాచారం. ఇంతకీ ఆమె ఎవరో కాదు... రకుల్‌ప్రీత్ సింగ్. మహేష్‌బాబు 'స్పైడర్' తర్వాత ఇప్పటివరకు కొత్తగా ఏ తెలుగు సినిమాకు ఆమె సైన్ చేయలేదు. కానీ ఇప్పుడు నానీతో మూవీకి ఈ బ్యూటీ సైన్ చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ భామ తెలుగులో మంచి హిట్ కొట్టాలని అనుకుంటోంది. అలాంటి సమయంలో నాగార్జున, నాని కాంబినేషన్‌లో వస్తున్న మల్టీస్టారర్‌లో ఆమెకు ఛాన్స్ వచ్చింది. ఇందులో నానీకి జోడీగా రకుల్ చేయనుంది. దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య ఆమెకు ఈ అవకాశాన్ని అందించాడు. నానీపై ఉన్న నమ్మకంతో వెంటనే దీనికి ఒప్పుకుందంట ఈ పంజాబీ బ్యూటీ. ఇలా ఓ మల్టీస్టారర్‌లో ఆఫర్ అందుకున్న రకుల్ పాత్రకు ఇందులో ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని తెలిసింది.

లవ్, సెంటిమెంట్, యాక్షన్ మేళవింపుతో...

శ్రీనివాసరావు, ప్రణవి, చాందిని హీరోహీరోయిన్లుగా ఆర్.కె.డి. దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'శీనుగాడి ప్రేమ'. సిన్సియర్ రా మామా అనేది ఉపశీర్షిక. సుష్మా ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా పతాకంపై ధరిమిశెట్టి సత్యేశ్వరి నిర్మిస్తున్న చిత్రమిది. ప్రస్తుతం రీ రికార్డింగ్‌తో సహా అన్ని కార్యక్రమాలను పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్మాత ధరిమిశెట్టి సత్యేశ్వరి మాట్లాడుతూ ''మా చిత్రం అనుకున్న దానికంటే బాగా వచ్చింది. లవ్, సెంటిమెంట్, యాక్షన్, కామెడీ మేళవింపుతో ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది. సంగీత దర్శకులు రమణ కథకు అనుగుణంగా చక్కగా బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించారు'' అని అన్నారు. కావేరి, రాంపల్లి వెంకటరమణ, బీబీ బేగమ్, సునీత, రంజిత్, బుల్లెట్ సుధాకర్, గోల్డ్‌రెడ్డి, వి.వెంకట సుబ్బారావు, గణేష్, ఎ.వి.రావు తదితరులు ముఖ్య పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమెరా: సతీష్, సంగీతం: రమణ, డ్యాన్స్: ఉమాశంకర్, ఫైట్స్: మల్లి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు: సుష్మా ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా.



ప్రణవి, శ్రీనివాసరావు

అదే ప్రేమని అనుకుంటారు



కంగనారనౌత్

తన జీవితంలో ప్రేమకిక చోటు లేదని తేల్చేసింది బాలీవుడ్ బ్యూటీ కంగనారనౌత్. తెలుగులో 'ఏక్ నిరంజన్' చిత్రంలో నటించిన ఈ భామ సినిమాల్లోకి రాకముందు మోడలింగ్ రంగంలో ఉన్నప్పుడే పలువురితో ఎఫైర్స్ నడిపేసింది. సినిమాల్లోకి వచ్చాక ఆ ఎఫైర్లను కొనసాగించింది. ఇటీవల ఎవరూ ఊహించని విధంగా అకస్మాత్తుగా ఎఫైర్లకు ఫుల్‌స్టాప్ పెట్టేసి పూర్తిగా నటనపైనే దృష్టిపెట్టి బాలీవుడ్‌లో వరుస విజయాల్ని అందుకుంది కంగనారనౌత్. ఈ భామ యువతకు ఓ మంచి సందేశాన్ని కూడా ఇచ్చింది. ''భౌతిక ఆకర్షణనే చాలామంది ప్రేమని అనుకుంటారు. మొదట్లో నేను కూడా అలాగే అనుకొని మోసపోయాను. ప్రేమించడానికి మానసికంగా ఎంతో పరిణతి అవసరం. అప్పుడే సరైన వ్యక్తిని ప్రేమించగల్గుతాం''అని చెప్పింది కంగనారనౌత్.



జిఎస్‌టిఆర్–1 గడువు పొడిగించలేదు

న్యూఢిల్లీ : జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) రిటర్న్–1 గడువు తేదీని పొడిగించలేదని బుధవారం ప్రభుత్వం స్పష్టం చేసింది. వివిధ తరగతుల పన్ను చెల్లింపుదారులకు జిఎస్‌టిఆర్–1 గడువు తేదీ జనవరి 10తో ముగిసిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకటించింది. 2017 నవంబర్‌లో జిఎస్‌టి వసూళ్లు ఐదు నెలల కనిష్ఠానికి పడిపోయిన తర్వాత ప్రభుత్వం జిఎస్‌టి గడువు పొడిగించనుందని వార్తలు వెలువడ్డాయి. గతేడాది నవంబర్‌లో జిఎస్‌టి మండలి రూ.1.5 కోట్ల టర్నోవర్ కల్గిన వ్యాపారాలకు మూడు నెలల జిఎస్‌టి రిటర్న్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కాగా డిసెంబర్ 25 నాటికి రూ.80,808 కోట్ల జిఎస్‌టి పన్ను వసూళ్లు నమోదయ్యాయి. ఇంతకుముందు నవంబర్ నెలలో రూ.83,000 కోట్లుతో పోలిస్తే తగ్గుముఖం పటాయి. రూ.80,808 కోట్ల వసూళ్లలో రూ.7,798 కోట్లు పరిహార సెస్ కింద వచ్చాయి. కేంద్ర జిఎస్‌టి కింద రూ.13,089 కోట్లు నమోదయ్యాయి. మరో రూ.18,650 కోట్లు రాష్ట్ర జిఎస్‌టి కింద వసూళ్లయ్యాయి. జులైలో మొత్తంగా రూ.95,000 కోట్లు, ఆగస్టులో రూ.91,000 కోట్ల చొప్పున జిఎస్‌టి వసూళ్లు ఉన్నాయి. సెప్టెంబర్‌లో రూ.92,150 కోట్లు, అక్టోబర్‌లో రూ.83,000 కోట్ల చొప్పున వసూళ్లు నమోదయ్యాయి.

ఈ ఏడాదిలో పుంజుకోనుంది..



- ఇతర వర్ధమాన దేశాలకంటే వేగంగా భారత్ వృద్ధి
- 2018లో భారత్ జిడిపి అంచనా 7.3 శాతం : ప్రపంచ బ్యాంక్

న్యూఢిల్లీ : ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే భారత్ మరింత సామర్థ్యం కల్గి ఉందని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు భారత్ జిడిపి(స్థూల దేశీయోత్పత్తి)ని పెంచేందుకు దోహదం చేస్తాయని తెలిపింది. 2018లో భారత్ వృద్ధి రేటు 7.3 శాతంగా, వచ్చే రెండేళ్లలో 7.5 శాతంగా ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. డీమానిటైజేషన్(నోట్ల రద్దు), జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) అమలు వంటి నిర్ణయాలతో తాత్కాలికంగా మందగమనం చోటుచేసుకుందని, అందుకే 2017 సంవత్సరంలో 6.7 శాతం వృద్ధి రేటును అంచనా వేశామని 2018 గ్లోబల్ ఎకనమిక్స్ ప్రాస్పెక్ట్‌లో వరల్డ్ బ్యాంక్ వెల్లడించింది. వచ్చే దశాబ్దంలో అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే అత్యంత వేగంగా భారత్ వృద్ధిని చూపనుందని, ఇండియాకు ఆ సామర్థ్యం ఉందని ప్రపంచ బ్యాంక్ డెవలప్‌మెంట్ ప్రాస్పెక్ట్ గ్రూప్ డైరెక్టర్ అయాన్ కోస్ అన్నారు. అందువల్ల స్వల్పకాలిక గణాంకాలపై తాము దృష్టి పెట్టలేదని, వచ్చే సంవత్సరాల్లో భారత్ వృద్ధి అద్భుతంగా ఉండనుందని అంచనా వేశారు.



క్రమక్రమంగా పుంజుకోనుంది..

చైనాతో పోలిస్తే భారత్ వృద్ధి రేటు ప్రస్తుతానికి నెమ్మదించినా.. క్రమక్రమంగా వేగం పుంజుకుంటుందని అన్నారు. గత మూడేళ్లలో భారత్ వృద్ధి చాలా ఆరోగ్యకరంగా ఉందని కోస్ తెలిపారు. 2017లో చైనా 6.8శాతం వృద్ధి సాధించిందని, ఇది భారత్ కంటే 0.1శాతం ఎక్కువని అన్నారు. అదే సమయంలో 2018లో చైనాలో వృద్ధి రేటు అంచనా 6.4 శాతంగా ఉందని, అయితే ఆ తర్వాత రెండేళ్లలో వృద్ధిరేటు గణనీయంగా తగ్గి 6.3, 6.2 శాతాలకు పరిమితం కానుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉత్పాదక విషయంలో భారత్‌కు మంచి సామర్థ్యం ఉందని తెలిపారు. కార్మిక్, విద్య, ఆరోగ్యం విషయాల్లో సంస్కరణలు, పెట్టుబడులకు అవకాశాలు తదితర అంశాలు భారత్ సామర్థ్యాన్ని పెంచుతున్నాయని అన్నారు. భారత్‌లో సామర్థ్యంతో పాటు సవాళ్లు కూడా ఉన్నాయని, వాటిని పరిష్కరించుకునే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. అయితే ప్రభుత్వానికి ఈ సవాళ్లపై అవగాహన ఉందని, వాటిని పరిష్కరించడానికి సాధ్యమైనంత కృషి చేస్తోందని ప్రపంచబ్యాంకు అధికారి తెలిపారు. జనాభా భారత్‌కు అనుకూలమైన అంశమని, ఇతర ఆర్థిక వ్యవస్థల్లో ఇది అంతగా లేదని అన్నారు.

మహిళా కార్మిక శక్తి కీలకం

మహిళా కార్మిక శక్తిని మెరుగుపర్చుకోవడం భారత్‌కు కీలకమని, ఇతర ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే మహిళా కార్మిక శక్తిలో ఇండియా వెనుకబడి ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే యువత నిరుద్యోగాన్ని తగ్గించడం ప్రధానమని, ప్రైవేటు పెట్టుబడులను పెంచాలని అన్నారు. బ్యాంకుల ఆస్తుల నాణ్యత, మొండి బకాయిలు వంటి సమస్యలు భారత్‌కు తెలుసని, వీటిని పరిష్కరించుకుంటే ఇంకా సామర్థ్యం మెరుగువుతుందని ఆయన స్పష్టం చేశారు. జిఎస్‌టి కీలకమైనదని భావించిన భారత్.. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని అమలు వరకు తీసుకొచ్చిందని, బ్యాంకులకు మూలధనం అందించాలనే నిర్ణయం స్వాగతించదగిందని తెలిపారు.

బజాజ్ ఆటో నుంచి కొత్త డిస్కవర్ 110సిసి, 125 సిసి



న్యూఢిల్లీ: పుణెకు చెందిన బజాజ్ ఆటో కంపెనీ బుధవారం కొత్త మోడల్ బైక్‌లను లాంచ్ చేసింది. డిస్కవర్ 110 సిసి, 125 సిసి మోడళ్ల ధరలు వరుసగా రూ.50,176, రూ.53,171 నుంచి రూ.55,994గా(ఢిల్లీ ఎక్స్‌షోరూం) ఉన్నాయి. పూర్తిగా కొత్త ఇంజిన్‌తో రూపొందించారు. కొత్త డిస్కో 1.9 మిలియన్ యూనిట్లు ప్రవేశపెట్టగా, దేశీయ మోటార్ సైకిల్ మార్కెట్‌లో 17 వాటా ఉంది. రానున్న రోజుల్ల బజాజ్ వాహనాల విక్రయాలు మరింతగా పుంజుకోనున్నాయని కంపెనీ భావిస్తోంది.

కస్టమర్లకు బ్యాంకుల సూచనలు

న్యూఢిల్లీ: ఆధార్ వివరాల భద్రతపై ఆందోళనలు పెరుగుతుండడంతో బ్యాంకులు అప్రమత్తమవుతున్నాయి. బ్యాంకు యాప్‌లను టార్గెట్ చేసుకుని మాల్వేర్ దాడులు జరగనున్నాయనే వార్తల నేపథ్యంలో బ్యాంకులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాయి. ఐడిబిఐ బ్యాంకు ఇప్పటికే తన కస్టమర్లందర్ని జాగ్రత్తగా ఉండాలంటూ సూచించింది. మొబైల్ బ్యాంకింగ్ వాడేటప్పుడు ఉత్తమ విధానాలను పాటించాలని పేర్కొంది. నమ్మకం లేని వర్గాల నుంచి ఏమైనా అప్లికేషన్ల వస్తే వాటిని ఇన్‌స్టాల్ చేయొద్దని కూడా సూచిస్తోంది. బ్యాంకింగ్ లావాదేవీల కోసం జైల్ బ్రోకెన్, రూటెడ్ మొబైల్స్ వాడే వారిని కూడా ఈ బ్యాంకు హెచ్చరిస్తోంది. జైల్‌బ్రోకెన్ ఐఫోన్లు అధికారిక యాప్ స్టోర్ ద్వారా కాకుండా ఈ యాప్స్ ఇన్‌స్టాల్ అవడానికి అనుమతి ఇస్తున్నాయని తెలిపింది. మరో ప్రైవేట్ బ్యాంకు కరూర్ వైశ్యా బ్యాంకు కూడా ఇదే మాదిరి సూచనను కస్టమర్లకు జారీచేస్తోంది.

వివరాలు అందజేయండి



జైప్రకాష్ అసోసియేట్స్‌కు సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా నిర్మాణ ప్రక్రియలో ఉన్న హౌజింగ్ ప్రాజెక్ట్ వివరాలను అందజేయాలని రియల్ ఎస్టేట్ సంస్థ జైప్రకాష్ అసోసియేట్ లిమిటెడ్(జెఎఎల్)ను సుప్రీం కోర్టు ఆదేశించింది. డైరెక్టర్లు వ్యక్తిగత ఆస్తులను ఇతరులకు బదిలీ చేయరాదని కూడా కోర్టు స్పష్టం చేసింది. జెఎఎల్ ఇంటి కొనుగోలుదారుల కోసం పోర్టల్‌ను ఏర్పాటు చేయాలని అమికస్ క్యూరీ పవన్ శ్రీ అగర్వాల్‌ను బెంచ్ ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఆధ్వర్యంలోని ధర్మాసనం ఆదేశించింది. జెఎఎల్‌పై దివాలా చర్యలు ప్రారంభించాలనే పిటిషన్‌పై ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణను ఫిబ్రవరి 5కు కోర్టును వాయిదా వేసింది. డబ్బులు తీసుకుని ఇళ్ల నిర్మాణం పూర్తి చేయలేదని ఈ సంస్థపై ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొనుగోలుదారులకు రీఫండ్ చేసేందుకు రూ.2000 కోట్లను రిజిస్ట్రీలో జమ చేయాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే ఇందులో ఇప్పటి వరకు ఆ సంస్థ రూ.425 కోట్లు మాత్రమే డిపాజిట్ చేయగా, మరో రూ.125 కోట్లు జనవరి 25లోగా జమ చేయాలని డిసెంబరులో కోర్టు ఆదేశించింది. దీనిపై బుధవారం విచారణ జరగ్గా.. డిపాజిట్ విషయాన్ని కోర్టు గుర్తు చేసింది. నగదు జమ చేస్తారా లేదా తిహార్ జైలుకు వెళ్తారా? అంటూ హెచ్చరించింది. డైరెక్టర్లు తమ వ్యక్తిగత ఆస్తులను కుటుంబ సభ్యులకు బదిలీ చేయరాదని కోర్టు ఆదేశించింది.

వరుస లాభాలకు బ్రేక్



ముంబై: వరుసగా లాభాలతో దూసుకెళ్తున్న బుల్ జోరుకు బుధవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 10 పాయింట్లు నష్టపోయి 34,433 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 5 పాయింట్లు పడిపోయి 10,632 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ ప్రారంభంలో మార్కెట్లు తొలుత సరికొత్త గరిష్టాలను అందుకున్నా.. ఆ తర్వాత డీలా పడ్డాయి. ఓ దశలో సెన్సెక్స్ 34,565 కు చేరగా, నిఫ్టీ 10,655ను క్రాస్ చేసింది. ఎన్‌ఎస్ఇలో ఐటీ భారీగా 2.3 శాతం పెరగ్గా, ఆ తర్వాత రియల్టీ 1.3 శాతం పుంజుకుంది. పిఎస్‌యు బ్యాంక్స్ 1.4 శాతం పతనమవగా, ఆటో 0.7 శాతం బలహీనపడింది. నిఫ్టీ దిగ్గజాలలో టిసిఎస్, విప్రో, హెచ్‌సిఎల్ టెక్, టెక్ మహీంద్రా, కోల్ ఇండియా, హెచ్‌పిసిఎల్, ఇన్ఫోసిస్ పెరిగాయి. మరోపక్క యుపిఎల్, ఐషర్, ఎన్‌ఇపిసి, డాక్టర్ రెడ్డీస్, ఏసియన్ పెయింట్స్, బజాజ్ ఆటో, టాటా మోటార్స్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బిఐ, హిందాల్కో 1.61 శాతం మధ్య క్షీణించాయి.


బిఎస్‌ఇలో ట్రేడైన మొత్తం షేర్లలో 1607 నష్టపోగా, 1319 షేర్లు లాభపడ్డాయి. నగదు విభాగంలో మంగళవారం ఎఫ్‌పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు) దాదాపు రూ. 304 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. అలాగే దేశీ ఫండ్స్(డిఐఐలు) రూ. 523 కోట్లను ఇన్వెస్ట్ చేశాయి.

మూడేళ్ల గరిష్ఠానికి క్రూడ్ ఆయిల్



సింగపూర్: అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు మూడేళ్ల గరిష్ఠానికి చేరుకున్నాయి. 2014 డిసెంబర్ తరువాత చమురు బ్యారల్ మళ్లీ 63 డాలర్లను అధిగమించగా.. సోర్ క్రూడ్ బ్రెంట్ 69 డాలర్లను దాటేసింది. ప్రస్తుతం న్యూయార్క్ మార్కెట్లో నైమెక్స్ బ్యారల్ 0.9 శాతం ఎగసి 63.51 డాలర్లకు చేరగా, లండన్ మార్కెట్లో బ్రెంట్ 0.54 శాతం పెరిగి 69.20 డాలర్ల వద్ద ట్రేడయింది. ఇంతక్రితం 2014 డిసెంబర్‌లో మాత్రమే చమురు ధరలు ఈ స్థాయిలో ట్రేడయ్యాయి. 2017 ద్వితీయార్థం నుంచీ ఊపందుకున్న ఆయిల్ ధరలు గత ఆరు నెలల్లో 40 శాతం పెరిగాయి. విదేశీ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరిగితే దేశీయంగా ప్రతికూల పరిణామాలు ఏర్పడే అవకాశముంది. దేశీ అవసరాలలో 75 శాతం చమురు కోసం దిగుమతులపై ఆధారపడడంతో దిగుమతుల బిల్లు పెరిగి ప్రభుత్వంపై భారం పడుతుంది. డాలర్లలో చెల్లింపులు చేపట్టాల్సి ఉండటంతో ఇది రూపాయినీ బలహీనపరుస్తుంది. పెట్రోల్, డీజీల్ ధరలు పెరగడం వల్ల దేశీయంగా ధరలు పెరిగి ద్రవ్యోల్బణానికీ దారితీస్తుంది. ఒపెక్ దేశాలు 2017 జనవరి నుంచీ చమురు ఉత్పత్తిలో కోతలను అమలు చేస్తున్నాయి. గత కొన్నేళ్లుగా పతన బాటలో సాగుతున్న ధరలకు నిలకడ తీసుకువచ్చే బాటలో ఈ నిర్ణయం తీసుకున్నాయి. దీనికి రష్యా వంటి నాన్‌ఒపెక్ దేశాలు మద్దతు పలకడంతో ఇటీవల కొంత కాలంగా చమురు ధరలు బలపడుతూ వస్తున్నాయి. గత వారం ఇరాన్‌లో ఏర్పడిన రాజకీయ అనిశ్చితి చమురుధరల పెరుగుదలకు కారణమయ్యాయి. ఒపెక్ దేశాలలో ప్రాధాన్యమున్న ఇరాన్ రోజుకి 38 లక్షల బ్యారళ్ల చమురును ఉత్పత్తి చేస్తోంది. లిబియాలో పైప్‌లైన్ పేలడంతో ధరలకు రెక్కలొచ్చినట్లు నిపుణులు పేర్కొన్నారు. ఆర్థిక మాంద్యం తరువాత అమెరికా సహా జపాన్, యూరప్ దేశాల ఆర్థిక వ్యవస్థలు పురోగమిస్తుండడంతో చమురుకు డిమాండ్ పెరుగుతోంది.

మారుతీ సుజుకీ కార్ల ధరలు పెంపు



న్యూఢిల్లీ : దేశీయ అతిపెద్ద కారు తయారీ సంస్థ మారుతీ సుజుకీ తన కార్ల ధరలను రూ.1700 నుంచి రూ.17,000 వరకు పెంచింది. ఉత్పత్తి వ్యయం పెరగడం వల్ల తమ కార్ల ధరలు కూడా పెంచుతున్నట్టు కంపెనీ ప్రకటించింది. కమోడిటీ, అడ్మినిస్ట్రేటివ్, డిస్ట్రిబ్యూషన్ వ్యయాలు పెరగడంతో తమ మోడల్స్ అన్నింటి ధరలు పెంచుతున్నట్టు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. పెంచిన ధరలు వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపింది. మారుతీ సుజుకి హ్యాచ్‌బ్యాక్ ఆల్టో 800 నుంచి ప్రీమియం క్రాస్‌ఓవర్ ఎస్‌క్రాస్ వరకు మోడల్స్‌ను రూ.2.45 లక్షల నుంచి రూ.11.29 లక్షల శ్రేణిలో విక్రయిస్తోంది. జనవరి నుంచి ధరల పెంపును చేపడతామని మారుతీ గత నెలలోనే చెప్పింది. టాటా మోటార్స్ కూడా ఈ నెల 1 నుంచి తమ వెహికిల్స్‌పై రూ.25వేల వరకు ధరలు పెంచింది. అలాగే హ్యుందాయ్ మోటార్ ఇండియా, హోండా కార్లు, మహీంద్రా అండ్ మహీంద్రా కూడా ఇప్పటికే తమ వాహనాల ధరలను పెంచుతామని తెలిపాయి.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	34433.07	10.12	(0.03%)
నిఫ్టీ	10632.20	4.80	(0.05%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28140	30096.26	0%
ముంబై	29060	31080.21	0.21%
ఢిల్లీ	28550	30534.76	0.18%
కోల్‌కతా	29060	31080.21	0%
కేరళ	27350	29251.34	0%
బెంగళూరు	27760	29689.84	0.22%
హైదరాబాద్	28210	30171.12	0.14%
గల్ఫ్	0		0%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	41900.00	42000.00	0.24
ముంబై	41900.00	42000.00	0.24
ఢిల్లీ	41900.00	42000.00	0.24
కోల్‌కతా	41900.00	42000.00	0.24
హైదరాబాద్	41900.00	42000.00	0.24

కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	402	విశాఖపట్నం	402
వరంగల్	404	చిత్తూరు	398
విజయవాడ	400	చెన్నై	405
గోదావరి	402	బెంగళూరు	405

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
టిసిఎస్	2,816.00	2,694.65	2,806.60	2,709.00	97.60	3.60
విప్రో	327.85	315.10	326.70	317.20	9.50	2.99
హెచ్‌సిఎల్ టెక్	918.00	891.10	915.85	893.85	22.00	2.46
హెచ్‌పిసిఎల్	427.90	413.25	424.55	417.25	7.30	1.75
టెక్ మహీంద్రా	544.00	533.80	542.10	533.85	8.25	1.55
కోల్ ఇండియా	309.80	305.00	308.30	304.05	4.25	1.40
ఇన్ఫోసిస్	1,056.00	1,033.05	1,052.25	1,041.35	10.90	1.05
సిప్లా	624.15	612.85	619.75	615.60	4.15	0.67
భారతీ ఇన్ఫ్రాటెల్	373.00	364.60	370.80	368.40	2.40	0.65
అధాని పోర్ట్స్	427.90	418.75	423.45	421.10	2.35	0.56

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
ఐచర్ మోటార్స్	28,699.95	28,000.00	28,097.50	28,596.95	499.45	1.75
ఎన్‌టిపిసి	176.80	173.40	173.95	176.70	2.75	1.56
యుపిఎల్	794.00	774.05	778.85	790.60	11.75	1.49
ఏషియన్ పెయింట్స్	1,189.10	1,171.10	1,177.40	1,193.05	15.65	1.31
డా॥రెడ్డీస్ ల్యాబ్	2,472.00	2,420.00	2,425.80	2,457.80	32.00	1.30
బజాజ్ ఆటో	3,240.00	3,200.20	3,207.40	3,243.50	36.10	1.11
ఎస్‌బిఐ	305.85	300.00	301.10	304.30	3.20	1.05
ఇండియా బుల్స్	1,222.70	1,195.00	1,204.20	1,216.80	12.60	1.04
హిండాల్కో	276.50	266.60	268.80	271.50	2.70	0.99
గెయిల్	506.65	494.05	496.10	500.95	4.85	0.97

జైలులో సాయిబాబా జీవితానికి ముప్పు: భార్య వసంత



న్యూఢిల్లీ: జైలులో వైద్య సంరక్షణ లేకపోవడంతో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా జీవితానికి ప్రమాదం ఉందని ఆయన భార్య వసంత కుమారి పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 19 రకాల అనారోగ్యాలతో బాధపడుతున్నప్పటికీ, ఆయనకు సరైన వైద్య సదుపాయం కల్పించడం లేదన్నారు. కాలకృత్యాలు కూడా తీసుకోని పరిస్థితుల్లో సాయిబాబా ఉన్నారని ఆమె తెలిపారు. వైద్య కారణాలతో ఆయనను జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 90 శాతం అంగ వైకల్యంతో చక్రాల బండికి పరిమితమైన సాయిబాబాను తక్షణమే హైదరాబాద్ జైలుకు తరలించాలని ఆమె డిమాండ్ చేశారు. అధికారులు పథకం ప్రకారం సాయిబాబాను నెమ్మదిగా చనిపోయేలా చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితులలో సాయిబాబా బ్రతికే అవకాశాలు తక్కువగా ఉన్నాయని ప్రెస్ మీట్‌లో పాల్గొన్న ఢిల్లీ వర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నందిత నరైన్ పేర్కొన్నారు. ఢిల్లీ వర్సిటీలోని రామ్‌లాల్ ఆనంద్ కాలేజ్‌లో సాయిబాబా ఆంగ్ల ప్రొఫెసర్‌గా పని చేశారు. మావోయిస్టులతో సంబంధాలు ఉండటంతో గత ఏడాది ఆయనకు జీవిత ఖైదు విధించి, నాగ్‌పూర్ జైలులో ఉంచారు.

ఆధార్ వర్చువల్ ఐడి

○ ఉపసంహరణకు వీలుగా 16 అంకెల ర్యాండమ్ సంఖ్య

○ ఆధార్ గోప్యతను మెరుగుపరిచేందుకు కొత్త విధానం



న్యూఢిల్లీ: ఆధార్ గోప్యతను మరింత మెరుగుపరిచేందుకు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యుఐడిఎ) 'వర్చువల్ ఐడి' (దాదాపు వాస్తవిక ఐడి) అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నది. ఈ వర్చువల్ ఐడిని ఆధార్ కార్డు హోల్డర్ దాని వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు. టెలిఫోన్ సిమ్ వంటి వాటికి 12 అంకెల ఆధార్ ఐడి వివరాలను షేర్ చేసుకోడానికి బదులు ఈ వర్చువల్ ఐడిని ఇవ్వొచ్చు. దీంతో ధ్రువీకరణ సమయంలో బయోమెట్రిక్ ఐడి ఆధార్ సంఖ్యను ఇవ్వడానికి బదులు ప్రత్యామ్నాయమైన వర్చువల్ ఐడిని ఇవ్వొచ్చు. వర్చువల్ ఐడిలో యూజర్ పేరు, చిరునామా, ఫోటోగ్రాఫ్ వంటి పరిమిత వివరాలతో కూడిన 16 అంకెల ర్యాండమ్ సంఖ్య ఉంటుంది. ఆధార్ ధ్రువీకరణ కోరుకునే మొబైల్ కంపెనీ వంటి సంస్థలకు ఇది సరిపోతుంది. యూజర్ కావాలనుకున్నప్పుడల్లా వర్చువల్ ఐడిని తయారుచేసుకోవచ్చు(జనరేట్). కొత్త వర్చువల్ ఐడిని తయారు చేసినప్పుడల్లా పాత వర్చువల్ ఐడి రద్దవుతుంది. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యుఐడిఎఐ) దీంతోపాటు 'పరిమిత కెవైసి' పద్ధతిని కూడా ప్రవేశపెట్టింది. టెలికామ్ వంటి సేవలందించే సంస్థలు ధ్రువీకరణ వివరాలు కోరుకున్నప్పుడు యూజర్ పరిమిత వివరాలు ఇవ్వడానికి ఇది సరిపోతుంది.

మార్చి నుంచి ఆమోదం: వర్చువల్ ఐడి అనేది ఉపసంహరించుకోడానికి వీలుండే 16 అంకెల ర్యాండమ్ సంఖ్య (క్రమపద్ధతిలో ఉండక అడ్డదిడ్డంగా ఉండే సంఖ్య). ఇది ఆధార్ నెంబర్‌తో ముడిపడి ఉంటుంది. ఈ వర్చువల్ ఐడిని 2018 మార్చి 1 నుంచి ఆధార్ జారీ చేసే యుఐడిఎఐ ఆమోదించడం మొదలెడుతుంది. ఇక అన్ని సంస్థలు దీనిని 2018 జూన్ 1 నుంచి తప్పక అంగీకరించాల్సి ఉంటుంది. నిర్ణీత తేదీ నుంచి ఏ సంస్థలైన దీనిని అంగీకరించకుంటే కఠిన చర్యలు, జరిమానాలు తప్పవు.

సర్క్యులర్: 'కెవైసి సేవలు లేక ధ్రువీకరణ కోసం ఆధార్ సంఖ్య కావలసిన చోట ఆధార్ కార్డుదారులు వర్చువల్ ఐడిని ఉపయోగించి పని పూర్తికానిచ్చుకోవచ్చు. ఆధార్ నెంబర్‌ను ఉపయోగించినట్లుగానే వర్చువల్ సంఖ్యను కూడా ఉపయోగించి ధ్రువీకరణ పూర్తిచేసుకోవచ్చు' అని యుఐడిఎఐ సర్క్యులర్ తెలిపింది. ఆధార్ యూజర్లు యుఐడిఎఐ వెబ్‌సైట్‌కు వెళ్లి తమ వర్చువల్ ఐడిని తయారు చేసుకోవచ్చు. కొత్తది తయారుచేసుకునేంత వరకు పాతదే అమలులో ఉంటుంది. ఇ-కెవైసిని కోరుతున్న సంస్థలు ఆధార్ కార్డుదారుల 16 అంకెల వర్చువల్ ఐడిని ధ్రువీకరణకు ఉపయోగించాలని యుఐడిఎఐ ఆదేశించింది. ఇప్పటి వరకు 119 కోట్ల బయోమెట్రిక్ ఐడిలను జారీ చేశారు. వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డు రుజువును కోరుకుంటున్నాయన్న సంగతి తెలిసిందే. ఉదాహరణకు బ్యాంకు ఖాతాల ధ్రువీకరణకు, పాన్ కార్డుకు, మొబైల్ సిమ్‌కు.. ఇలా అన్నింటికీ ఆధార్‌ను అనుసంధానించారు.

సివిల్స్ మెయిన్స్ ఫలితాలు వెల్లడి

న్యూఢిల్లీ : సివిల్స్ మెయిన్స్ 2017 పరీక్షా ఫలితాలు బుధవారం వెల్లడయ్యాయి. పరీక్షా ఫలితాలను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిపిఎస్‌సి)ఒక ప్రకటన ద్వారా తెలిపింది. ఎంత మంది ఉత్తీర్ణత సాధించారనే విషయాన్ని యుపిపిఎస్‌సి వెల్లడించలేదు. యూపిపిఎస్సీ ఆధ్వర్యంలో అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకు మెయిన్స్ పరీక్షలు జరిగాయి. మూడు దశల్లో జరిగే సివిల్స్ పరీక్షల్లో రెండు దశలు పూర్తయ్యాయి. ఫిబ్రవరి 19 నుంచి ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఇంటర్వ్యూలకు హాజరవ్వాల్సిన వారి వివరాలను జనవరి 18 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. అభ్యర్థులు వాటిని డౌన్‌లోడ్ చేసుకునే సౌలభ్యం కూడా ఉంటుంది. ఇంటర్వ్యూలు పూర్తయిన 15 రోజుల తర్వాత పరీక్షలో వైఫల్యం చెందిన అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచనున్నారు. ఈ వివరాలు 60రోజులు పాటు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. సివిల్స్ పరీక్షలు నిర్వహించడం ద్వారా యూపిపిఎస్సీ ప్రతి ఏటా దాదాపు 1000 మందిని ఎంపిక చేస్తుంది. సివిల్స్‌లో ఎంపికైన వారు ఇండియన్ ఎడ్మినిస్ట్రేషన్ సర్వీసెస్ (ఐఎఎస్), ఇండియన్ ఫారిన్ సర్వీసెసె (ఐఎఫ్ఎస్), ఇండియన్ పోలీస్ సర్వీసెస్ (ఐపిఎస్) వంటి తదితర అనేక కీలక ప్రభుత్వ విభాగాల్లో చేరనున్నారు.

'పొలిటీషియన్' లాయర్లకు నోటీసులు!

దేశవ్యాప్తంగా 500మందికి జారీ చేసినట్లు సమాచారం

న్యూఢిల్లీ : ప్రజా ప్రతినిధులుగా ఉంటూ లాయర్ వృత్తిని కొనసాగిస్తున్న రాజకీయ నాయకులకు మంగళవారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నోటీసులు జారీ చేసింది. చట్ట సభలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపిలు, ఎంఎల్‌ఎలు న్యాయవాద వృత్తి చేపట్టకుండా బార్ కౌన్సిల్ ఎందుకు డీబార్ చేయకూడదో చెప్పాలని నోటీసుల్లో పేర్కొంది. వారం రోజుల్లోగా సమాధానాలకు గడువు ఇచ్చింది. ఈ విషయంపై నియమితమైన ముగ్గురు నిపుణుల కమిటీ దేశవ్యాప్తంగా 500 మందికి పైగా 'పొలిటీషియన్' లాయర్లకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఒకవేళ రాజకీయ నాయకులకు లాయర్లుగా కొనసాగే అర్హత లేదనే నిర్ణయం వెలువడితే, వారందరూ నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపణలకు దిగకుండా ఉండేందుకు ముందస్తుగా నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. బిజెపి నాయకుడు, న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ 'పొలిటీషియన్ లాయర్ల'ను డిబార్ చేయాలంటూ గతంలో భారతీయ ప్రధాన న్యాయమూర్తి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్‌లకు లేఖ రాశారు. అప్పుడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును లేఖలో ఉదహరించిన అశ్విని, ప్రభుత్వం నుంచి వేతనం అందుకుంటున్న ఓ వ్యక్తి లేదా సంస్థ లేదా కార్పొరేషన్ ఓ కోర్టులో న్యాయవాదిగా వాదించలేదని పేర్కొన్నారు. కాగా, రాజకీయ నాయకులు న్యాయవాద వృత్తి ని కొనసాగించాలా? వద్దా? అనే విషయంపై బార్ కౌన్సిల్ ఈ నెల 22న తుది విచారణ జరపనుంది.

నగల దుకాణాలపై ఐటి దాడులు



న్యూఢిల్లీ: పన్ను ఎగవేత ఆరోపణలు రావడంతో దక్షిణ భారత దేశానికి చెందిన రెండు ప్రధాన జ్యువెలరీ దుకాణాలతో సహా దేశ వ్యాప్తంగా 100 దుకాణాలపై బుధవారం ఆదాయ పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. కేరళకు చెందిన ఆభరణాల బృందం జోయ్‌అలుక్కాస్, దాని అనుబంధ సంస్థలపై దాడులు నిర్వహించింది. చెన్నై, హైదరాబాద్, త్రిస్సూర్ నగరాలతో సహా కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్‌లలో 130 చోట్ల అధికారులు దాడులు నిర్వహించారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత పన్ను ఎగ్గొట్టినట్లు రెండు ప్రధాన సంస్థలపై ఆరోపణలు వచ్చాయి. ఈ సంస్థలకు చెందిన ఖాతాల్లో భారీగా నగదు డిపాజిట్లు, పెద్ద మొత్తంలో బంగారం, వజ్రాలు, ఆభరణాలు విక్రయించినట్లు వెల్లడైందన్నారు. చెన్నైకి చెందిన 100 మంది ఆదాయ పన్ను శాఖ అధికారుల పర్యవేక్షణలో అనేక మంది పోలీసులు ఈ దాడుల్లో పాల్గొన్నారన్నారు.

సిద్ధరామయ్య హిందూ వ్యతిరేకి : అమిత్ షా



బెంగళూరు : కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్యపై బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. ఆయన రాష్ట్రంలో హిందువుల వ్యతిరేక ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ఆరోపించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. బుధవారం చిత్రదుర్గలో నిర్వహించిన పరివర్తన యాత్రలో అమిత్ షా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌పై దాడిలో భాగంగానే కర్నాటకలోనూ ఆ పార్టీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. రాష్ట్రానికి కేంద్రం ఏమీ చేయడం లేదని సిద్ధరామయ్య ప్రచారం చేస్తున్నారని ఆయనపై ధ్వజమెత్తారు. ఈ అంశంపై సిఎంకు జవాబు చెప్పేందుకే తానిక్కడికి వచ్చానన్నారు. యుపిఎ హాయంలోని 13వ ఆర్థిక సంఘం కర్నాటకకు రూ.88,583 కోట్లు కేటాయిస్తే, ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చిన తరువాత 14వ ఆర్థిక సంఘం రాష్ట్రానికి 2.19 లక్షల కోట్లను కేటాయించిందన్నారు. అసలు సిద్ధరామయ్య రాష్ట్రానికి ఏం చేశారని తాను ప్రశ్నిస్తున్నానన్నారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులు ఎక్కడికి పోయాయి, అవి మీ గ్రామానికి చేరాయా అని అమిత్ షా నిలదీశారు. ఐదేళ్ల క్రితం గుడిసెలో నివసించిన మీకు, ఇప్పుడున్న నాలుగు అంతస్థుల భవనం, ఇంటి ముందు ఓ కారు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. సిఎం బిజెపి, ఆర్ఎస్ఎస్, ఇతరులను నిందిస్తూ రాష్ట్రంలో అశాంతిని సృష్టిస్తున్నారని అమిత్ షాఆరోపించారు. కాగా, బిజెపి, ఆర్ఎస్ఎస్, బజరంగ దళ్ తీవ్రవాద సంస్థలు అని, రాష్ట్రంలో శాంతికి విఘాతం కలిగించే ఏ శక్తులనూ వదలబోమని, వాటిని క్షమించబోమని సిద్ధ రామయ్య వ్యాఖ్యానించారు.

మళ్లీ తెరపైకి సిక్కు అల్లర్ల కేసు

186 కేసుల్లో పునర్విచారణ

న్యూఢిల్లీ: 1984లో సిక్కులకు వ్యతిరేకంగా జరిగిన అల్లర్ల కేసు పునర్విచారణకు సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం చెలరేగిన అల్లర్లకు సంబంధించి గతంలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) మూసేసిన 186 కేసులను పునర్విచారించాలని నిర్ణయించింది. ఇందుకు మాజీ హైకోర్టు న్యాయమూర్తి, ఓ రిటైర్డ్ పోలీస్ అధికారి, మరో సర్వింగ్ పోలీస్ అధికారి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని నియమించినట్లు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఎం.ఎం.ఖాన్‌విల్కర్, డి.వై. చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఇందుకు తగిన పేర్లను సూచించమని కూడా కేంద్రాన్ని ధర్మాసనం కోరింది. రిటైర్డ్ పోలీస్ అధికారి పదవీ విరమణకు ముందు డిఐజి ర్యాంకుకన్నా తక్కువ వ్యక్తి కాకూడదని కూడా స్పష్టం చేసింది. నియమించిన పర్యవేక్షక సంస్థ 241 కేసులను కనుగొన్నదని, అందులో 186 కేసులు ఎలాంటి విచారణ జరపకుండా మూసేశారని రిటైర్డ్ జడ్జీలు రాధాకృష్ణన్, జె.ఎం. పంచల్ సమర్పించిన నివేదిక నేపథ్యంలో సుప్రీంకోర్టు కేసుల పునర్విచారణపై ఆదేశాలు జారీ చేసింది. పర్యవేక్షక సంస్థ అనేక తాళాలతో ఉన్న తోలు పెట్టెలో ఉంచి సమర్పించిన నివేదికన సుప్రీంకోర్టు బుధవారం అవలోకించింది. తర్వాతే ఆదేశాలు జారీ చేసింది.

సంక్రాంతికి 132 ప్రత్యేక రైళ్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాలకు 132 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) సిపిఆర్ఓ ఎం.ఉమాశంకర్ కుమార్ చెప్పారు. రైల్ నిలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్, కాచిగూడ, తిరుపతి రైల్వే స్టేషన్ల నుంచి ఎక్కువ రైళ్లు నడుపుతున్నట్లు వివరించారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో రెగ్యులర్ రైళ్లలో రిజర్వేషన్స్ పూర్తయ్యాయని, వెయిటింగ్ లిస్ట్ దృష్ట్యా అదనపు బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రద్దీని బట్టి జన సాధారణ రైళ్లను కూడా నడుపుతామన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సమస్యలు ఎదురుకాకుండా స్టేషన్లలో టికెట్ కౌంటర్లను కూడా పెంచామని, ప్రయాణికుల మధ్య ఎలాంటి తొక్కిసలాట జరగకుండా అవసరమైన భద్రత పరమైన చర్యలను కూడా చేపట్టామని ఆయన వివరించారు. ఈ నెల 11, 12 తేదీల్లో సికింద్రాబాద్ – కాకినాడ మధ్య అడ్వాన్స్ రిజర్వేషన్ అవసరం లేని పూర్తిగా 2వ తరగతి జనరల్ బోగీలతో జనసాధారణ్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ఆయన తెలిపారు. ఈ జనసాధారణ్ ప్రత్యేక రైళ్లు (నెం.07050) సికింద్రాబాద్ నుంచి రాత్రి 11:10 గంటలకు బయలుదేరి గుంటూరు, విజయవాడ మీదుగా మరుసటి రోజు ఉదయం 11 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటాయని వివరించారు.





సంక్రాంతి పర్వదినం దగ్గరపడుతుండడంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ప్రయాణికుల తాకిడి ఎక్కువైంది. బుధవారంనాడు వివిధ ప్రాంతాలకు వెళ్లే వారితో రైళ్లు కిక్కిరిసిపోయాయి. ఇసుకేస్తే రాలనంత జనంతో ఫ్లాట్ ఫాంలు నిండిపోయాయి.

ఎంపిలాడ్స్ పథకం కొనసాగింపు

న్యూఢిల్లీ: పార్లమెంట్ సభ్యుల స్థానిక ప్రాంతీయ అభివృద్ధి పథకాన్ని (ఎంపిలాడ్స్) 14వ ఆర్థిక సంఘం ముగిసే వరకు కొనసాగించేందు కు బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదించింది. ఈ పథకం వార్షిక కేటాయింపులు రూ.3,950 కోట్లుగా నిర్ణయించారు. వచ్చే మూడేళ్లలో మొత్తం కేటాయింపులు 11,850 కోట్లు కాగా, అదనంగా రూ.5 కోట్ల వార్షికంగా కేటాయించారు. ఈ మొత్తాన్ని స్వతంత్ర సంస్థ పర్యవేక్షిస్తుంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర, జిల్లా అధికారులకు సామర్థ్య నిర్మాణం, శిక్షణ ఇస్తారు. ఎంపి ల్యాడ్స్ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా నోడల్ అధికారులకు నిధులు విడుదల చేస్తారు. ఈ నిధులను స్థానికంగా తాగునీరు, విద్య, ప్రజారోగ్యం, పరిశుభ్రత, రోడ్లు తదితర అవసరాలకు వినియోగిస్తారు. స్థానిక ప్రజల జీవితాలపై ఎంపి ల్యాడ్స్ పథకం సామాజిక, సాంస్కృతిక, ఆర్థికంగా ప్రభావం చూపుతోంది.

కేంద్రీయ విద్యాలయాల్లో హిందూ మత ప్రార్థనలెందుకు?



న్యూఢిల్లీ: కేంద్రీయ విద్యాలయాల్లో విద్యార్థులందరూ హిందూమతం ఆధారంగా రూపొందించిన ప్రార్థనను తప్పనిసరిగా ఆలపించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై సమాధానమివ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. బుధవారం జస్టిస్ ఆర్‌ఎఫ్ నారిమన్, నవీన్ సిన్హాతో కూడిన ధర్మాసనం ఈమేరకు నోటీసులు జారీ చేసిం ది. తమ మత విశ్వాసాలతో సంబంధం లేకుండా విద్యార్థులందరూ ఈ ప్రార్థనను ఆలపించడాన్ని పిటిషనర్ వ్యతిరేకించారు. దేవుడు, మత విశ్వాసాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ స్వ భావం అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తోందని మధ్యప్రదేశ్‌కు చెందిన వినాయక్ షా, తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తమ జీవితంలో విద్యార్థులు రోజు వారీ సమస్యలను ఎదుర్కొనే శక్తిని పెంపొందించడానికి బదులుగా దైవాన్ని ఆశ్రయిస్తారని ఆయన పేర్కొన్నారు. సాధారణ ప్రార్థ నను అమలు చేయడం, మైనార్టీ వర్గాలకు చెందిన పిల్లలు, తల్లిదండ్రులు, నాస్తికుల పిల్లలు, ఇతరులకు రాజ్యాంగపరంగా సమ్మతి కాదని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు.

చిన్నారులపై చిరుత పంజా

చింద్వారా : మధ్యప్రదేశ్‌లో చిరుతపులి పంజా విసిరింది. చింద్వారా జిల్లాలోని వేర్వేరు గ్రామాల్లో ముగ్గురు చిన్నారులపై దాడి చేసి గోళ్లతో రక్కి దారుణంగా చంపేసింది. అందులో ఒకరిని నమిలేసింది. ఈ ఘటనలతో ఆయా గ్రామాల్లో, జిల్లాలోని అటవీ సరిహద్దు ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గత మూడు రోజులుగా ఈ ఘటనలు జరుగుతున్నాయని డివిజనల్ అటవీ అధికారి ఎస్ ఎస్ ఉద్దే పేర్కొన్నారు. మంగళవారం రాత్రి జిర్వాని గ్రామంలో 12 ఏళ్ల బాలుడిపైకి దూకి పంజాతో రక్కి చంపేసిందని, అనంతరం సగం దేహాన్ని తినేసిందని ఆయన చెప్పారు. అదే విధంగా మొహ్లిమాతా గ్రామంలో ఆదివారం వంట చెరుకు కోసం తన తల్లి, సోదరితో బయటకు వెళ్లిన బాలికపై కూడా చిరుత దాడి చేసిందన్నారు. అదే రోజు మరో ఘటన జరిగిందని చెప్పారు. బిజౌలి పత్తార్ గ్రామంలో పదేళ్ల బాలుడు తన ఇంట్లోనే ఆడుకుంటుండగా చిరుత ఆ బాలుడిపై దాడి చేసి ఇంట్లోని వంద మీటర్ల దూరం ఈడ్చుకొచ్చినట్లు ఆయన తెలిపారు. ఆదివారం జరిగిన ఈ దాడుల్లో ఇద్దరు బాలురు కూడా తీవ్రగాయాలపాలై మృతి చెందినట్లు ఉద్దే వెల్లడించారు.

జెఎన్‌యులో మరో విద్యార్థి అదృశ్యం



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జెఎన్‌యు)లో విద్యనభ్యసిస్తున్న మరో విద్యార్థి అదృశ్యమయ్యాడు. పిహెచ్‌డి చేస్తున్న 26 ఏళ్ల విద్యార్థి కాలేజీ క్యాంపస్‌లో కనిపించకుండా పోయినట్లు పోలీసులు తెలిపారు. లైఫ్ సైన్స్ కోర్సులో చేస్తున్న ముకుల్ జైన్ ఈనెల 8 నుంచి కనిపించడం లేదని వారు చెప్పారు. అదే రోజు సాయంత్రం విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు దాఖలైందన్నారు. వ్యక్తిగత సమస్యలు ఉన్నందునే మకుల్ అదృశ్యమైనట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఇప్పటి వరకు ఈ విషయంపై ఎవరినీ అనుమానించలేదన్నారు. ఇదిలా ఉండగా, 2016, అక్టోబర్ 15న కూడా నజీబ్ అహ్మద్ అనే విద్యార్థి యూనివర్శిటీ మహి–మాండ్వీ హాస్టల్‌లో అదృశ్యమయ్యాడు. అంతకు ముందు రోజు ఎబివిపి విద్యార్థులతో జరిగిన ఘర్షణే విద్యార్థి అదృశ్యానికి కారణమని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటన జరిగిన నెల రోజుల తరువాత విద్యార్థి తల్లి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన కుమారుడి కోసం గాలించేందుకు పోలీసులును ఆదేశించాల్సిందిగా ఆమె కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ కేసును మే 16న సిబిఐకి హైకోర్టు అప్పజెప్పింది. దీంతో సిబిఐ కేసుపై దర్యాప్తు జరుపుతోంది.

కల్బుర్గీ కేసు సిట్‌కు అప్పగించండి

న్యూఢిల్లీ: రచయిత, హేతువాది ఎం.ఎం.కల్బుర్గీ హత్య దర్యాప్తును ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)కు అప్పగించాలని కోరుతూ కల్బుర్గీ భార్య ఉమాదేవి కల్బుర్గీ బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కల్బుర్గీ హత్య కేసులో దర్యాప్తు సంస్థలు ఎలాంటి పురోగతి సాధించలేదని ఆమె ఆరోపించారు. దీనిపై ఆరు వారాల్లో తమ ప్రతిస్పందన ఏమిటో తెలుపాలని దర్యాప్తు సంస్థలు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఎ), కేంద్ర పరిశోధన సంస్థ(సిబిఐ) , అలాగే మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఉమాదేశీ కల్బుర్గీ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఎ.ఎం.ఖాన్‌విల్కర్, డి.వై. చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం స్వీకరించి ఎన్ఐఎ, సిబిఐ, రెండు రాష్ట్రప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. కల్బుర్గీ భార్య తన పిటిషన్‌ను న్యాయవాది కృష్ణ కుమార్ ద్వారా దాఖలు చేశారు.

యశ్వంత్‌కు మద్దతివ్వడంతోనే... నా ఇల్లు కూల్చివేత: శత్రుఘ్న సిన్హా

న్యూఢిల్లీ: ముంబయిలో తన ఇంటిపై నిర్మించిన అక్రమ కట్టడాలను మున్సిపల్ అధికారులు కూల్చివేసిన రెండో రోజుల అనంతరం బిజెపి ఎంపి శత్రుఘ్న సిన్హా స్పందించారు. మహారాష్ట్రలోని సతారా రైతులకు మద్దతుగా యశ్వంత్ సిన్హా చేస్తున్న ధర్నాకు మద్దతు పర్యావసానమే కూల్చివేతకు కారణమమని ఆయన ట్వీట్ చేశారు. నిజాయితీగా రాజకీయాలు చేసినందుకు తాను మూల్యం చెల్లించుకున్నానని ప్రజలంటున్నారనిపేర్కొన్నారు. ఢిల్లీలో తనకు భద్రతను తగ్గిస్తున్నారని, ఇప్పుడు తన ఇంటిని కూల్చివేశారన్నారు. బిజెపి అగ్ర నేతలతో విభేదాలున్న యశ్వంత్ సిన్హా కు మద్దతు ప్రకటించిన వెంటనే శత్రుఘ్న సిన్హా ఇల్లు కూల్చివేసేందుకు అధికారులు నోటీసు పంపారు. ముంబయిలో ఎనిమిది అంతస్థుల భవనాన్ని నిర్మించుకున్న శత్రుఘ్న సిన్హా, కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు.



ఉత్తర కొరియాతో సమగ్ర చర్చలకు సియోల్ సిద్ధం

సియోల్: అణ్వాయుధ ప్రతిష్టంభన పరిష్కారానికి ఉత్తర కొరియాతో మరిన్ని సార్లు చర్చలు జరపడానికి దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జె యున్ సంసిద్ధత వ్యక్తం చేశారు. కొన్ని షరతులకు ఉత్తర కొరియా నేత కిమ్ అంగీకరిస్తే చర్చలను ముందుకు తీసుకుపోతామని అన్నారు. షరతులపై కిమ్‌తో శిఖరాగ్ర సభ ఆలోచనను మూన్ జె ఇంతకు ముందు వ్యక్తం చేశారు. వచ్చే నెల జరగనున్న శీతాకాల ఒలింపిక్స్‌లో పాల్గొంటూ, చర్చల కోసం ప్రతినిధి వర్గాన్ని పంపడానికి ఉత్తర కొరియా అంగీకరించింది. శత్రుత్వాలను తగ్గించుకోడానికి సైనిక స్థాయి చర్చలు జరుపుతామని ఇరు దేశాలు అవగాహనకు వచ్చాయి. మంగళవారం నాడు జరిగిన తొలి సమావేశంలో ఈ అంగీకారం కుదిరింది. గత రెండు ఏళ్లల్లో ఇది ఇరుదేశాల తొలి సమావేశం. ఉత్తర కొరియా సుహృద్భావ చర్యల నుంచి అధికంగా ఆశించవద్దని దక్షిణ కొరియాను రాజకీయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉత్తర కొరియా ఒలింపిక్స్‌లో పాల్గొనబోవడాన్ని మీడియా సమావేశంలో కిమ్ జోన్ ప్రశంసించారు.

వలసలకు ప్రతిభే గీటురాయి

● కుటుంబ సభ్యుని స్పాన్సర్‌షిప్ పద్ధతికి స్వస్తి ● ట్రంప్ తాజా ప్రతిపాదనలు



వలస విధానంపై ప్రకటన చేస్తున్న ట్రంప్

వాషింగ్టన్: అక్రమ వలసలను అరికట్టడానికి సంస్కరణలు చేపట్టాలని అమెరికా యోచిస్తోంది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు ట్రంప్ ప్రతిభ ఆధారిత వలసల వ్యవస్థను బుధవారం నాడు ప్రతిపాదించారు. 'అత్యంత ఉన్నతమైన ట్రాక్ రికార్డు' ఉన్నవారినే దేశంలోకి అనుమతించే వ్యవస్థ అది. అమెరికాలోకి అత్యంత వేగంగా చట్టబద్ధమైన ప్రవేశం పొందే అవకాశం ఇస్తున్న స్పాన్సర్ షిప్ పద్ధతికి కూడా స్వస్తి పలకాలని ఆయన పిలుపునిచ్చారు. అమెరికాలో న్యాయబద్ధమైన నివాసిగా లేదా పౌరునిగా ఉన్న కుటుంబ సభ్యుడు ఒకరు స్పాన్సర్ చేసే పద్ధతి వల్ల గొలుసుకట్టు వలసలకు అవకాశం కలుగుతోందని దీనికి అంతం పలకాలని ట్రంప్ యోచిస్తున్నారు. అమెరికాకు మొత్తం వలసల సంఖ్యను కుదించడానికి ప్రతిభ ఆధారిత పద్ధతిని ఆయన సూచిస్తున్నారు. కెనడా, ఆస్ట్రేలియాల్లో ఉన్నట్టుగా ప్రతిభ ఆధారిత వలసల వ్యవస్థను తాను ఇష్టపడతానని ట్రంప్ చెప్పారు. సంబంధిత బిల్లులో 'ప్రతిభ' అనే పదం చేర్చాలని ఆయన సూచించారు. వైట్ హౌస్‌లో చట్ట సభ సభ్యుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ఈ విషయం చెప్పారు. ప్రస్తుత వలసల పద్ధతి ప్రతిభ ఆధారంగా లేదని ఆయన తప్పుబట్టారు. 21వ శతాబ్దంలో దేశం గెలుపొందాలంటే ప్రతిభ ఆధారిత వలసల వ్యవస్థ తప్పదని అన్నారు. అనేక మంది చట్ట సభ సభ్యులు ట్రంప్ సూచనకు మద్దతు పలికారు. పిల్లల వలసలు (డిఎసిఎ) వాయిదాపడి, వలసల నియంత్రణకు సరిహద్దు భద్రతను పెంచి, గొలుసుకట్టు స్పాన్సర్ షిప్ వలసలకు ముగింపు పలకాలని వైట్ హౌస్ మెజారిటీ నాయకుడు, కాంగ్రెస్ సభ్యుడు కెవిన్ మెక్ కార్తీ సూచించారు. ప్రతిభను కూడా చేర్చండని ట్రంప్ కల్పించుకొని అన్నారు.

హెచ్–1బి నిర్ణయంపై ఎన్‌ఆర్‌ఐల హర్షం


హెచ్ –బి వీసాల పొడిగింపును అడ్డుకోబోమని ట్రంప్ పాలనా యంత్రాంగం చేసిన ప్రకటనకు ఇండియన్–అమెరికన్లు బుధవారం నాడు హర్షం ప్రకటించారు. ఆ వినాశకర యోచనను విరమించకపోతే దేశం నుంచి మేధావుల వలసలు పెరిగి అమెరికా వ్యాపారం దెబ్బతినేదని వారన్నారు. ఇండియన్– అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు రాజా క్రిష్ణమూర్తి మంగళవారం నాడు వలస సర్వీసుల అధికార్లు చేసిన తాజా ప్రకటనను ప్రశంసించారు. దేశీయ కార్మికుల నైపుణ్యాన్ని పెంచడానికి ప్రయత్నిస్తూనే హెచ్–బి వీసాల పొడిగింపును అనుమతించాలని ఆయన సూచించారు. అలాకాకుండా వారిని స్వదేశాలకు తిప్పిపంపితే అమెరికా వ్యాపార రంగానికి అపార నష్టం కలిగేదని కూడా ఆయన అన్నారు. హిందూ, అమెరికన్ ఫౌండేషన్ (హెచ్ఎఎస్) ఇడి సుహాగ్ శుక్లా కూడా అదే తీరుగా స్పందించారు. హెచ్–1బి వీసాల పద్ధతి మార్పు లేకుండా యథావిధిగా కొనసాగుతుందన్న ప్రకటనను ప్రజాప్రతినిధుల సభ సభ్యులు కూడా ప్రశంసించారు. తుల్సీ గిబ్బార్డ్, కెవిన్ యోధర్ ఆ మేరకు ప్రకటనలు చేశారు.

దావోస్‌లో ఈ నెల ట్రంప్, మోడీ సమావేశం

ప్రపంచ ఆర్థిక ఫోరం శిఖరాగ్ర సభ నేపథ్యం

వాషింగ్టన్: దావోస్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరం సమావేశానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ నెల ఉత్తరార్ధంలో హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఆయన భారత ప్రధాని నరేంద్ర మోడీని కలుసుకునే అవకాశం ఉంది. ప్రపంచ ఆర్థిక నేతల సమావేశానికి గత 18 ఏళ్లల్లో అమెరికా అధ్యక్షుడు హాజరవ్వడం ఇదే తొలిసారి కానుంది. 'అమెరికా ఫస్ట్' ఎజెండాను ముందుకు తీసుకుపోవడానికి ఈ అవకాశాన్ని ట్రంప్ వినియోగించుకుంటారని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ సారా సాండర్సన్ విలేకరులకు తెలిపారు. అయితే ఆయన ఖచ్చితంగా ఏ తేదీల్లో అక్కడ ఉంటారో ఇంకా ఖరారు కాలేదు. ఈ నెల 22న ఈ సమావేశం కోసం ప్రధాని మోడీ స్విట్జర్లాండ్ పయన మవుతారు. ఆయన మొత్తం రెండు రోజులు పర్యటిస్తారు. డబ్ల్యుఇఎఫ్ ప్లీనరీ సమావేశంలో మోడీ ప్రసంగిస్తారు. 1997 తర్వాత భారతీయ ప్రధాని దావోస్ శిఖరాగ్ర సభకు హాజరవుతున్నారు.

బ్రిటన్ కేబినెట్‌లో ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి అల్లుడికి చోటు



లండన్ : బ్రిటన్ ప్రధాని థెరిసా మే ఇద్దరు భారతీయ సంతతి ఎంపిలకు తన క్యాబినెట్‌లో స్థానం కల్పించారు. ఆ ఇద్దరిలో ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి అల్లుడు రిషి సునక్ ఒకరు. థెరిసా మేకు చెందిన కన్జర్వేటివ్ ప్రభుత్వం తాజాగా తన మంత్రిమండలిని విస్తరించింది. కొత్తగా మంత్రి బాధ్యతలు దక్కిన భారతీయ సంతతి వారిలో రిషి సునక్‌తో పాటు సుయెల్ల ఫెర్నాండెజ్ ఉన్నారు. ఎంపి ఫెర్నాండెజ్ పూర్వీకులు గోవాకు చెందినవారు. అయితే భారతీయ సంతతి ఎంపిలు ఇద్దరూ బ్రెగ్జిట్‌కు అనుకూలంగా ఓటేసిన వారే. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి అల్లుడు సునక్‌కు హౌసింగ్ శాఖ అప్పగించే అవకాశాలున్నాయి. నార్త్ యార్క్‌షైర్‌లోని రిచ్‌మండ్ నుంచి 2015లో ఆయన తొలిసారి ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2017 మళ్లీ ఎన్నికయ్యారు. 37 ఏళ్ల రిషి సునక్ ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాల్లో చదువుకున్నారు. బెంగుళూరుకు చెందిన ఓ సిలికాన్ వ్యాలీ కంపెనీలో సునక్ పెట్టుబడులు ఉన్నాయి.

పాక్‌లో జర్నలిస్టు అపహరణకు యత్నం



ఇస్లామాబాద్ : కిడ్నాప్ యత్నం నుండి తాను కొద్దిలో బయటపడ్డానని పాకిస్థాన్ సైనిక వ్యవస్థను తరచూ విమర్శించే ఆ దేశపు జర్నలిస్టు ఒకరు తెలిపారు. భద్రతా సర్వీసులు వారు తనను వేధిస్తున్నట్లు అతడు కొన్ని నెలల క్రితం ఆరోపించిన తర్వాత తాజా కిడ్నాప్ యత్నం జరిగింది. తాహ సిద్ధిఖీ అనే ఆ జర్నలిస్టు ఫ్రాన్స్ 24 అనే మీడియా సంస్థలో రిపోర్టర్. అంతేకాకుండా ఇండియన్ టెలివిజన్ ఛానెల్ 'వియాన్' బ్యూరో చీఫ్ కూడా. టాక్సీలో ఇస్లామాబాద్ విమానాశ్రయం వద్దకు తాను వెళుతుండగా ఈ కిడ్నాప్ యత్నం జరిగినట్లు అతడు ఆరోపించాడు. ఈ యత్నాన్ని మానవ హక్కుల బృందాలు ఖండించాయి.

అమెరికాతో సహకారాన్ని నిలిపేసిన పాక్?

వాషింగ్టన్: టెర్రరిస్టు గ్రూపులతో ఉగ్రంగా తలపడడానికి పాకిస్థాన్ అంగీకరిస్తుందని, ఈ అంశంపై చర్చలకు ముందుకు వస్తుందని అమెరికా బుధవారం నాడు ఆశాభావం వ్యక్తం చేసింది. అమెరికాతో సైనిక, గూఢచారి సహకారాన్ని పాకిస్థాన్ నిలిపివేసిన వార్తల మధ్య ఈ సమాచారం వెలువడింది. పాకిస్థాన్‌ను ఉగ్ర స్థావరాల స్వర్గధామంగా నూతన సంవత్సర ట్వీట్‌లో ట్రంప్ విమర్శించిన ఫలితంగా సైనిక గూఢచర్య సహకారాన్ని పాకిస్థాన్ నిలిపివేసిందని మీడియా వార్తలు తెలిపాయి. ఆ ట్వీట్‌లో అమెరికా సహాయానికి ప్రతిగా 'అబద్ధాలు, మోసం' పాక్ నుంచి అందాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ తాజా చర్యపై వివరణ కోరగా పాక్ నుంచి భవిష్యత్తులో సహకారాన్ని ఆశిస్తున్నామని అమెరికా విదేశాంగ శాఖ అండర్ సెక్రెటరీ స్టీవ్ గోల్డ్ స్టీన్ అన్నారు.

శ్రీలంక పార్లమెంట్‌లో ఎంపీల ఘర్షణ



కొలంబో: శ్రీలంక పార్లమెంట్‌లో ఎంపీలు బుధవారం నాడు ఆందోళనకు దిగా రు. ప్రధాని రణిల్ విక్రమసింఘే బాండ్ కమిషన్ నివేదికను ప్రవేశపెడుతున్న సమయంలో కొందరు ప్రతిపక్ష ఎంపిలు వెల్‌లోకి దూసుకువచ్చారు. దీంతో సభలో గందరగోళం నెలకొన్నది. అరపులు, నినాదాలతో హోరెత్తించారు. అదే సమయంలో ప్రభుత్వ, ప్రతిపక్ష ఎంపిల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. గందరగోళం మధ్య సభను స్పీకర్ పది నిమిషాలు వాయిదా వేశారు. బాండ్ కమిషన్ రిపోర్ట్‌ను చర్చించేందుకు ఇవాళ పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశమైంది. పార్లమెంట్‌లో ప్రధాని ప్రకటన చేస్తున్న సమయంలో 250 మంది ఎంపీలు ఉన్నారు. అయితే గొడవలో ఎంతమందికి గాయాలుఅయ్యాయో స్పష్టంగా తెలియదు. కానీ కొందరు ఎంపీల షర్ట్‌లు చిరిగాయి. సెంట్రల్ బ్యాంక్ మాజీ గవర్నర్ అల్లుడు అవినీతికి పాల్పడ్డారని, దాంట్లో సుమారు 72 మిలియన్ల డాలర్ల మేరకు అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ ఆరోపణలపై ఏర్పాటు చేసిన బాండ్ కమిషన్ రిపోర్ట్‌ను సభలో వెల్లడించారు.

గవర్నర్ నరసింహన్‌పై విష్ణుకుమార్ రాజు మళ్లీ ఫైర్

విశాఖ: ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ నరసింహన్‌పై బిజెపి ఎంఎల్ఎ విష్ణుకుమార్ రాజు మళ్లీ ఫైర్ అయ్యారు. గవర్నర్ ఏ రోజైనా కుటుంబ పెద్దలా వ్యవహరించారా? అని ప్రశ్నించారు. ఎపిలో పట్టుమని వారం రోజులైనా ఉన్నారా? అని ఆయన నిలదీశారు.నాలా బిల్లును ఆరు నెలలుగా పెండింగ్ పెట్టారని, గవర్నర్ కార్యాలయం సరిగా పనిచేయడం లేదని విష్ణుకుమార్ రాజు తీవ్ర ఆరోపణలు చేశారు. ఎపికి ప్రత్యేకంగా గవర్నర్ కావాలని పార్టీలకు అతీతంగా ఎంపీలందరూ కేంద్రాన్ని కోరాలని, తాము కూడా కేంద్రం, బిజెపి అధిష్టానాన్ని కోరతామని విష్ణుకుమార్‌రాజు అన్నారు.

యువతను మోసం చేసిండు : రోజా

చిత్తూరు: జాబు రావాలంటే బాబు రావాలని చెప్పిన చంద్రబాబు అధికారంలో వచ్చిన తరువాత యువతను మోసం చేశారని వైసిపి ఎమ్మెల్యే రోజా ఆరోపించారు.ఎపికి ప్రత్యేక హోదా, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ విషయంలో చెవుల్లో పూలుపెట్టుకొని పుత్తూరులో నిరసన ర్యాలీ చేప ట్టారు. ఎమ్మెల్యే రోజా ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో వైసిపి కార్య కర్త లతో పాటు పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు పాల్గొన్నారు.

తిరుపతి చేరుకున్న ఉపరాష్ట్రపతి

తిరుపతి: తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తిరుపతి చేరుకున్నారు. ఆయనకు తిరుపతి విమానాశ్రయంలో ఎపి మంత్రి అమర్‌నాథ్ రెడ్డి స్వాగతం పలికారు.బుధవారం రాత్రి తిరుమలలో బస చేయనున్న వెంకయ్య గురువారంశ్రీవారిని దర్శించుకోనున్నారు.

పోలీసుస్టేషన్ ఎదుట ఆత్మహత్యా యత్నం

పెందుర్తి(విశాఖ): జీవీఎంసీ 71వ వార్డు పరిధిలోని పాత పెందుర్తి ప్రాంతానికి చెందిన మునస మహాలక్ష్మి నాయుడు(45) బుధవారం పెందుర్తి పోలీసుస్టేషన్ ఎదురుగా ఆత్మహత్యకు ప్రయత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాలక్ష్మి నాయుడు గత అక్టోబర్‌లో భార్యను హత్యచేసి జైలుకెళ్లి ఇటీవల బెయిల్‌పై ఇంటికి వచ్చాడు. గత నాలుగు రోజులుగా అతడి భార్యకు సంబంధించిన బంధువులు పిల్లలను పట్టించుకోవడం లేదని పెందుర్తిలో ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన లక్ష్మి నాయుడు పెందుర్తి పోలీస్‌స్టేషన్ ఎదురుగా పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. క్షతగాత్రుడిని పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పెందుర్తి సీఐ మురళి తెలిపారు.

సిగరెట్‌లు అమ్మలేదని భారతీయుడి దారుణ హత్య

లండన్‌లో టీనేజర్ల ఘాతుకం



లండన్: ఉత్తర లండన్‌లోని టీనేజర్లకు సిగరెట్‌ను అమ్మడానికి తిరస్కరించిన భారత సంతతికి చెందిన దుకాణదారు హత్యకు గురయ్యారు. 49 ఏళ్ల విజయ్ పటేల్ అనే ఆ వ్యక్తిపై మిల్ హిల్ ప్రాంతంలో శనివారం రాత్రి ఈ దాడి జరిగింది. తీవ్రంగా గాయపడిన అతనిని ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతడు తలకు తగిలిన గట్టి దెబ్బల వలన మరణించాడు. ఈ దాడిలో పాల్గొన్న వారు పరారయ్యారు. వారిని పట్టుకోవాలని కోరుతూ మరణ శయ్యపై అతడి ఫొటోను పటేల్ కుటుంబం విడుదల చేసింది. పటేల్ ఇద్దరు బిడ్డల తండ్రి. అతడిని చంపినట్లు 16 ఏళ్ల బాలుడిపై కోర్టులో అభియోగాలు దాఖలయ్యాయి. ఆ బాలుడు కోర్టుకు హాజరయ్యాడు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు స్కాట్లాండ్ యార్డ్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గురు వ్యక్తులకు ఆ హత్యతో సంబంధం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఎటువంటి కవ్వింపు లేకుండా అప్పటికప్పుడు జరిగిన ఘటనగా ఈ హత్యను డెటెక్టివ్ ఇనిస్పెక్టర్ ఇయాన్ లాట్ పేర్కొన్నారు. తాము అడిగినది ఇవ్వనందుకే పటేల్‌ను ఆ టీనేజర్లు చంపినట్లు వివరించారు. పిన్న వయస్సు వారికి సిగరెట్ అమ్మరాదన్న చట్టం నియమానికి మద్దతుగా నిలిచిన ఒక మంచి వ్యక్తి చేయని నేరానికి బలయిపోయాడని పోలీసు అధికార్లు విచారం వ్యక్తం చేశారు. 18 ఏళ్లు దాటినట్లు రుజువులు చూపాలని ఆ యువకులను దుకాణం కార్మికుడు అంతకు ముందు అడిగాడు. రుజువులు చూపలేక యువకుల బృందం రెచ్చిపోయి ఈ నేరానికి పాల్పడింది.

'షెల్టర్ల ఏర్పాటు'పై సంయుక్త తనిఖీలు!

● ప్రత్యేక 'అర్బన్ దోస్త్' యాప్ రూపకల్పన


● పది రోజుల్లో నివేదిక సిద్ధం



మన తెలంగాణ/హైదరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రులలో షెల్టర్ల (ఆవాసం) ఏర్పాటుపై తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి సమగ్ర నివేదికను రూపొందించనుంది. ఆయా ఆస్పత్రుల వద్ద షెల్టర్లను ఏర్పాటు చేసే ముందు అక్కడి పరిస్థితులను, వచ్చే రోగుల సంఖ్య, వారి సహాయకులు, పరిసర ప్రాంతాలు తదితర అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేసి, షెల్టర్లను నిర్మించాలని మెప్మా నిర్ణయించింది. ఇందులో భాగంగానే టివివిపితో కలిసి సం యుక్త తనిఖీలను నిర్వహిస్తోంది.ఇప్పటికే సుమా రు 40 ప్రభుత్వ ఆస్పత్రులలో షెల్టర్ల ఏర్పాటుపై తనిఖీలను పూర్తి చేసినట్లు తెలిసింది. మిగిలిన ఆస్పత్రులలో కూడా త్వరలోనే తనిఖీలను పూర్తి చేసి పది రోజుల్లోనే సమగ్ర నివేదికను రూపొందించాలని టివివిపి, మెప్మా భావిస్తున్నది. మరో వైపు సాధారణ షెల్టర్ల ఏర్పాటుపై కూడా మెప్మా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. దీనికి సంబంధించి ''అర్బన్ దోస్త్'' యాప్‌ను ప్రారంభిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపకల్పనలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులలో రోగుల సహాయకులు, వారి బంధువుల సౌకర్యార్థం ఆస్పత్రి ప్రాంగణాలు, లేదా ఆ సమీప ప్రాంతాల్లో షెల్టర్లను ఏర్పాటు చేయాలని టివివిపి ప్రభుత్వానికి ప్రతిపాదించింది. మొత్తంగా 88 ప్రభుత్వ ఆస్పత్రులలో షెల్టర్లను ఏర్పా టు చేయాలని ఆ ప్రతిపాదనల్లో పేర్కొన్నది. ఇందులో మెప్మా పరిధిలో ఉన్న 55 ఆస్పత్రులలో షెల్టర్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా షెల్టర్‌ను నిర్మించాలని భావించిన మెప్మా అధికారులు ముందు గా వాటిని తనిఖీ చేయాలని నిర్ణయించారు. తనిఖీ చేసే సమయంలో అక్కడి ఆస్పత్రి పరిస్థితులు, నిర్మాణానికి ఉన్న అవకాశాలపై ప్రత్యేకంగా ఒక నమూనాను రూపొందించి, వాటి ఆధారంగా సమాచారాన్ని క్రోడికరిస్తున్నారు. ఇందులో ప్రధానంగా ఆస్పత్రికి రోజువారిగా వస్తున్న రోగుల సంఖ్యతో పాటు వారి సహాయకులు, వ్యాధులను, కనీసం ఒక రోగి అడ్మిట్‌తో పాటు డిశ్చార్జీ అంశాలను కూడా పరిగణలోకి తీసుకోనున్నారు. వాటి ఆధారంగా ఆయా ఆస్పత్రుల పరిస్థితులకు అనుగుణంగా షెల్టర్ డిజైన్ చేయనున్నారు. అయితే షెల్టర్ నిర్మాణానికి ఆస్పత్రులలో అందుబాటులో ఉన్న స్థలం, ఒక వేళ స్థలం లేకపోతే కనీసం ఆ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాన్ని గుర్తించాల్సి ఉంటుంది. షెల్టర్ నిర్మాణానికి కనీసం 2500 చదరపు అడుగుల స్థలాన్ని గుర్తించాల్సి ఉంటుంది. షెల్టర్‌ను ఏర్పాటు చేయడంతోపాటు అందుకు అవసరమైన సౌకర్యాలను కూడా కల్పించనున్నారు. కాగా మెప్మా అధికారులు కేవలం షెల్టర్ నిర్మాణానికే పరిమితం కానుండగా, షెల్టర్ నిర్వహణ బాధ్యతలు మాత్రం సం బంధిత ఆస్పత్రి వర్గాలే చూడాల్సి ఉంటుంది. తొలుత షెల్టర్ నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలని భావించినప్పటికీ ప్రస్తుతానికి మాత్రం ఆస్పత్రి వర్గాలకే నిర్వహణ బాధ్యతలను చూడనున్నట్లు తెలిసింది. షెల్టర్ల గుర్తింపు, నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరితగతిన పూర్తి చేయాలని మెప్మా ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించింది.

జన్మభూమితో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాం

టెలీ కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు



అమరావతి: ఈ జన్మభూమి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రజల్లో విశ్వాసం పెంచి సంతృప్తి స్థాయిని అధికం చేసిందని అభిప్రాయపడ్డారు. శాశ్వతమైన, మెరుగైన జీవన ప్రమాణాలకు జన్మభూమి నాంది పలికిందన్నారు. తొమ్మిదో రోజు జన్మభూమి నిర్వహణపై ముఖ్యమంత్రి చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లాల కలెక్టర్లు ఇందులో పాల్గొన్నారు. గత మూడున్నరేళ్లుగా అభివృద్ధిపై, ఆర్థిక అసమానతల తగ్గింపుపై దృష్టి పెట్టామని స్పష్టం చేసిన సీఎం స్వల్పకాలిక, మధ్య తరహా, దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేశామని గుర్తుచేశారు.ఇప్పటివరకు 9,51,822 ఫిర్యాదులు రాగా.. 6,85,104 అప్‌లోడ్ చేశారని, 2,16,272 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నారని సీఎం వివరించారు. విద్యార్థులు నెలకోసారి గ్రామాలను సందర్శించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఐఎస్‌వో 9001 సర్టిఫికేషన్ సాధించిన కృష్ణా జిల్లా కలెక్టర్‌కు సీఎం అభినందనలు తెలిపారు. కృష్ణా జిల్లా స్ఫూర్తితో ప్రతి కలెక్టరేట్‌లో ప్రమాణాలు పెరగాలని సూచించారు.


మార్చి చివరిలో బిసి రాజకీయ ప్లీనరీ

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్



మన తెలంగాణ /హైదరాబాద్/ముషీరాబాద్ : బిసిల రాజకీయ భవిష్యత్ దశా దిశను నిర్దేశించేందుకు మార్చి చివరి వారంలో 20 వేల మంది ప్రతినిధులతో బిసి రాజకీయ ప్లీనరీ నిర్వహించి బిసి డిక్లరేషన్ ప్రకటిస్తామని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హైదరాబాద్ దోమలగూడలోని బిసి భవన్‌లో ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ, నగరంలోని పాతబస్తీ మైనార్టీ స్థానాలు మినహా మిగతా 70 నియోజకవర్గాల్లో బిసిల్లో రాజకీయాలకతీతంగా చైతన్యం తీసుకు రావడానికి బిసి రాజకీయ సమ్మేళనాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 12న వరంగల్ జిల్లా కేంద్రంలో, 13న నల్గొండ జిల్లా దేవరకొండ, 20న యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో, 28న హైదరాబాద్‌లో, 30న నిజామాబాద్ జిల్లా బోధన్‌లో రాజకీయ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బిసి వ్యతిరేక పార్టీలకు వ్యతిరేకంగా బిసి రాజకీయ వేదిక ఏర్పాటు చేసిన ఎక్కడైతే రాజకీయ స్థానాలు ఇవ్వని పార్టీలకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాజకీయ పార్టీల జెండాలు మోస్తున్న బిసీలకు రాజకీయ అవకాశాలు మాత్రం దక్కడంలేదన్నారు. రాజకీయ అధికారంలో బిసిలకు దామాషా ప్రకారం టిక్కెట్లు ఇవ్వాలని, అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు బిసిలకు రాజకీయ డిక్లరేషన్ ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించారు. ఈ సమావేశంలో బిసి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నారాయణ, బిసి విద్యార్థి సంఘం అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, ఐదు జిల్లాల బిసి ఉద్యోగుల సంఘం ఇన్‌చార్జ్ రేవంత్, విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి నాగరాజు, నాయకులు శ్రీనివాస్, వరికుప్పల మధు, కొండ సుదీర్, మహేష్, జాజుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎసిబి వలలో మరో అవినీతి చేప




హైదరాబాద్: అవినీతి నిరోధక శాఖ వలలో మరో అవినీతి చేప చిక్కింది. ఆదాయానికి మిం చి ఆస్తులు కూడబెట్టారన్న అభియోగంపై తిరుపతి ఎస్వీ వర్సిటీ అసిస్టెంట్ ఇంజినీర్ ఎన్.రుద్రకుమార్ నివాసం సహా ఆయన సోదరి, సోదరుల ఇళ్లలో అనిశా విస్తృత సోదాలు చేస్తోంది. తిరుపతి, నెల్లూరులో ఉదయం 6 నుంచి ఆరు ప్రాంతాల్లో అనిశా అధికారుల బృందాలుగా విడిపోయి సోదాలు చేస్తున్నారు. తిరుపతి లక్ష్మీ శ్రీనివాస నగర్‌లోని రుద్రకుమార్ ఇంట్లో, ఎస్వీ యూ ఇంజినీరింగ్ విభాగ కార్యాలయం లో సోదాలు కొనసాగుతున్నాయి. తిరుపతిలోని రుద్రకుమార్ ఇద్దరు సోదరుల ఇళ్లలోనూ అధికారుల బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. తిరుపతి ఎస్వీయూ నాన్‌టీచింగ్ స్టాఫ్ క్వార్టర్స్‌లోని రుద్రకుమార్ సోదరి ఇంట్లో సహా, నెల్లూరులోని రుద్రకుమార్ బావమరిది ఇంట్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. రుద్రకుమార్‌పై అనేక అవినీతి, అక్రమార్జన ఆరోపణలు రావడంతో ప్రాథమిక ఆధారాలు సేకరించిన అనిశా అధికారులు ఏకకాలంలో సోదాలకు చేపట్టారు. రుద్రకుమార్ పేరిట సహా సోదరులు, సోదరి పేరిట బినామీ ఆస్తులను కనుగొన్నారు. పట్టుబడిన చర ,స్థిర ఆస్తులు, బంగారు, వెండి ఆభరణాల విలువను మదింపు చేస్తున్నారు.

పాండ్యకు మంచి భవిష్యత్తు: క్లూసెనర్



కేప్‌టౌన్: రానున్న రోజుల్లో హార్దిక్ పాండ్య ప్రపంచంలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్‌గా ఎదగడం ఖాయమని దక్షిణాఫ్రికా మాజీ దిగ్గజం లాన్స్ క్లూసెనర్ జోస్యం చెప్పాడు. ఇప్పటికే వన్డేలు, ట్వంటీ–20లలో మెరుగైన ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకున్న పాండ్య టెస్టుల్లోనూ అదే సంప్రదాయాన్ని కొనసాగించడం ఖాయమన్నాడు. దక్షిణాఫ్రికాపై తొలి టెస్టులో రాణించడం ద్వారా ఇప్పటికే తన సత్తా ఏంటో చాటాడని ప్రశంసించాడు. ఒత్తిడిలోనూ పాండ్య నిబ్బరంగా బ్యాటింగ్ చేయడం తనను ఎంతో ఆకట్టుకుందన్నాడు. అతనికి ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉందన్నాడు. బ్యాట్‌తో, బంతితో మెరుపులు మెరిపించే అపార నైపుణ్యం పాండ్య సొంతమన్నాడు. రానున్న రోజుల్లో భారత జట్టులో పాండ్య ముఖ్య భూమిక పోషించడం తథ్యమన్నాడు. ఒకప్పుడూ కపిల్‌దేవ్ మాదిరిగానే పాండ్య కూడా బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకున్నాడని పేర్కొన్నాడు. భారత్‌కు లభించిన మెరుగైన క్రికెటర్లలో పాండ్య ఒకడని క్లూసెనర్ అన్నాడు. ఇక, ఈ సిరీస్‌లో పాండ్య మరింత మెరుపు మెరిపించడం ఖాయమన్నాడు. మరోవైపు ఒక్క మ్యాచ్‌లో ఓడినంత మాత్రాన భారత్‌ను తక్కువ అంచన వేయలేమన్నాడు. మళ్లీ పుంజుకునే సత్తా కోహ్లిసేనకు ఉందన్నాడు.

విమర్శల సుడిలో కోహ్లి సేన..



మన తెలంగాణ/క్రీడా విభాగం

స్వదేశంలో సిరీస్‌ల మీద సిరీస్‌లు గెలిచి అదరగొట్టిన టీమిండియా బౌన్స్‌కు అనుకూలించే దక్షిణాఫ్రికా పిచ్‌లపై తేలిపోయింది. సఫారీలతో జరిగిన మొదటి టెస్టులో 208 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని సైతం అందుకోవడంలో కోహ్లి సేన ఘోరంగా విఫలమైంది. సౌతాఫ్రికా ప్రధాన బౌలర్ స్టెయిన్ బౌలింగ్‌కు దిగకున్న భారత్ స్వల్ప స్కోరుకే కుప్పకూలి అభిమానులను నిరాశ పరిచింది. కోహ్లి, పుజారా, ధావన్, విజయ్, రోహిత్, సాహి, పాండ్య వంటి స్టార్ బ్యాట్స్‌మెన్‌లతో కూడిన టీమిండియా 135 పరుగులకే చాప చుట్టేయడాన్ని క్రికెట్ అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. కిందటి ఏడాది టెస్టుల్లో ప్రకంపలు సృష్టించిన భారత్ ఫాస్ట్ బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌పై చేతులెత్తేసింది. బౌలర్లు అసాధారణ ప్రతిభతో సౌతాఫ్రికాను 130 పరుగులకే కుప్పకూల్చి టీమిండియా గెలుపు అవకాశాలను చిగురింప చేశారు. అయితే బ్యాట్స్‌మెన్ వైఫల్యంతో భారత్ అవమానకర రీతిలో ఓటమి పాలు కాక తప్పలేదు. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ కోహ్లి తీసుకున్న నిర్ణయాలు బెడిసి కొట్టాయని చెప్పాలి. ఫాస్ట్ పిచ్‌లపై మంచి రికార్డు కలిగిన అజింక్య రహానె, కెఎల్.రాహుల్‌లను పక్కనబెట్టి కోహ్లి పెద్ద తప్పిదమే చేశాడు. రహానె, రాహుల్‌లు బరిలోకి దిగి ఉంటే మ్యాచ్ పరిస్థితి మరో రకంగా ఉండేదని చెప్పడంలో అతిశయోక్తి లేదు. రోహిత్, ధావన్‌లతో పోల్చితే టెస్టుల్లో రహానె, రాహుల్‌లు మంచి బ్యాట్స్‌మెన్ అనడంలో సందేహం లేదు. దీనికి గతంలో వారు ఆడిన ఇన్నింగ్స్‌లే నిదర్శనం. ఇటీవల కాలంలో కోహ్లి రహానె, రాహుల్‌ను కావాలనే పక్కన బెడుతున్న విషయం స్పష్టమవుతోంది. ఇది జట్టుపై తీవ్ర ప్రభావాన్నే చూపుతోంది. దక్షిణాఫ్రికా వంటి బలమైన జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో సైతం ఇద్దరు కీలక బ్యాట్స్‌మెన్‌ను జట్టుకు దూరంగా ఉంచడం పెద్ద తప్పిదమేనని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. ఇక, తొలి టెస్టులో రహానెను పక్కన బెట్టడంపై మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ తీవ్ర విమర్శలు గుప్పించాడు. రహానెను నిర్లక్ష్యం చేయడాన్ని తాను ఎన్నో సార్లు ప్రశ్నించానని, అయితే కెప్టెన్ కోహ్లి మాత్రం తమ సలహాలు, సూచనలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశాడు. మాజీ దిగ్గజం సునీల్ గవాస్కర్ సైతం ఇలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. బౌన్సీ పిచ్‌లపై తాము ఆడలేమనే విషయాన్ని భారత ఆటగాళ్లు మరోసారి నిరూపించారని ఆరోపించాడు. ఇలాంటి జట్టుతో సిరీస్ గెలుపుపై ఆశలు పెట్టుకోవడం వృథా ప్రయాసేనని పేర్కొన్నాడు.

ఆ ఇద్దరికీ ఛాన్స్...

కేప్‌టౌన్: తొలి టెస్టుకు దూరంగా ఉన్న కీలక ఆటగాళ్లు లోకేష్ రాహుల్, అజింక్య రహానెలకు రెండో టెస్టులో చోటు దక్కే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. వీరిద్దరూ నెట్స్‌లో సుదీర్ఘ సమయం పాటు గడపడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. బౌన్స్‌కు అనుకూలించే సఫారీ పిచ్‌లపై రహానెకు మంచి అనుభవం ఉంది. గతంలో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో రహానె మెరుగైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఈ పరిస్థితుల్లో అతన్ని సౌతాఫ్రికాతో జరిగే మూడు టెస్టుల్లో ఆడించడం ఖాయమని అందరు భావించారు. కానీ, కెప్టెన్ కోహ్లి మాత్రం రహానెకు బదులు రోహిత్ శర్మకు చోటు కల్పించాడు. అంతేగా టెస్టుల్లో ధావన్ కంటే మెరుగైన ఓపెనర్‌గా పేరు తెచ్చుకున్న రాహుల్‌కు కూడా తుది జట్టుకు దూరంగా ఉంచాడు. ఈ రెండు నిర్ణయాలే టీమిండియా ఓటమికి ప్రధాన కారణమనే విమర్శలు సర్వత్రా వివవస్తున్నాయి. దీంతో కెప్టెన్ కోహ్లి తప్పులు సరిదిద్దుకోవడంపై దృష్టి పెట్టాడు. రెండో టెస్టులో రహానె, రోహిత్‌లకు చోటు కల్పించాలనే ఉద్దేశంతో ఉన్నట్టు సమాచారం. అంతేగాక రెండు ఇన్నింగ్స్‌లలో విఫలమైన వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహాకు బదులు పార్థివ్ పటేల్‌ను కూడా బరిలోకి దించే అవకాశాలను కొట్టి పారేయలేం. సాహాతో పోల్చితే పార్థివ్ బ్యాటింగ్ ఎంతో మెరుగ్గా ఉండడమే దీనికి కారణం. అంతేగాక బౌన్సీ పిచ్‌లపై పార్థివ్‌కు మంచి రికార్డే ఉంది. దీంతో అతన్ని రెండో టెస్టులో ఆడించిన ఆశ్చర్యం లేదు. ఇప్పటికే పార్థివ్ ముమ్మర సాధనలో నిమగ్నమయ్యాడు.



ఈసారి కూడా అదే వ్యూహంతో..



తొలి టెస్టులో భారత్‌పై సంచలన విజయం సాధించిన నేపథ్యంలో శనివారం ప్రారంభమయ్యే రెండో టెస్టులో కూడా నలుగురు సీమర్లతో బరిలోకి దిగాలనే ఉద్దేశంతో దక్షిణాఫ్రికా ఉంది. ఈ విషయాన్ని సౌతాఫ్రికా కోచ్ గిబ్సన్ సూచనప్రాయంగా వెల్లడించాడు. భారత్ తొలి టెస్టులో ఫాస్ట్ బౌలింగ్ ఉచ్చులో చిక్కుకున్న నేపథ్యంలో ఈసారి కూడా అదే వ్యూహంతో ముందుకు వెళ్లాలని జట్టు భావిస్తోంది. స్టెయిన్ స్థానంలో యువ పేసర్ డ్యుస్ ఒలివరన్‌ను ఎంపిక చేశారు. సెంచూరియన్ టెస్టులో కూడా ఫాస్ట్ పిచ్ తయారు చేయాలని దక్షిణాఫ్రికా కోచ్ క్యూరేటర్‌ను కోరినట్టు సమాచారం. ఇదే జరిగితే భారత బ్యాట్స్‌మెన్‌కు మరోసారి కఠిన పరీక్ష తప్పక పోవచ్చు.

ఒత్తిడి ఖాయం..

తొలి టెస్టులో ఘోర పరాజయం నేపథ్యంలో మిగిలిన రెండు మ్యాచుల్లో భారత్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొనడం ఖాయంగా కనిపిస్తోంది. తొలి మ్యాచ్ గెలుపుతో సౌతాఫ్రికా ఆత్మ విశ్వాసం రెట్టింపు అయ్యింది. ఇక, గెలిచే మ్యాచ్‌లో నిర్లక్ష్యంగా ఆడి ఓటమి కొని తెచ్చుకున్న భారత్‌పై ఒత్తిడి పెరిగి పోయింది. ఈ మ్యాచ్ కోహ్లి కెప్టెన్సీకి పరీక్షగా మారింది. ఇప్పటి వరకు సాధించిన విజయాలు ఒక వైపు ఇకపై జరిగే సిరీస్‌లలో గెలుపు మరో ఎత్తుగా చెప్పుకోవాలి. రెట్టించిన ఉత్సాహంతో బరిలోకి దిగనున్న దక్షిణాఫ్రికాను భారత్ ఎలా ఎదుర్కొంటుందో సగటు అభిమానికి అంతుబట్టకుండా మారింది. స్వల్ప లక్ష్యాన్ని సైతం ఛేదించలేక చేతులెత్తేసిన టీమిండియా మిగిలిన రెండు టెస్టుల్లో గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవడం కష్టమేనని చెప్పాలి. అందివచ్చిన సువర్ణ అవకాశాన్ని చేజార్చుకున్న కోహ్లి సేన భారీ మూల్యమే చెల్లించుకుంది. స్వల్ప లక్ష్యాన్ని సైతం కాపాడుకుని భారత్‌ను చిత్తుగా ఓడించిన దక్షిణాఫ్రికా ఇక క్లీన్‌స్వీప్‌పై దృష్టి పెట్టింది. మిగిలిన రెండు టెస్టుల్లోనూ గెలిచి భారత్‌నే వైట్ వాష్ చేయాలనే వ్యూహంతో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది అసాధ్యమని చెప్పలేం. ఎందుకంటే తొలి మ్యాచ్‌లో విఫలమైన స్టార్ ఆటగాళ్లు ఆమ్లా, డివిలియర్స్ మిగిలిన రెండు మ్యాచుల్లో భారీ స్కోర్లు సాధించడంపై దృష్టి పెట్టారు. ఇదే జరిగితే కోహ్లి సేన కష్టాలు మరింత పెరగడం ఖాయం.



విరాట్, శాస్త్రిపై బిసిసిఐ గుర్రు

ముంబయి: తొలి టెస్టు ఓటమితో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి, ప్రధాన కోచ్ రవిశాస్త్రి కష్టాలు రెట్టింపు అయ్యాయని చెప్పక తప్పదు. తాజాగా కోహ్లి, రవిశాస్త్రిలపై భారత క్రికెట్ బోర్డు (బిసిసిఐ) సైతం అసంతృప్తి వ్యక్తం చేసింది. దక్షిణాఫ్రికాలోని ఫాస్ట్ పిచ్‌ల నేపథ్యంలో మురళీ విజయ్, శిఖర్ ధావన్, అజింక్య రహానె, చటేశ్వర్ పుజారాలను ముందే పంపించేందుకు బిసిసిఐ ఆసక్తి కనబరిచింది. ఈ విషయాన్ని జట్టు మేనేజ్‌మెంట్ దృష్టికి కూడా తీసుకెళ్లింది. ముందస్తు పర్యటన కోసం అయ్యే ఖర్చులన్నీ తామే భరిస్తామని, దీనికి అంగీకరించాలని కెప్టెన్ కోహ్లి, ప్రధాన కోచ్ రవిశాస్త్రికి వివరించింది. అయితే బిసిసిఐ చేసిన సూచనను టీమ్ మేనేజ్‌మెంట్ తోసిపుచ్చింది. తమ సూచన పాటించి ఉంటే తొలి టెస్టులో ఇలా ఘోర పరాజయం ఎదురయ్యేది కాదని బోర్డు అధికారులు పేర్కొంటున్నారు. సౌతాఫ్రికా పరిస్థితులకు అలవాటు పడాలంటే కొంత మంది ప్రధాన క్రికెటర్లను ముందుగానే పంపిస్తే బాగుంటుందని తాము ముందే సూచించామని బిసిసిఐ ప్రతినిధి ఒకరు బుధవారం మీడియాతో మాట్లాడుతూ పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కెప్టెన్ కోహ్లి నిరంకుశంగా వ్యవహరిస్తూ బోర్డు సూచనలు సైతం పట్టించుకోవడం లేదనే విమర్శలు గుప్పుమన్నాయి. కోహ్లి, శాస్త్రిల తీరుపై ఇప్పుడు సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బిసిసిఐ సలహా పాటించి కీలక ఆటగాళ్లను ముందే సౌతాఫ్రికా పంపించి ఉన్నట్టయితే పరిస్థితులు జట్టుకు అనుకూలంగా ఉండేవని బిసిసిఐ పేర్కొంది. కీలకమైన సఫారీ టూర్ నేపథ్యంలో కొంత మంది సీనియర్ ఆటగాళ్లకు బోర్డు విశ్రాంతి కల్పించింది. అయితే ఈ విశ్రాంతి కల్పించిన ఆటగాళ్లను ముందే సౌతాఫ్రికా పంపించి ఉన్నట్టయితే పరిస్థితులు కొంత జట్టుకు అనుకూలంగా ఉండేవనే చెప్పక తప్పదు.

వివేక్ అవినీతికి పాల్పడ్డాడు

- టిసిఎ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

మన తెలంగాణ/హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు జి.వివేక్‌పై తెలంగాణ క్రికెట్ సంఘం (టిసిఎ) అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం లక్ష్మీనారాయణ కార్యదర్శి గురువారెడ్డితో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వివేక్‌పై నిప్పులు చెరిగారు. క్రికెట్‌లో ఓనమాలు తెలియని వివేక్ రాజకీయాలను అడ్డం పెట్టుకొని దొడ్డిదారిన అధ్యక్ష పదవిని దక్కించుకున్నారని ఆరోపించారు. వివేక్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, దీనికి సంబంధించిన సాక్ష్యాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాల్లో టోర్నమెంట్‌లు నిర్వహించకున్నా ఆ పేరు చెప్పుకొని నిధులు కాజేశారని తీవ్ర విమర్శలు చేశారు. గత రెండు ఏళ్ల కాలంలో దాదాపు రెండు కోట్ల రూపాయల నిధులు దారి మళ్లాయని ఆరోపించారు. వివేక్ తీరుతో హైదరాబాద్ క్రికెట్ సంఘానికి ఎంతో నష్టం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారాన్ని అడ్డంగా పెట్టుకొని వివేక్ సాగిస్తున్న ఆధిపత్యానికి త్వరలోనే గండి పడడం ఖాయమని వారు జోస్యం చెప్పారు. ఏనాటికైనా న్యాయం గెలుస్తుందనే నమ్మకం తమకుందన్నారు. హెచ్‌సిఎ కార్యదర్శిగా ఉన్న శేష్ నారాయణ్‌ను ఏ కారణం లేకుండానే సస్పెండ్ చేశారని, ఈ అధికారం అధ్యక్షుడికి ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. అంతేగాక, నిబంధనలకు విరుద్ధంగా దివంగత వెంకటస్వామి పేరుతో క్రికెట్ పోటీలు నిర్వహించడాన్ని తప్పుపట్టారు. బిసిసిఐ నిబంధనలను తుంగలో తొక్కి నిరంకుశంగా వ్యవహరిస్తున్న వివేక్‌పై చర్యలు తీసుకోవాలని లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. కాగా, హెచ్‌సిఎలో జరుగుతున్న అక్రమాలపై త్వరలోనే న్యాయ పోరాటం చేస్తామని లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు.

ఐర్లాండ్‌తో రెండు టి-20లు

ముంబయి: టీమిండియా ఈ ఏడాది జూన్‌లో ఐర్లాండ్‌తో రెండు మ్యాచ్‌ల ట్వంటీ–20 సిరీస్ ఆడనుంది. ఇంగ్లాండ్ పర్యటనకు ముందు ఈ సిరీస్ జరుగనుంది. ఈ విషయాన్ని బుధవారం బిసిసిఐ అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది జులైలో ఇంగ్లాండ్‌లో భారత్ పర్యటించనుంది. అయితే ఈ సిరీస్ ప్రారంభానికి ముందే భారత్ మరో రెండు మ్యాచ్‌ల టి–20 సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లో ఐర్లాండ్‌తో భారత్ తలపడుతుంది. జూన్ 27, 29 తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. భారత్, ఐర్లాండ్ జట్ల మధ్య ఇప్పటి వరకు ద్వైపాక్షిక టి–20 సిరీస్‌లు జరుగలేదు. రెండు జట్లు ఓ టి–20 సిరీస్‌లో తలపడడం ఇదే మొదటి సారి. స్వదేశంలో ఐపిఎల్ టోర్నమెంట్ ముగిసిన తర్వాత భారత జట్టు సుదీర్ఘ ఇంగ్లాండ్ పర్యటనకు బయలుదేరి వెళ్లనుంది. టెస్టు, వన్డే, టి–20 సిరీస్‌లలో ఇంగ్లాండ్‌ను ఎదుర్కొనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్డ్‌ను త్వరలోనే వెల్లడిస్తామని బిసిసిఐ కార్యదర్శి అమితాబ్ చౌదరి తెలిపారు.



బ్రాడ్‌మన్ రికార్డుకు బ్రేక్

అఫ్గాన్ కుర్రాడి సంచలనం

న్యూఢిల్లీ: ప్రపం క్రికెట్‌లో అత్యధిక సగటు సాధించిన క్రికెటర్ ఎవరంటే ఠక్కున లభించే సమాధానం ఆస్ట్రేలియా దిగ్గజం సర్ డాన్ బ్రాడ్‌మన్ మాత్రమే. అయితే ఉపఖండానికి చెందిన అఫ్గానిస్థాన్ యువ క్రికెటర్ బహీర్ షా ఈ రికార్డును తిరగరాశాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యధిక సగటు సాధించిన క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో ఇప్పటి వరకు బ్రాడ్‌మన్ పేరిట ఉన్న 95.14 బ్యాటింగ్ సగటును బహీర్ బద్దలు కొట్టాడు. 18 ఏళ్ల షా ప్రస్తుతం 121.77 సగటుతో ప్రపంచ క్రికెట్‌లో కొత్త రికార్డును నెలకొల్పాడు. ఈ క్రమంలో బ్రాడ్‌మన్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఇదే సమయంలో నాలుగు ఫస్ట్ క్లాస్ ఇన్నింగ్స్‌లు ఆడిన బహీర్‌షా 831 పరుగులు చేశాడు. ఈ సందర్భంగా బిల్ ఫాన్స్ ఫోర్ట్ పేరిట ఉన్న రికార్డు తిరగరాశాడు. ఈ మధ్యనే అత్యంత వేగంగా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో వెయ్యి పరుగుల మైలురాయిని అందుకున్నాడు. అంతేగాక తొలి ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లోనే 258 పరుగులతో నాటౌట్‌గా నిలిచి సంచలనం సృష్టించాడు. పాకిస్థాన్ మాజీ దిగ్గజం జావేద్ మియాందాద్ తర్వాత అత్యంత పిన్న వయసులో ట్రిపుల్ సెంచరీ సాధించిన రెండో క్రికెటర్‌గా బహీర్‌షా రికార్డు నెలకొల్పాడు. దక్షిణాఫ్రికా స్టార్ హాషిం ఆమ్లా బ్యాటింగ్ అంటే ఎంతో ఇష్టపడే బహీర్‌షా అతనిలాగే అంతర్జాతీయ క్రికెట్‌లో కూడా నిలకడగా రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.